వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

50 మంది బంగ్లాదేశీయుల తరలింపు

టిఎంసి బెంగాల్ చీఫ్ చంద్రిమ రాజీనామా

త్రిపుల్ ఇంజిన్ సర్కార్‌లో ఓటు, సీటు, విరాళాల చోరీ

07

సంపుటి 29, సంచిక: 16 | ఆదివారం | 05-07-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



## పైరసీ కంటెంట్ వ్యాప్తిని అరికట్టండి

'టెలిగ్రామ్'ను కోరిన ప్రభుత్వం

15 రోజుల్లోగా కార్యాచరణ నివేదిక ఇవ్వాలని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నోటీసు జారీ

**న్యూఢిల్లీ :** పైరేటెడ్ సినిమాలు ఒటిటి కంటెంట్, ఇతర ఆడియో విజువల్ అంశాలు తమ ప్లాట్‌ఫారమ్ ద్వారా విస్తృతంగా వ్యాప్తిచెందడాన్ని అరికట్టాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రముఖ మెస్సేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'కు నోటీసు జారీ చేసింది. శనివారం ప్రభుత్వ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తన నోటీసులో 15రోజులలోగా కార్యాచరణ నివేదికను ఇవ్వాలని కోరింది. పైరసీ కంటెంట్‌ను విడివిడిగా తొలగించడం నుండి 'ఫ్లాట్‌ఫారమ్ జవాబుదారీతనం' వైపు ప్రభుత్వ విధానంలో ఒక మార్పును సూచిస్తుందని అధికారులు నొక్కిచెప్పారు. నీట్ పున:పరీక్ష సమయంలో ఎలాంటి పేపర్‌లీక్ జరగకుండా నివారించేముందు జాగ్రత్తచర్యగా జూన్‌లో భారతదేశంలో తాత్కాలికంగా నిరోధించబడిన తరువాయి 12లో

## రైతు భరోసా నిధుల విడుదలలో రికార్డు

కేవలం 5 రోజుల్లోనే రైతు భరోసా కింద 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.77 కోట్లు జమ : మంత్రి తుమ్మల

## అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్‌కు అత్యంత ప్రాధాన్యత : మంత్రి పొంగులేటి

03



# నాడు నాటిన మొక్కే నేటి మహావృక్షం

### మిడ్జిల్ కృతజ్ఞత సభలో సిఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన

- మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనే గొప్ప నాయకుడు ఉండేవారు
- మిడ్జిల్ అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నాపై ఉంది
- దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాలి
- 'తెలంగాణ కోసం పోరాడిన గద్దర్‌ను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టిన ఘనత గత బిఆర్ఎస్ ప్రభుత్వానిదే
- కెసిఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది?
- మాజీ సిఎంను నిలదీసిన రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/జడ్చర్ల

ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క నేడు పెద్ద వృక్షమైందని సిఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ ప్రయాణం సందర్భంగా మిడ్జిల్‌లో రేవంత్ రెడ్డి పర్యటించారు. అక్కడ కృతజ్ఞత సభ నిర్వహించారు. జెడ్‌పిటిసి, ఎమ్మెల్సీగా విజయానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనే గొప్ప నాయకుడు ఉండేవారని, హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సిఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డేనని, ఎంపిగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డేనని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 2006లో జెడ్‌పిటిసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారని, తనది ఈ నియోజకవర్గం కాకపోయినా మిడ్జిల్ ప్రజలు నమ్మకంతో గెలిపించారని, మిడ్జిల్ ప్రజలు తనపై పెట్టిన నమ్మకమే నేడు తనను ఈ స్థాయికి తరువాయి 8లో





## ముంబయిని ముంచెత్తిన భారీ వర్షాలు

07

## 20 నుంచి పార్లమెంట్

### ఆగస్టు 13 వరకు నిర్వహణ



**న్యూఢిల్లీ :** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈనెల 20 నుండి ప్రారంభం కానున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు శనివారం తెలిపారు. సమావేశాలు ఆగస్టు 13 వరకు జరుగుతాయన్నారు. మొత్తం 19 పనిదినాల్లో సభ జరగనుంది. పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బిజెపి విజయం సాధించిన తర్వాత ఈ 25 రోజుల సెషన్ జరుగుతుంది. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), శివసేన (యుబిటి)లలోని అంతర్గత తిరుగుబాటు పరిణామాలు కూడా రాబోయే సమావేశాల్లో ప్రతిబింబించనున్నాయి. తమను ప్రత్యేక వర్గాలుగా గుర్తించాలని కోరుతూ 20 మంది టిఎంసి, ఆరుగురు శివసేన (యుబిటి) ఎంపిలు చేసిన అభ్యర్థనలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు. రాజ్యసభలో, కొత్తగా ఎన్నికైన, తిరిగి ఎన్నికైన ఎంపిలు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, రాజకీయ బలాబలాలు అధికార ఎన్‌డిఎకు మరింత అనుకూలంగా మారాయి. ఎగువ సభకు చెందిన ముగ్గురు అసమ్మతి టిఎంసి ఎంపిలు రాజీనామా చేశారు. ప్రభుత్వ సిఫార్సు మేరకు, పార్లమెంటు ఉభయ సభలను వర్షాకాల సమావేశాల కోసం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సమావేశపరిచారని రిజిజు ఎక్స్ వేదికగా తెలిపారు. 'జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాల కోసం ఈ సమావేశాలు ఈనెల 20న ప్రారంభమై, 2026 ఆగస్టు 13 వరకు కొనసాగుతాయి' అని ఆయన పేర్కొన్నారు. గత సమావేశాలు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి నిరాశను మిగిల్చాయి. 2029 నాటికి శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు దిగువ సభలో వీగిపోయింది. అన్ని రాష్ట్రాల్లోనూ లోక్‌సభ స్థానాలను ఏకరీతిగా 50 శాతం వరకు పెంచేలా ప్రభుత్వం ఇప్పుడు ఆ బిల్లును తిరిగి రూపొందిస్తోంది. జనాభా ప్రాతిపదికన స్థానాలను పెంచడం అనేది దక్షిణాది పార్టీలకు ప్రధాన ఆందోళనగా మారింది.

## వేరే పేరు సూచించండి

### టిఆర్ఎస్ పేరుపై కవితకు ఎన్నికల సంఘం లేఖ

న్యాయపోరాటానికి సిద్ధమైన కల్వకుంట్ల కవిత పార్టీ ప్రతినిధులు

ప్రజాపక్షం/హైదరాబాద్



కల్వకుంట్ల కవిత నేతృత్వంలో ఏప్రిల్ 25న ప్రకటించిన 'తెలంగాణ రక్షణ సేన'(టిఆర్ఎస్) పార్టీ పేరు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఇసి లేఖ రాసింది. ఈ పార్టీ సంక్షిప్త నామం 'టిఆర్ఎస్'పై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవడంతో కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) సమీక్షించింది. పార్టీ పేరుపై భారీగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో, ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలంటూ కవితకు ఇసి లేఖ రాసింది. లేఖపై ఎన్నికల కమిషన్‌కు కవిత న్యాయవాదులు బృందం సమాధానం చెప్పినట్లు తెలిసింది. ఎవరెవరు ఏ అభ్యంతరాలను వ్యక్తం చేశారో, ఒక్కొక్కరిగా వివరాలను పంపిస్తే తాము ఒక్కొక్కరికి సమాధానం చెబుతామని, వారి అనుమానాలను అభ్యంతరాలను ఒక్కొక్కటిగా నివృత్తి చేస్తామని కవిత ఎన్నికల సంఘాన్ని కోరినట్లు సమాచారం. ఒకవేళ మరోసారి ఎన్నికల సంఘం లేఖను పంపిస్తే ఏ విధంగా స్పందించాలి అనే విషయమై ఇదివరకే కవిత తన న్యాయ నిపుణులతో చర్చించినట్లు తెలిసింది. అభ్యంతరాలు వ్యక్తం చేసిన వారి వివరాలతో కూడిన లేఖను పంపిస్తే వాటికి చట్టపరంగా సరైన సమాధానం చెప్పడానికి టిఆర్ఎస్ న్యాయ నిపుణుల బృందం సిద్ధమైంది. ఇదివరకు ఇలాంటి కేసుల్లో ఎన్నికల కమిషన్ ఎలా స్పందించింది, ఒకవేళ దీనిపై న్యాయ స్థానాలను ఆశ్రయిస్తే ఎలాంటి తీర్పులు వచ్చాయి, చట్టం ఏం చెబుతుంది అనే అంశాలపై ఇప్పటికే కవిత న్యాయ నిపుణుల బృందం చర్చించింది. ఒకవేళ టిఆర్ఎస్ పట్ల ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్త చేస్తూ, లేఖను పంపిస్తే దీనిపైన న్యాయపరంగా పోరాటం చేయాలని కవిత న్యాయవాదుల బృందం ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పేరుతో రావడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసిన రెండు రాజకీయ పార్టీలకు న్యాయ నిపుణుల బృందం సమాధానం చెప్పినట్లు తెలిసింది.

## కమ్యూనిస్టు ముప్పు విజృంభిస్తోంది



అమెరికాలో మనస్ఫూర్తి, అస్థిత్వాన్ని చెరిపేసే ప్రయత్నం జరిగింది

మౌంట్ రష్మోర్‌లో జరిగిన 250వ వార్షికోత్సవ వేడుకలలో ట్రంప్ హెచ్చరిక

మీరు ఇక్కడ పుట్టకపోయినా మన వ్యవస్థను ప్రేమించాలి

**వాషింగ్టన్ :** అమెరికా గుర్తింపుపై మళ్ళీ దాడి జరుగుతోందని, కమ్యూనిస్టు ముప్పు విజృంభిస్తోందని ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ప్రజలకు హెచ్చరిక చేశారు. ఆందోళన వ్యక్తం చేశారు. అనేక విమర్శలు, వ్యతిరేకతలు, అనిశ్చితి, కళతప్పిన వైభవం మధ్య ట్రంప్ సారథ్యంలో 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. వాషింగ్టన్ డి.సిలో ట్రంప్ చెప్పిన అద్భుతమైన ర్యాలీ,ప్రధాన కార్యక్రమానికి ముందుగా సౌత్ డకోటాలోని మౌంట్ రష్మోర్ జాతీయ చిహ్నం (అమెరికాకు గొప్ప వైభవాన్ని చేకూర్చిన నలుగురు అధ్యక్షుల తలలు శిల్పాలరూపంలో చెక్కిన్న ప్రదేశం)వద్ద ట్రంప్ జాతిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ అద్భుతమైన వార్షికోత్సవానికి మనం చేరువైన తరుణంలో మనదేశ అస్థిత్వంపై దాడి జరగడాన్ని మనం చూస్తున్నామని ట్రంప్ తన ప్రసంగంలో అన్నారు. కమ్యూనిస్టులు, అతివాదులు, రాడికల్స్‌ను లక్ష్యంగా చేసుకుని ట్రంప్ విమర్శల దాడి చేశారు. ఈ ఏడాది నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష తరువాయి 8లో


## క్షీణిస్తున్న సోనమ్ ఆరోగ్యం

ధర్మేంద్ర ప్రధాన్‌ను ఇంకా ఎందుకు తొలగించడం లేదు

ప్రధాని మోదీ ఇంకెంతకాలం వేచి చూస్తారు?

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నిలదీత

నిరసనలు, నిరాహారదీక్షకు ఎస్‌కెఎం మద్దతు




**న్యూఢిల్లీ :** తరుచూ పేపర్ లీకేజీలు, పరీక్షల్లో అవకతవకలపై ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శన 15వ రోజుకు చేరింది. నిరసకు సంఘీభావంగా గత ఏడు రోజుల నుంచి పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్నారు. అయితే ఆయన చాలా వేగంగా క్షీణిస్తోందని, 5 కిలోల బరువు తగ్గారని సిజెపి పేర్కొంది. సోనమ్ ఆరోగ్యం రోజు రోజుకూ క్షీణిస్తున్నా ప్రధాన్‌ను ఇంకా ఎందుకు తొలగించలేదని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే 'ఎక్స్' వేదికగా శనివారం ప్రశ్నించారు. ప్రధాన్‌ను తొలగించడానికి ప్రధాన మంత్రి ఇంకా ఎంతకాలం వేచి చూస్తారన్నారు. '20 మంది విద్యార్థులు మరణించినప్పటికీ, ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించడానికి నిరాకరించేంతగా ఆయన ప్రధాని మోదీకి ఎందుకు అంత ముఖ్యమైన వ్యక్తి? అని దీప్కే నిలదీశారు. సోనమ్‌కు ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని దిప్కే పేర్కొన్నారు. ప్రధాన్‌పై చర్య తీసుకునే వరకు తన నిరాహార దీక్షను విరమించబోనని సోనమ్ స్పష్టం చేసినట్లు తరువాయి 8లో




## న్యాయవ్యవస్థ బలోపేతానికి సంస్కరణలు అవసరం

- ప్రభుత్వం న్యాయ వ్యవస్థ మధ్య సమతుల్యత ఉండాలి
- యువ న్యాయవాదులు నిరంతర అధ్యయనంతో రాణించాలి : పలువురు వక్తలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయ వ్యవస్థ మరింత బలోపేతం కావాలంటే న్యాయ సంస్కరణలు అవసరమని పలువురు వక్తలు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ తమ పరిధిలో బలంగా పనిచేస్తూ సమతుల్యతను పాటించినప్పుడే ప్రజాస్వామ్య విలువలు మరింత బలపడతాయని వారు పేర్కొన్నారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫ్యాప్సి ఆడిటోరియంలో శనివారం తరువాయి 12లో

## విస్తరిస్తున్న సిఆర్ ఫౌండేషన్

ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు కడప జిల్లాలో 'జీవని వృద్ధాశ్రమం' పునః ప్రారంభం

తదుపరి నెల్లూరు, గుంటూరులలో

**హైదరాబాద్ :** మనిషి జీవితంలో నాలుగు దశల్లో వార్ధక్యం చివరిది. బాల్యం, కౌమారం,యవ్వనం సాఫీగా తగు బాధ్యతలతో హుషారుగా గడిచిపోతుంది. చరమ దశ అయిన వృద్ధాప్యం (వార్ధక్యం ) లో శారీరక బలం తగ్గినా అనుభవం మెండుగా ఉంటుంది. ఈ దశలో జ్ఞాన సంపద కుటుంబానికే గాక దేశ పురోగతికి కూడా ఎంతగానో దోహదపడుతుంది. వీరి బాగోగుల కోసం ప్రభుత్వాలు సామాజిక బాధ్యతగా కొన్ని సేవలు అందిస్తున్నాయి. కొందరు ఉన్నత ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత 'ఎమిరిటస్' వారికి జోడించి తగు హోదా, గౌరవం కల్పించడం వారి సేవలను కొనసాగించడం జరుగుతోంది.ప్రపంచీకరణ నేపథ్యంలో పలువురికి వృద్ధాప్యం శాపంగా, ఎంతో కష్ట తరంగానూ మారుతోంది. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలలో వయోవృద్ధులను ఎంతగానో గౌరవిస్తారు.. కుటుంబానికి పెద్దగా, మాతృమూర్తిగా పరిగణిస్తారు. బహుళ తరాల వారు కలిసి ఉమ్మడి కుటుంబంలో జీవిస్తున్నారు. మన దేశంలో ఇటీవల వృద్ధుల పట్ల వివక్షత తరువాయి 12లో







## రూ.20 కోట్ల పార్కు స్థలం స్వాధీనం

ఆక్రమణలు తొలగించి, ఫెన్సింగ్ వేసిన హైడ్రా

ప్రజాపక్షం/హైదరాబాద్

కాలనీవాసులకు ప్రాణవాయువును అందిస్తూ, వారు సేదతీరేందుకు కేటాయించిన పార్కు స్థలాలను కబ్జాదారుల బారి నుంచి హైడ్రా కాపాడుతోంది. ఈ క్రమంలో శనివారం మేడ్చల్ మండలంలో సుమారు రూ. 20 కోట్ల విలువైన భారీ పార్కు స్థలాన్ని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లేఅవుట్‌లో పార్కుగా చూపించి, ఆ తర్వాత తరువాయి 12లో




## అత్యుత్సాహంతో వివాదం



అమెరికాలోని అరిజోనా రాష్ట్రంలో జరిగిన ఒక 'జెండర్ రివీల్ పార్టీ' (పుట్టబోయే శిశువు ఆడా? మగా? అనే విషయాన్ని బంధుమిత్రులకు తెలియజేసే వేడుక)లో ప్రదర్శించిన అత్యుత్సాహం అనుకోని వివాదానికి దారితీసింది. ఈ కార్యక్రమంలో శిశువు మగబిడ్డ అని సూచించేందుకు ఒక దంపతులు ప్రకాశవంతమైన నీలం రంగుతో రంగరించిన పావురాలను ఆకాశంలోకి ఎగరవేశారు. అయితే, ఈ చర్యపై వన్యప్రాణి సంరక్షణ సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. రంగు పూయడం వల్ల ఆ పావురాలు సహజసిద్ధమైన రూపాన్ని కోల్పోయాయి. దీంతో అవి ఆకాశంలోనే కాకుండా చెట్ల మధ్య కూడా చాలా స్పష్టంగా కనిపించాయి. ఫలితంగా గద్దలు, డేగలు వంటి మాంసాహార పక్షులకు అవి సులభంగా కనిపించి వేటకు గురయ్యే ప్రమాదం పెరిగింది. అంతేకాక, రంగులో ఉండే రసాయనాలు వాటి ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వన్యప్రాణి సంరక్షకులు రంగు పూసిన పావురాలను వెతికి పట్టుకుని సురక్షిత కేంద్రాలకు తరలించారు. ఈ ఘటన తర్వాత జంతు సంక్షేమ సంస్థలు ఇటువంటి వేడుకల్లో జంతువులు, పక్షులను వినియోగించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. ఆనందాన్ని పంచుకునే వేడుకలు ప్రకృతి, జీవరాశులకు హాని కలిగించకుండా నిర్వహించాలని సూచించాయి. ఈ సంఘటన సోషల్ మీడియాలో కూడా విస్తృత చర్చకు దారితీసింది. వ్యక్తిగత వేడుకల కోసం అమాయక జీవులను ప్రమాదంలోకి నెట్టడం సరైన పద్ధతి కాదని పలువురు అభిప్రాయపడ్డారు.

## 'వర్డిల్'ను పరిష్కరించే వ్యూహం



ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ పొందిన పదాల ఆట 'వర్డిల్'ను దాదాపు 99 శాతం విజయవంతంగా పరిష్కరించే కొత్త వ్యూహాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇందుకోసం వారు గణితశాస్త్రంలోని 'ఇన్ఫర్మేషన్ థియరీ' అనే సిద్ధాంతాన్ని ఉపయోగించారు. సాధారణంగా ఆటగాళ్లు ఎక్కువగా వినిపించే పదాలను మొదటి ప్రయత్నంగా ఎంచుకుంటారు. కానీ ఈ కొత్త విధానంలో, సరైన సమాధానాన్ని వెంటనే ఊహించడానికి కాకుండా, ప్రతి ప్రయత్నం లో అత్యధిక సమాచారం లభించే పదాలను ఎంచుకోవడం ప్రధాన లక్ష్యం. 'వర్డిల్'లో ఐదు అక్షరాల పదాన్ని ఆరు అవకాశాల్లో గుర్తించాలి. ప్రతి ప్రయత్నం తర్వాత సరైన అక్షరాలు, వాటి స్థానాల గురించి సూచనలు లభిస్తాయి. పరిశోధకులు వేలాది పదాలను కంప్యూటర్ ద్వారా విశ్లేషించి, ఏ పదాలు ఎక్కువ అవకాశాలను తొలగించి తదుపరి సమాధానాన్ని సులభంగా గుర్తించేందుకు సహాయపడతాయో లెక్కించారు. ఈ విధానాన్ని అనుసరించడం ద్వారా దాదాపు 99 శాతం సందర్భాల్లో ఆరు ప్రయత్నాల లోపే సరైన పదాన్ని కనుగొనవచ్చని వారు వెల్లడించారు. ఈ పరిశోధన కేవలం ఆటలకే పరిమితం కాకుండా, తక్కువ సమాచారంతో సరైన నిర్ణయాలు తీసుకోవడం, శోధన ప్రక్రియలను వేగవంతం చేయడం, కృత్రిమ మేధస్సు (ఎఐ), వైద్య నిర్ధారణలు, సైబర్ భద్రత వంటి రంగాల్లో కూడా ఇలాంటి గణిత సూత్రాలు ఎంతో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సాధారణంగా కనిపించే ఒక పదాల ఆట వెనుక కూడా గణితం, కంప్యూటర్ శాస్త్రం ఎంత కీలక పాత్ర పోషిస్తాయో ఈ పరిశోధన మరోసారి రుజువు చేసింది.

## నాసిరకం పతకాలు!



ఇటలీలో జరిగిన మిలానో–కోర్టినా శీతాకాల ఒలింపిక్స్ (2026) కేవలం క్రీడా ప్రతిభతోనే కాకుండా, వరుసగా చోటు చేసుకున్న విచిత్రమైన వివాదాలతో కూడా ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. క్రీడల కంటే ఈ సంఘటనలే ఎక్కువగా వార్తల్లో నిలిచాయి. అత్యంత చర్చనీయాంశమైన ఘటనల్లో ఒలింపిక్ పతకాలు విరిగిపోవడం ఒకటి. అమెరికాకు చెందిన స్కీయర్ బ్రీజీ జాన్సన్ సహా పలువురు విజేతల పతకాలు వేడుకల అనంతరం రిబ్బన్ నుంచి విడిపోవడం లేదా పగిలిపోవడం జరిగింది. దీనిపై నిర్వాహకులు దర్యాప్తు చేపట్టి, తయారీ లోపాన్ని సరిదిద్దడంతో పాటు దెబ్బతిన్న పతకాలను మరమ్మతు చేసి లేదా కొత్తవి అందిస్తామని ప్రకటించారు. మరోవైపు, ఫిగర్ స్కేటింగ్‌లో కొంతమంది క్రీడాకారులు తమ ప్రదర్శనల్లో ఉపయోగించిన సంగీతానికి 'కాపీరైట్' సంబంధిత అభ్యంతరాలు ఎదుర్కొన్నారు. దీంతో చివరి నిమిషంలో సంగీతాన్ని మార్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే స్కీ జంపింగ్‌లో పోటీ ప్రయోజనం కోసం కొందరు అథ్లెట్లు అసాధారణ పద్ధతులను అనుసరిస్తున్నారనే 'డోపింగ్' (ఉత్ప్రేరకాల వాడకం)కు సంబంధించిన విచిత్రమైన పుకార్లు కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు వచ్చాయి. అయితే వాటి కి అధికారిక ఆధారాలు లభించలేదు. అదే సమయంలో, ఫ్రాన్స్‌కు చెందిన బయాథ్లాన్ క్రీడాకారిణి జూలియా సైమన్ గతంలో సహచరురాలి క్రెడిట్ కార్డు వివరాలను దుర్వినియోగం చేసిన కేసులో శిక్ష అనుభవించినప్పటికీ, ఒలింపిక్స్‌లో పాల్గొని స్వర్ణ పతకం గెలుచుకోవడం మరో వివాదానికి దారితీసింది. ఈ సంఘటనలన్నీ కలిపి, 2026 శీతాకాల ఒలింపిక్స్‌ను క్రీడలతో పాటు అనేక విచిత్రమైన, అనూహ్యమైన వివాదాలకు వేదికగా నిలిపాయి.

## సౌర కుటుంబంలోకి అనుకోని అతిథి!



మన సౌర కుటుంబంలోకి ఇటీవల ప్రవేశించిన '3ఐ/అట్లాస్' అనే రహస్యమైన అంతర్‌నక్షత్ర వస్తువు ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. ఈ వస్తువు మన సౌర కుటుంబానికి చెందినది కాకుండా, మరో నక్షత్ర వ్యవస్థ నుంచి వచ్చినదిగా భావిస్తున్నారు. దీంతో ఇది సహజసిద్ధమైన ఖగోళ వస్తువేనా? లేక ఏదైనా కృత్రిమ మూలం కలిగిందా? అనే ఆసక్తికరమైన ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో 'సెర్చ్ ఫర్ ఎక్స్‌ట్రాటెర్రెస్ట్రియల్ ఇంటెలిజెన్స్' (ఎస్ఇటిఐ) కార్యక్రమానికి చెందిన శాస్త్రవేత్తలు శక్తివంతమైన రేడియో టెలిస్కోపులను '3ఐ/అట్లాస్' వైపు మళ్లించి పరిశీలించారు. ఈ వస్తువు నుంచి ఏవైనా కృత్రిమ రేడియో సంకేతాలు లేదా గ్రహాంతరవాసుల సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన ప్రసారాలు వస్తున్నాయేమో తెలుసుకోవడమే వారి లక్ష్యం. అనేక గంటలపాటు సేకరించిన సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం, ఎలాంటి అసాధారణ లేదా కృత్రిమ సంకేతాలు గుర్తించలేదని వారు ప్రకటించారు. అయితే, దీనివల్ల గ్రహాంతరవాసులు లేరని తేలిపోయిందని కాదు. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, విశ్వంలో జీవం ఉండే అవకాశాలను అన్వేషించే శాస్త్రీయ పరిశోధనలో ఇది ఒక సాధారణ ప్రక్రియ మాత్రమే. ప్రస్తుతం '3ఐ/అట్లాస్' సహజసిద్ధమైన అంతర్ నక్షత్ర వస్తువేనని భావిస్తున్నారు. గ్రహాంతరవాసుల ఆనవాళ్ల కోసం రేడియో టెలిస్కోపులతో అంతరిక్ష వస్తువులను పరిశీలించడం సైన్స్ ఫిక్షన్ సినిమాలను తలపించినప్పటికీ, ఇది పూర్తిగా శాస్త్రీయ విధానంలో నిర్వహించిన పరిశోధన. విశ్వ రహస్యాలను ఛేదించే ప్రయత్నాల్లో ఈ అధ్యయనాలు ఖగోళ శాస్త్రానికి కొత్త దారులు చూపుతున్నాయి.

– బిఎస్ఎస్ మైత్రేయి

## ఆర్ఎస్ఎస్ సంయమన సుద్దులు

అయోధ్య రామాలయ విరాళాల చోరీ వ్యవహారంపై ఎట్టకేలకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నోరు విప్పింది. ఈ వివాదం తెరపైకి వచ్చిన దాదాపు నెల రోజులకు ఆర్ఎస్ఎస్ తరపున ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే స్పందించారు. శ్రీరామ లల్లా మందిరంలో విరాళాల దొంగతనం జరగడం అత్యంత దురదృష్టకరమని, ఇది కోట్లాది రామభక్తుల మనోభావాలను, విశ్వాసాన్ని తీవ్రంగా గాయపరిచిందని చెప్పేందుకు ఆయనకు ఎందుకు ఇన్ని రోజులు పట్టినట్లు? అలాగే శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం 'సిట్' ఏర్పాటు చేసిందని చెప్పడం విడ్డూరంగా ఉంది. నిజానికి అంతకన్నా ముందే సమాజ్ వాదీ పార్టీ విరాళాల చోరీ అంశాన్ని లేవనెత్తిన సమయంలో కొట్టిపారేసే ప్రయత్నం చేసింది అక్కడి ప్రభుత్వం. అలాగే ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ అలాంటిదేమీ లేదంటూ, నిరంతర ఆడిట్ జరుగుతోందని కప్పిపుచ్చుకో జూశారు. చివరకు ప్రతిపక్షాలు, ప్రజల నుంచి వచ్చిన తీవ్ర ఒత్తిడికి తలొగ్గి ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం 'సిట్'ను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడేమో ఆ ఘనతను కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రస్ట్‌కే కట్టబెట్టి, దానికే సచ్ఛీలతా సర్టిఫికెటు ఇచ్చేందుకు ఆర్ఎస్ఎస్ పడుతున్న తాపత్రయం వెల్లడవుతోంది.

నేరస్తులు ఎంతటి వారైనా కఠినాతికఠినమైన శిక్షపడేలా చూడాలని కోరిన హోసబాలే, అందుకు నిష్పాక్షిక దర్యాప్తుకై ట్రస్టు బాధ్యులను తప్పించాలనే కనీస అవసరాన్ని గుర్తించ నిరాకరిస్తున్నారు. ఈ దురదృష్టకర ఘటనను అడ్డు పెట్టుకొని హిందూ ధర్మాన్ని, సమాజాన్ని బద్నాం చేసేందుకు హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తులు కుట్రలు పన్నుతున్నాయనడం విచిత్రంగా ఉంది. ఆలయ చందాలు, విరాళాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్‌పైనే ఉంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రధాని మంత్రి మోదీ స్వయంగా ట్రస్టును ప్రకటించారు. అందులోని కీలక ప్రధాన కార్యదర్శి, సంఘ్ పరివారానికి సన్నిహితుడు, రామజన్మభూమి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ కుమార్ మిశ్రాల పాత్రపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలోనే ఖాతాలను పర్యవేక్షించే మహిపాల్ సింగ్ అనే వ్యక్తి నగలు, విరాళాల చోరీ వ్యవహారాన్ని బైటపెడితే, అది పట్టించుకోకుండా ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. ఎస్‌పి, ఆప్, కాంగ్రెస్ తదితర విపక్షాలన్నీ ముక్తకంఠంతో చందా చోరీ వ్యవహారాన్ని ఎత్తి చూపినా నెల రోజుల క్రితం వరకు బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్‌లు పట్టించుకోనట్లు వ్యవహరించాయి. ఇదంతా చూస్తే వ్యవహారం ముందే పొక్కినా చర్యలు తీసుకోకుండా తొక్కిపెట్టిన వారు కుట్ర దారులా? విషయంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన వారు కుట్రదారులా? తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు, బాధ్యతను ఎదుటివారిపై నెట్టివేసేందుకు సంఘ్ పరివార్‌కు అలవాటైన హిందూ వ్యతిరేకులు, దేశ వ్యతిరేకుల కుట్ర అనే వ్యాఖ్యలు ఈ వ్యవహారంలోనూ వినిపించడం ఆశ్చర్యమేమీ కాదు.

ఒకవేళ అదే నిజమైతే, రామజన్మభూమి ఉద్యమం, బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనలో చురుకుగా పాల్గొన్నారనే పేరున్న ఫైర్ బ్రాండ్ వినయ్ కటియార్ సైతం ట్రస్ట్ పాత్రపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గతంలో అయోధ్య రామాలయ నగరం భాగమైన ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎంపిగా గెలిచిన ఆయన రామాలయ విరాళాల దొంగతనం వ్యవహారంలో చంపత్‌రాయ్, అజయ్ మిశ్రాలు జైలుకు పోక తప్పదన్నట్లుగా వ్యాఖ్యలు చేశారు. దీనిని బట్టి ఈ వ్యవహారంలో సంఘ్ పరివారంలోని వారి పాత్రపట్ల స్వపక్షీయులే వేలెత్తి చూపుతున్నట్లు అర్థమవుతున్నది. అలాంటప్పుడు ఎవరు హిందూ వ్యతిరేకులు, దేశ వ్యతిరేకులు? మరి కటియార్ కూడా హిందూ ధర్మాన్ని బద్నాం చేస్తున్నారని భావించాలా? హిందుమతానికి తామే అసలు సిసలు పరిరక్షకులుగా ప్రతి దానికి ఉరికొచ్చే సంఘ్ పరివారం రామాలయంలో ఇంటి దొంగల చేతివాటంపై ముందే ఎందుకు మేల్కొనలేదు. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందనేగా? ఎందుకంటే ట్రస్టులోని 14మంది సభ్యుల్లో 9మందికి ఆర్ఎస్ఎస్‌తో సన్నిహిత సంబంధాలున్నాయనేది బహిరంగ రహస్యమే.

అందరూ సంయమనం పాటించాలని సుద్దులు చెబుతున్న ఆర్ఎస్ఎస్...ఒకవేళ ప్రస్తుత ఘటనే బిజెపియేతర ప్రభుత్వ హయాంలో జరిగినట్లయితే సంయమనం పాటించేదా? ఈ వ్యవహారంపై శనివారం నాగ్‌పూర్‌లో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భాగవత్‌ను విలేకరులు స్పందించమని కోరగా, 'రామ్.. రామ్..' అని చేతులు జోడిస్తూ జవాబు దాటవేయటం కొసమెరుపు. ●

# అయోధ్య రామాలయంలో అవినీతి జలగలు




ఎస్.బాబు, అధ్యక్షులు
టిజిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్

సుమారు 400 సంవత్సరాల క్రితం భద్రాచలంలో శ్రీరాముని గుడి కట్టడానికి ప్రజల నుండి వసూలు చేసిన పన్నులను, నగలు, నగదు దుర్వినియోగ పరిచాడని భక్త రామదాసును గోల్కొండ నవాబు అబుల్ హసన్ తానీషా 12 సంవత్సరాలు కారాగారంలో బంధించాడు. రామదాసు సాధారణ వ్యక్తి కాదు. తానీషా ఏలుబడిలో ఆయన తహసీల్దార్. అయినా ఎటువంటి పక్షపాతం లేకుండా రాజు తన క్రింది అధికారిని శిక్షించి చట్టం ఎవరికీ చుట్టం కాదని నిరూపించాడు.

సీన్ కట్‌చేసి చూస్తే, ఆనాడు భద్రాచల రాముడు – ఈనాడు అయోధ్య రాముడు. అప్పుడు నిధుల దుర్వినియోగం. ఇప్పుడు నిధులు మాయం. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ అయోధ్య రామాలయంలో జరిగిన అవినీతిని బయటపెట్టేంతవరకు ఈ విషయం ఎవరికీ తెలియదు. ఆయనపై సంఘ్ పరివార్ శక్తులు మరియు బిజెపి నాయకులు మాటలతో ముప్పేట దాడి చేశారు. అవినీతిని దాటవేసే ప్రయత్నం చేశారు. ఆ రాష్ట్ర బిజెపి ఎంపి కూడా అవినీతి జరిగింది అని మాట్లాడేసరికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఆలయ విరాళాలు అపహరించారని ఆరోపణలు వచ్చిన 8 మందిని పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. ఈ ఎనిమిది మంది మహానుభావుల వెనుక ఇంకెందరో ఉద్దండులు ఉన్నారనడం సత్యదూరం కాదు. ముఖ్యమంత్రి పూర్తి విచారణ జరిపేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) ను ఏర్పాటు చేశారు. ఈ టీమ్ ఏర్పడక ముందే ఆలయ అధికారులు 79.85లక్షలు నిందితుల నుండి స్వాధీనం చేసుకున్నారు. సిట్ అధికారులు ప్రాథమిక దర్యాప్తు పూర్తిచేసి ఇచ్చిన నివేదిక మేరకు ఎఫ్.ఐ.ఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహిత చట్టం, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేయటం జరిగింది.

200 కోట్ల కుంభకోణం జరిగింది. కుంభమేళా సమయంలో భారీగా నిధుల వరద ఆలయాన్ని తాకింది. లెక్కలు గతి తప్పాయి. ఆలయ ట్రస్టీల ఆలోచన విధానం మారింది. సరైన మెకానిజం లేకపోవడంతో ఉద్యోగులు విజృంభించి అవినీతి తాండవం ఆడారు. చివరకు విరాళాలు లెక్కించే ఆఫీసు గది పక్కనే ఉన్న బాత్రూమ్‌లో స్వామి వారికి సంబంధించిన రెండున్నర లక్షల నిధులు పట్టుబడ్డాయని సిట్ తేల్చింది. నిజాల నిగ్గు తేల్చడానికి యోగి ఆదిత్యనాథ్ సర్కార్ సిట్ కు బాధ్యతలిచ్చింది. ఇది కంటి తుడుపు చర్య అని, నిజ నిర్ధారణ జరగాలంటే సుప్రీం కోర్టు ద్వారా జుడీషియల్ విచారణ జరగాలని ప్రజలు, ఆధ్యాత్మిక గురువులు, సాధువులు, ప్రతిపక్ష నాయకులు కోరుతున్నారు. డబల్ ఇంజన్ సర్కార్ కాబట్టి ఎవరి భయం వారికుంటుంది. "దూద్ కా దూద్, పానీ కా పానీ, హమ్ కర్ కే దిఖాయేంగే" అన్నారు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్. ఆలయ ట్రస్ట్ బైలాస్ ప్రకారం సిసి టీవి ఫుటేజ్ 180 రోజులు ఉండాలి. కానీ 45 రోజుల ఫుటేజ్ మాత్రమే ఆలయంలో భద్రపరచబడిందని సిట్ అధికారులు గుర్తించారు. అంటే ఇది ఓపెన్ రాబరీ అని చాలా స్పష్టంగా తెలుస్తోంది. రాములవారి భక్తులు సమర్పించిన నగలు, నగదు నిర్లజ్జగా ఆలయ కమిటీ వారు దోచుకుని దాచుకున్నారు.

దేశవ్యాప్తంగా అయోధ్య రామాలయ అవినీతిపై ఎన్నో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ప్రధానమంత్రి కాని, ఆర్.ఎస్.ఎస్ చీఫ్ కాని ఈ విషయంపై పెదవి విప్పడం లేదు. మౌనమే నీ భాష ఓ మూగ మనసా అన్న విధంగా వారిని నిశ్శబ్దం ఆవహించింది. నీతి నిజాయితీ గురించి మన్ కీ బాత్‌లో ప్రవచనాలు వల్లించే పెద్దమనిషి రామాలయం లో జరిగిన స్టోరీ గురించి, నిధుల దారి మళ్ళింపు గురించి మాట్లాడరెందుకు? ఇదే పని కాంగ్రెస్ కానీ లేదా వామపక్ష పార్టీలు కానీ చేసి ఉంటే వారి ముత్తాతల నుండి ముని మనవళ్ళ దాకా మన్ కీ బాత్‌లో వీరంగం వేసేవారు కదా. వీరి రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం మనిషిని, మతాన్ని, మాధవుణ్ణి కూడా వాడేసుకున్నారు.



ఆలయానికి 3,500 కోట్ల విరాళాలు వచ్చాయని గణాంకాలు చెప్తున్నాయి. అందులో 200 కోట్లు మాయమైనాయి. ఇవి కాకుండా స్వామి వారి వెండి పాదుకలు, భక్తులు విశ్వాసంతో సమర్పించిన బంగారు, వెండి ఇటుకలు కూడా మాయమయ్యాయి. ఈ అవినీతి జరగకముందు ప్రతిరోజు స్వామివారి ఆదాయం 8 నుండి 12 లక్షల రూపాయలు. అవినీతి జలగలు రంగప్రవేశం చేసిన తరువాత ఈ ఆదాయం రోజుకు లక్షకు పడిపోయిందని లెక్కలు చెప్తున్నాయి. 5 వేల కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం హుండీ ఆదాయం ఏ రోజు కా రోజు అధికారులు వెల్లడిస్తారు. కానీ అటువంటి మెకానిజం అయోధ్య రామాలయంలో లేదు. ప్రత్యక్ష కలియుగ దైవం అయిన తిరుమల వేంకటేశ్వరుడి ఆలయంలో కూడా ఎన్నో అవినీతులు జరిగాయి. లడ్డూ తయారీలో అవినీతి జరిగిందని ఇప్పటి వరకు అది రగులుతూనే ఉంది. శబరిమల ఆలయంలో కూడా ప్రధానద్వారం, తలుపులకు తాపడం చేసిన బంగారం అపహరణ జరిగిందనే ఆరోపణలు కూడా వచ్చాయి. తాజాగా బదరీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలలో కూడా నగలు మాయం అంటూ వార్తలు గుప్పుమన్నాయి.

అయోధ్య రాముల వారికి కొన్ని కోట్లమంది ఇచ్చిన డొనేషన్స్ మనీ కాదు. అది ప్రజల నమ్మకం. దేవుడిపై వారికున్న భక్తికి చిహ్నం. కోట్లాది మంది భక్తుల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని బిజెపి కూకటివేళ్ళ తో పెకిలించింది. రాబోయే 9 నెలల్లో ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు జరగాల్సిన వేళ ఇది భారతీయ జనతాపార్టీకి శరాఘాతంలా తగిలింది. బిజెపి పార్టీ కాని, సంఘ్ పరివార శక్తులు కాని మోదీ అంటే విశ్వాసం – విశ్వాసం అంటే మోదీ అని ప్రచారం చేస్తున్నాయి. మరి ప్రధానమంత్రి, భగవంతుడిపై భక్తులు చూపిన విశ్వాసం గురించి స్పందించడం లేదు. సహజంగా మతాలకు సంబంధించిన కార్యక్రమాలను మతాధిపతులు, పీఠాధిపతులు, ఆధ్యాత్మిక గురువులు ప్రారంభిస్తారు. కానీ అయోధ్య రామాలయ ప్రారంభం (ప్రాణప్రతిష్ఠోత్సవం) మాత్రం ప్రధానమంత్రి చేతులమీదుగా జరగడం రాజకీయ పార్టీలు జీర్ణించుకోలేకపోయాయి.

రాజకీయ ప్రయోజనాల కోసం ఆర్.ఎస్.ఎస్ బాబ్రీ మసీదును కూల్చింది. బిజెపి ఎదుగుదలలో రామ మందిరం పోరాటం ఉంది. ఈ ఉద్యమం లేకపోతే బిజెపి ఈ స్థితిలో ఉండేది కాదు. 1991లో బిజెపి 120స్థానాలు గెలిచిందంటే దానికి కారణం ఎల్.కె.అద్వానీ రథయాత్రే. ఆ తరువాత బిజెపి గ్రాఫ్ ఊహించని విధంగా పెరిగిపోయి 2014 నుంచి వరుసగా 3 సార్లు అధికారాన్ని కైవసం చేసుకోగలిగింది. నాడు చేసిన ఉద్యమాలలో అనేకమంది సమిధలైనారు. వారి త్యాగాల పునాదులపై నిర్మించిన రామ మందిరంలో ఇంత భారీ కుంభకోణమా అని సాధుజనులు, ఆధ్యాత్మిక గురువులు ఆవేదన చెందుతున్నారు. మతం, మందిరం, సనాతన ధర్మం, సత్య వాక్యాలు చెప్పే విశ్వగురువు ఈ అవినీతి అనకొండలను ఎందుకు అరికట్టలేకపోయారు? దేవుణ్ణడ్డం పెట్టుకుని దుర్మార్గాలకు ఒడిగడుతున్న ఈ దోపిడీదొంగలను తానీషా లాగా ఎందుకు శిక్షించలేకపోతున్నారు? ఆలయంలో జరిగిన నగదు, ఆభరణాల దోపిడీ తీరును గ్రహిస్తే అందరూ శ్రీ వైష్ణవులే, బుట్టలో రొయ్యలు మాత్రం ఖాళీ అనే సామెత గుర్తుకు రాకతప్పదు!

# అన్నం అమృతమా? అణువణువు విషమా?



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
జర్నలిస్ట్

ప్రతి మనిషి జీవనానికి ఆహారం మూలాధారం. భారతీయ సంస్కృతిలో 'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అని భావిస్తారు. అయితే నేడు మనం తింటున్న ఆహారం నిజంగా పోషకాహారమా? లేక నెమ్మదిగా శరీరాన్ని కృశింపజేసే విషమా? అనే ప్రశ్న ప్రతి కుటుంబాన్ని వెంటాడుతోంది. కల్తీలు, రసాయన అవశేషాలు, యాంటీబయాటిక్స్ దుర్వినియోగం, అపరిశుభ్రత, ప్లాస్టిక్ కాలుష్యం వంటి సమస్యలు ఆహార భద్రతను అత్యంత కీలకమైన ప్రజారోగ్య అంశంగా మార్చేశాయి. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే సురక్షితమైన ఆహారమే మొదటి మెట్టు అని గ్రహించాలి.

హరిత విప్లవం ద్వారా భారత్ ఆహార కొరతను అధిగమించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ఉత్పత్తిదారుల్లో ఒకటిగా ఎదిగింది. కానీ ఎక్కువ ఆహారం పండించడంపై చూపిన శ్రద్ధ, నాణ్యమైన, సురక్షితమైన ఆహారం అందించడంపై చూపలేకపోయింది. నేడు రైతు పండించిన పంట నుంచి వినియోగదారుడి పళ్ళెం వరకు ప్రయాణించే ప్రతి దశలో భద్రతా లోపాలు కనిపిస్తున్నాయి. కేవలం కడుపు నింపే ఆహారం కాదు, ఆరోగ్యాన్ని కాపాడే ఆహారం అందించడం కూడా సమాజం ముందు ఉన్న బాధ్య త.

మనం తినే చికెన్, గుడ్లు, పాలు వంటి ఆహార పదార్థాల్లో యాంటీబయాటిక్స్ అవశేషాలు పెరుగుతున్నాయన్న ఆందోళనలు వైద్య రంగాన్ని కలవరపెడుతున్నాయి. పశువులు, కోళ్లలో వేగంగా ఎదుగుదల కోసం లేదా వ్యాధులు నివారించడానికి అధికంగా యాంటీబయాటిక్స్ వాడటం సాధారణమైంది. దీని ఫలితంగా మనుషుల్లో 'యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్' అనే ప్రమాదకర పరిస్థితి పెరుగుతోంది. అంటే భవిష్యత్తులో సాధారణ జ్వరానికి, ఇన్‌ఫెక్షన్‌కు ఇచ్చే మందులు కూడా పనిచేయని పరిస్థితి ఏర్పడవచ్చు. ప్రపంచ ఆరోగ్య నిపుణులు దీన్ని రాబోయే దశాబ్దాల్లో అతిపెద్ద ఆరోగ్య సంక్షోభాల్లో ఒకటిగా హెచ్చరిస్తున్నారు. ఇదే సమయంలో పంటలపై విచక్షణారహితంగా వాడుతున్న కలుపు నాశకాలు, పురుగుమందులు కూడా ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయి.

డిజిటల్ యుగంలో ఆహారపు అలవాట్లు వేగంగా మారుతున్నాయి. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సేవలు లక్షలాది కుటుంబాల దైనందిన జీవితంలో భాగమయ్యాయి. కానీ మనం ఆర్డర్ చేస్తున్న ఆహారం ఏ వంటగదిలో తయారవుతోంది? అక్కడ పరిశుభ్రత ప్రమాణాలు ఎలా ఉన్నాయి? వాడుతున్న నూనెలు ఎన్ని సార్లు తిరిగి ఉపయోగిస్తున్నారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు చాలా సందర్భాల్లో ఉండవు. ప్రత్యేకించి కేవలం వంట కోసం మాత్రమే పనిచేసే క్లౌడ కిచెన్లపై సమర్థవంతమైన పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

మన దేశంలో వేడి ఆహారాన్ని నేరుగా ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాల్లో ప్యాక్ చేయడం సాధారణ దృశ్యం. వేడి తగలగానే ప్లాస్టిక్‌లోని కొన్ని రసాయనాలు ఆహారంలో కలిసే ప్రమాదం ఉంది. దీర్ఘకాలం లో ఇవి హార్మోన్ల అసమతుల్యత, సంతానోత్పత్తి సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లకు కూడా కారణమయ్యే అవకాశాలు ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆహార భద్రత అంటే కేవలం కల్తీలు లేకపోవడం మాత్రమే కాదు; ఆహారం నిల్వ, రవాణా, ప్యాకేజింగ్ కూడా అంతే ముఖ్యమైన అంశాలు.

భారతదేశంలో కోట్లాది మంది ప్రజలు రోజూ వీధి ఆహారంపై ఆధారపడుతున్నారు. అయితే పరిశుభ్రమైన నీరు, సరైన నిల్వ విధానాలు, శుభ్రత ప్రమాణాలు లేకపోవడం వల్ల అనేక అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయి. టైఫాయిడ్, కలరా, గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి వ్యాధుల కు కలుషిత ఆహారం, నీరే ప్రధాన కారణాలు. మరోవైపు సరైన శీతలీకరణ వ్యవస్థలు లేకపోవడంతో దేశంలో ఉత్పత్తి అయ్యే ఆహారంలో గణనీయమైన భాగం వినియోగదారుల వరకు చేరకముందే పాడవుతోంది.



ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది కలుషిత ఆహారం కారణంగా అనారోగ్యానికి గురవుతున్నారు. భారతదేశంలో చిన్నారుల్లో పోషకాహార లోపానికి కేవలం ఆహార కొరత మాత్రమే కారణం కాదు. తరచూ వచ్చే విరేచనాలు, ఆహార సంబంధిత ఇన్‌ఫెక్షన్లు కూడా శరీరం పోషకాలను గ్రహించకుండా అడ్డుకుంటున్నాయి. అంటే సురక్షితం కాని ఆహారం, పోషకాహారాన్ని కూడా నిరుపయోగంగా మార్చేస్తోం ది.

**నాలుగు స్తంభాలపై నిలవాల్సిన ఆహార భద్రత**


ఈ సమస్యకు పరిష్కారం ఒకే శాఖ లేదా ఒకే సంస్థ చేతిలో లేదు. ప్రభుత్వం, ఆహార నియంత్రణ సంస్థలు కఠిన తనిఖీలు, ఆధునిక ప్రయోగశాలలు, వేగవంతమైన శిక్షా విధానాలను అమలు చేయాలి. రైతాంగం, పశుసంవర్ధక రంగం రసాయనాలు, యాంటీబయాటిక్స్‌పై ఆధారపడే విధానాలను తగ్గించాలి.

ఆన్‌లైన్ డెలివరీ సంస్థలు, వ్యాపారులు పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. వినియోగదారులు కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు, గడువు తేదీలు పరిశీలించడం, వేడి ఆహారానికి ప్లాస్టిక్ వినియోగాన్ని నిరాకరించడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలి.

భారతదేశం ఆర్థికంగా ఎంత అభివృద్ధి చెందినా, ప్రజల ఆరోగ్యం క్షీణిస్తే ఆ అభివృద్ధికి అర్థం ఉండదు. కలుషిత ఆహారం వల్ల దేశ ఉత్పాదకత, వైద్య వ్యయం, మానవ వనరుల నాణ్యతపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఆహార భద్రత అనేది ప్రయోగశాలల్లో జరిగే పరీక్షలకే పరిమితమైన అంశం కాదు. అది పొలంలో విత్తనం నాటిన క్షణం నుంచి మొదలై, పంట కోత, నిల్వ, రవాణా, ప్రాసెసింగ్, మార్కెటింగ్, వంటగది మీదుగా మన పళ్ళెం వరకు సాగే నిరంతర బాధ్యత. ఈ ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా మనం గుర్తుంచుకోవాల్సిన ఒకే ఒక్క సత్యం.. సురక్షితమైన ఆహారం లేకుండా ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం కాదు. ఆరోగ్యవంతమైన సమాజం లేకుండా అభివృద్ధి చెందిన భారతదేశం అసాధ్యం. 'సురక్షిత ఆహారం ప్రతి పౌరుడి హక్కు... దానిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత.'

## అన్యాయాన్ని ప్రశ్నించడమే
# అల్లూరికి మనం ఇచ్చే నిజమైన నివాళి

● డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'సమాజంలో అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించడం, అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేయడమే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు మనం ఇచ్చే నిజమైన నివాళి' అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతిని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ కేవలం 27 ఏళ్ల ప్రాయంలోనే దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల కోసం అల్లూరి చేసిన త్యాగం అనిర్వచనీయమని కొనియాడారు. 'ప్రజల కోసం, ప్రజల ద్వారా, ప్రజల కోసమే' సాగిన ఆయన విప్లవ పోరాటం నేటి తరానికి నిరంతర స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అల్లూరి కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, స్వేచ్ఛాకాంక్ష గల ప్రతి భారతీయుడి గుండెల్లో కొలువై ఉన్న ఒక గొప్ప శక్తి అని ఆయన అభివర్ణించారు. జయంతి వేడుకల్లో భాగంగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో సమకూర్చిన అంబులెన్స్‌ను భట్టి విక్రమార్క మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారులకు అందజేశారు. పోలీసుల విధి నిర్వహణలో, ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ఈ అంబులెన్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవా సమితి ప్రతినిధులు మాజీ ఎమ్మెల్సీ రుద్ర రాజు పద్మరాజు, నాగ రాజు, బంగారు రాజు, డి.ఎస్ రాజు, జగన్నాద్ రాజు, రమణ ప్రసాద్, రామ క్రిష్ణం రాజు సామాజిక ప్రముఖులు, క్షత్రియ సంఘ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచాలి

● క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్‌కు అత్యంత ప్రాధాన్యత
● రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక భవనాలు
● మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో తన కార్యాలయంలో క్యూర్ పరిధిలో అమలు చేయనున్న 'అఫోర్డబుల్ ఎల్‌ఐజి అర్బన్ హౌసింగ్ పథకం', సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యూర్ పరిధిలో అమలు చేయనున్న అఫోర్డబుల్ ఎల్‌ఐజి అర్బన్ హౌసింగ్ పథకాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.

ఇందుకోసం రెవెన్యూ, హౌసింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఇప్పటికే ఖరారైన స్థలాలను స్వాధీనం చేసుకుని నిర్మాణ పనుల కోసం కార్యాచరణను వేగవంతం చేయాలన్నారు. ఇంకా స్థలాలు ఖరారు కాని నియోజకవర్గాల్లో వెంటనే భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 500 ఇళ్ల చొప్పున నిర్మాణం చేపడుతున్నామని, ఇందుకు సంబంధించిన టెండర్లను త్వరలోనే ఖరారు చేస్తామన్నారు.

**కార్యాలయాలకు శాశ్వత భవనాలు..**
రాష్ట్రవ్యాప్తంగా 10 ఆర్‌డిఓ కార్యాలయాలు, 107 తహశీల్దార్ కార్యాలయాలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖకు చెందిన రెండు డిఐజి కార్యాలయాలు, నాలుగు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, 52 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తామన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

# పేదల గుడిసెలు తొలగించడం అన్యాయం

● 6న మహా ధర్నాను విజయవంతం చేయండి : ఈ.టి నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇళ్ల పట్టాల సాధన లక్ష్యంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 6న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ పిలుపునిచ్చారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా ధర్నా కటౌట్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ మిగులు భూముల్లో పేద ప్రజలు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నవారికి వారికి ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని అనేక దఫాలుగా ఉద్యమాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు వేల ఎకరాల ప్రభుత్వ భూములను కేటాయిస్తున్న ప్రభుత్వం, పేదలకు ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వడంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వకుండా గుడిసెలను తొలగించడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ఇంటి స్థలాల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించలేదని, అందుకే ఈనెల 6న జరిగే మహా ధర్నాలో పట్టాలు లేని పేదలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పేర్లకంటి శ్రీకాంత్, కౌన్సిల్ సభ్యుడు చెట్టుకింది శ్రీనివాస్, ఎఐటియుసి ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్, సుశాంత్, జోసెఫ్ భాను, బాలరాజు, మురళి, రాములు తదితరులు పాల్గొన్నారు.

### కొమరయ్య ఆశయాలు నేటికీ స్ఫూర్తిదాయకం



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ నిజాం పాలనలో భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరి, అణచివేతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ ప్రజా ఉద్యమాలు నిర్వహించాయని తెలిపారు. ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, దొడ్డి కొమరయ్య అమరత్వం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. ఆయన త్యాగం నేటి యువతకు ఆదర్శమని, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రి శ్రీమాన్, సిపిఐ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి బోయ శ్రీరాములు, నరసింహ, విజయ్, శివ పాల్గొని దొడ్డి కొమరయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# రైతు భరోసా నిధుల విడుదలలో రికార్డు

● కేవలం 5 రోజుల్లోనే రైతు భరోసా కింద 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7,135.77 కోట్లు జమ : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రికార్డు స్థాయి లో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వం కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే రూ.7,135.77 కోట్లను 67.45 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసి మరో రికార్డు సృష్టించిందన్నారు. నేడు రైతు భరోసా పథకం ఐదో విడతలో 5 నుంచి 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు రూ.545.41 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా 1.69 లక్షల మంది రైతులు రైతు భరోసా సాయం పొందారని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇప్పటికే తొలి నాలుగు విడతలలో 4 ఎకరాల వరకు సాగు భూమి కలిగిన రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేశామని, నేడు 5 నుంచి 6 ఎకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులందరికీ సాయం అందించామని తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద మొత్తం 67.45 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7, 135.77 కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు మంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## తెలంగాణ–విక్టోరియా భాగస్వామ్యానికి కొత్త ఊపు


● వాణిజ్య, టెక్నాలజీ సహకారంపై కీలక చర్చలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత విస్తరిస్తోంది. ఈ క్రమంలో ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ విప్ లీ టార్లామిస్ శనివారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి ద్వైపాక్షిక వాణిజ్య, సాంకేతిక సహకారంపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ–విక్టోరియా మధ్య ఎమర్జింగ్ టెక్నాలజీస్, స్టార్టప్ ఎకోసిస్టమ్, విద్య, నైపుణ్యాభివృద్ధి, అడ్వాన్స్ మ్యానుఫ్యాక్చరింగ్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెం ట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. భవిష్యత్ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో పారిశ్రామిక ఎకోసిస్టంను బలోపేతం చేస్తున్నామని, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూల రాష్ట్రంగా నిలిచిందని, విక్టోరియా రాష్ట్ర పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని కోరారు. విక్టోరియా ప్రభుత్వ విప్ లీ టార్లామిస్ మాట్లాడుతూ.. తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేయడానికి తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించి ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.

# ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు

● మహనీయుల ఆశయాల సాధనకు ప్రభుత్వం కృషి
● దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సభలో మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో శనివారం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాయిధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎంఎల్‌సి ఎగ్గే మల్లేశం, గొర్రెల కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య యాదవ్, క్యామ మల్లేశం, బిసి సంక్షేమ శాఖ సెక్రటరీ బాల మాయదేవి, అధికారులు మల్లయ్యభట్టు, అలోక్ కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య ఆశయాలు, సమానత్వం, ఆత్మ గౌరవం, సామాజిక న్యాయం వంటి విలువలను కాపాడటం మన అందరి బాధ్యత అన్నారు. ప్రజా ప్రభుత్వం సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రైతు సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు. మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం, సమ సమాజ నిర్మాణానికి కృషి చేయడం ఎంతో అవసరమన్నారు. దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తిని నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బిసి సామాజికవర్గంలో విద్య ఎంతో ముఖ్యమైందని, చదువుకున్నప్పుడే అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతామన్నారు. అనంతరం దొడ్డి కొమరయ్య అన్న కొడుకు దొడ్డి బిక్షపతి వైద్య చికిత్సల కోసం కురుమ సంఘం ట్రస్టు తరపున రూ.50వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ జంగిటి కమలాకర్ కురుమ, వైస్ చైర్మన్ డాక్టర్ కంకల ఎలేందర్ కురుమ, కమిటీ సభ్యులు చిందం వెంకటేష్ కురుమ ,గొరిగె నరసింహ కురుమ ,నారి మల్లేష్ కురుమ,దొడ్డి చంద్రం కురుమ,దొబ్బ భాస్కర్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య విధాన పరిషత్‌లో ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలి

● రేపు వైద్య విధాన పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా: తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని నిర్ణయించినప్పటికీ, వైద్య విధాన పరిషత్‌లో (డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్) ఆ ఆదేశాలు అమలు కావడం లేదని ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్. మూర్తి ఆరోపించారు. గత మూడు నెలలుగా వేతనాలు అందక ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే జూలై 6న కోఠిలోని డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, మినిమం టైమ్ స్కేల్ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా నిర్ణయం తీసుకుని, సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, నిధుల విడుదలకు కూడా చర్యలు చేపట్టిందని మూర్తి గుర్తు చేశారు. అయినప్పటికీ కొన్ని శాఖల్లో ఇప్పటికీ వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. పరాబ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా వైద్య విధాన పరిషత్‌లో మూడు నెలలుగా జీతాలు నిలిచిపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఈ విభాగానికి పూర్తి స్థాయి అధిపతిని నియమించకపోవడంతో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.

## బిఆర్‌ఎస్ హయాంలో అప్పులు రూ.4.17 లక్షల కోట్లే

● బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీశ్ రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన మొత్తం అప్పు రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అప్పుల విషయంలో అసత్యాలు, అర్థసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడే నాటికే ఉన్న రూ.84,268 కోట్ల రుణాలు, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెచ్చిన రూ.15,118 కోట్ల ఎఫ్‌ఆర్‌బిఎం అప్పులను కూడా బిఆర్‌ఎస్ ఖాతాలోనే వేసి భట్టి విక్రమార్క తప్పుడు లెక్కలు వండివార్చారన్నారు. 'డిసెంబర్ 2023 నాటి ప్రభుత్వ బకాయిలు రూ.5,16,881 కోట్ల నుంచి ఈ రూ.99,386 కోట్లను తీసివేస్తే మిగిలేది రూ.4,17,495 కోట్లు మాత్రమే. శ్వేత పత్రం, బడ్జెట్ పత్రాలు, కాగ్ నివేదికల ప్రకారం బిఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.4.17 లక్షల కోట్లు దాటలేదు. దీనిపై అసెంబ్లీలోనైనా, మరెక్కడైనా చర్చకు మేం సిద్ధం.' అని హరీశ్ రావు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అప్పుల విషయంలో పూటకో లెక్క చెబుతోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నరేళ్లలో భారీగా అప్పులు తెచ్చిందని, భూములను తాకట్టు పెట్టి రుణాలు సేకరిస్తూ బ్రోకర్లకు కోట్ల రూపాయల కమీషన్లు చెల్లిస్తోందని ఆరోపించారు. టిజిఐఐసి, హెచ్‌ఎండిఏ భూములను తాకట్టు పెట్టి అప్పులు తీసుకొచ్చేందుకు భారీ బ్రోకరేజ్ చెల్లించారని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో తీసుకున్న రుణాలతో కాళేశ్వరం, మిషన్ భగీరథ, సీతారామ, పాలమూరు వంటి ప్రాజెక్టులు, రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, జిల్లాల వారీగా మెడికల్ కళాశాలలు, కలెక్టరేట్లు నిర్మించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమై, ప్రజల దృష్టి మళ్లించేందుకే అప్పుల పేరుతో తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. సింగరేణిలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతి అంశాలపై స్వతంత్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

# వేలంలో పాల్గొని కొత్త బ్లాక్‌లు సాధించాలి

● సింగరేణిపై ప్రత్యేక సమీక్షలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ భారతదేశంలో ఏకైక ప్రధాన బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉన్న సింగరేణి సంస్థ రానున్న రోజుల్లో తన సేవలను మరింత విస్తృత పరచాలని, రానున్న బొగ్గు గనుల వేలంలో సింగరేణి చురుకుగా పాల్గొని కొత్త బ్లాక్‌లు సాధించి పెరుగుతున్న దేశ ఇంధన అవసరాలకు తోడ్పాటును అందించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. కంపెనీ అభివృద్ధికి, సంస్కరణల అమలుకు ఒక ప్రత్యేక కమిటీని నియమించుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం సింగరేణి సంస్థ పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై కిషన్ రెడ్డి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సింగరేణి గనుల ఉత్పత్తి, రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపునకు సంబంధించిన వివరాలను కొత్త గనులు వాటి ఉత్పత్తి వివరాలు, అనుమతుల స్థితిగతులపై గనుల వారీగా కూలంకశంగా సమీక్షించారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి పెంచడం కోసం అవసరమైన కొత్త బ్లాక్‌లను బొగ్గు శాఖ నిర్వహించే వేలం పాటలో పాల్గొని సాధించాలని సూచించారు. దేశంలో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రానున్న 10 నుంచి 15 సంవత్సరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని మంత్రి కిషన్ రెడ్డి ఆదేశించారు. దేశ ఇంధన రంగంలో ఇంకా సుదీర్ఘ కాలం బొగ్గు కీలక పాత్ర పోషించనున్నదని కనుక బొగ్గు ఉత్పత్తిని గణనీయంగా పెంచడంపై దృష్టి సారించాలని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ, పని సామర్థ్యాన్ని మరింతగా పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు. సంస్థ వాణిజ్యపరమైన విజయాలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. సంస్థ అభివృద్ధికి తాము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

**బొగ్గు గ్యాసిఫికేషన్‌పై దృష్టి సారించాలి**
దేశంలో కోల్ గ్యాసిఫికేషన్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని, దక్షిణ భారత దేశంలో ఉన్న ఏకైన ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థగా ప్రారంభ దశలో చిన్న స్థాయిలో అయినా కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టు చేపట్టడంపై దృష్టి సారించాలని మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఫెర్టిలైజర్స్ తదితర పరిశ్రమలను దృష్టిలో ఉంచుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటానికి కోల్ గ్యాసిఫికేషన్‌కు పూనుకోవాలన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ అవసరాలు పెరగనున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను ముందుగానే బలోపేతం చేసి విద్యుత్ ఉత్పత్తికి నిరంతర ఇంధన సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి పెంపుకు అనుగుణంగా రవాణా వ్యవస్థను కూడా బలోపేతం చేయాలని మంత్రి ఆదేశించారు. రవాణా కాంట్రాక్టులను అత్యంత వేగంగా ఖరారు చేసి అమలు చేయడం ద్వారా అదనపు ఉత్పత్తి సకాలంలో వినియోగదారులకు చేరేలా చూడాలని సూచించారు. సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ప్రస్తుత సవాళ్లను వివరించారు. కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడంలో ఎదురవుతున్న పలు సవాళ్లను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా సింగరేణికి సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ స్టేటస్ తొలగించడం వల్ల అటవీ భూ సేకరణ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ అంశంపై అతి త్వరలోనే సానుకూల నిర్ణయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి చెప్పారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గనిలో ఉత్పత్తి అవుతున్న బొగ్గు రవాణా విషయంలో ఉన్న సమస్యలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్, సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్ కస్సి, కేంద్ర బొగ్గుశాఖ మంత్రి ప్రైవేట్ సెక్రటరీ పంకజ్ జైన్, బొగ్గు శాఖ సలహాదారులు వీరా రెడ్డి, సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం.తిరుమలరావు, ఈడి (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జిఎం(కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**పురపాలక సంఘం కార్యాలయము, వికారాబాద్.**
వికారాబాద్ జిల్లా
No. MCV/E/855/2026-27 ఇ-ప్రాక్యూర్‌మెంట్ టెండరు నోటీసు తేది: 04.07.2026
వికారాబాద్ మునిసిపాలిటీ యందు వివిధ పనులు చేపట్టుటకు e-Procurement ద్వారా టెండర్లు పిలువడమైనది. **1. పనుల సంఖ్య:** (03), **2. పనుల విలువ:** రూ.30.00 లక్షలు, **3. బిడ్స్ డౌన్ లోడింగ్ ప్రారంభ తేది:** 06-07-2026 ఉ.11.00 గంటలకు, **4. బిడ్స్ డౌన్ లోడింగ్ సమర్పించుటకు చివరి తేది:** 13-07-2026 మ.4.00 గంటలకు, **5. ప్రైస్ బిడ్ తెరుచు తేది:** 13-07-2026 సా.4.30 గంటలకు. మిగతా వివరములకు https://tender.telangana.gov.in చూడగలరు. లేదా కార్యాలయపు పని వేళల యందు ఫోన్ నెం. 9849905910, 9849907661 నందు సంప్రదించగలరు.
దీని ప్రతి నోటీసు బోర్డుపై సమాచార నిమిత్తము ఉంచనైనది.
సం/- మునిసిపల్ కమిషనరు
పురపాలక సంఘం, వికారాబాద్.
DIPR R.O. No. : 5525-PP/CL/ADVT/2026-27, Date: 04-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ-II (60-మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT No. 13/EE-60/QBZ/CMC/2026-27, Dt:04.07.2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో ప్రచురించబడినది. వివరాలకు @https://tender.eprocurement.gov.inలో లాగ్ఇన్ అయి చూడవచ్చు. ఈవెంట్ల తేదీ వివరాలు క్రింది విధముగా ఉన్నాయి.

| NIT No. | పని పేరు | అంచనా మొత్తం | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం / బిడ్ దాఖలు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 13/EE-60/ QBZ/ CMC/ 2026-27, Dt: 04.07. 2026 | 1. BT, CC రోడ్లు మరియు వర్షపు నీటి కాలువల నిర్వహణ - 3 పనులు. 2. బోర్‌వెల్ మోటార్లు మరియు పంప్‌సెట్ల మరమ్మతులు - 1 పని (రీకాల్). 3. నేమ్ బోర్డులకు రంగులు వేయడం మరియు వాటిని అమర్చడం - 1 పని (రీకాల్). | రూ. 41.70 లక్షలు | 06.07.2026 02.00 PM to 13.07.2026 02.00 PM | ఇ.ఇ., సర్కిల్-60, సిఎంసి, కుత్బుల్లాపూర్. సెల్ నెం. 7995468066 / 7331181426 |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: శ్రీ సుబ్రమణ్యSVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి.
మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-60, క్యూబిజెడ్, సిఎంసి.
DIPR R.O. No. : 5526-PP/CL/ADVT/2026-27, Date: 04-07-2026

**మెదక్ మున్సిపాలిటీ కార్యాలయం, మెదక్ జిల్లా.**
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
1) e-NIT Nos. E1/MCM/CC drain & Roads/W.no 1,2,3/UIDF/2025, Dated: 04-07-2026 (3rd Call)
2) e-NIT Nos. E1/MCM/CC Road, CC Drain and construction of Graveyard/W.no 12/ UIDF/2025, Dated: 04-07-2026 (3rd Call)
3) e-NIT Nos. E1/MCM/ Development of Gidakatta/Bokalayya/Pillikotyala Graveyards/ UIDF/2025, Dated: 04-07-2026 (3rd Call)
4) e-NIT Nos. E1/MCM/CC Drain& slab & Roads/W.no 26,28&29/UIDF/2025, Dated: 04-07-2026 (3rd Call)
5) e-NIT Nos. E1/MCM/Fort Quilla development/UIDF/2025, Dated: 04-07-2026 (3rd Call)
6) e-NIT Nos. E1/MCM/BT Road /Mallamcheruvu/UIDF/2025, Dated: 04-07-2026 (3rd Call)
7) e-NIT Nos. E1/MCM/CC Drain & Slab& Roads/W.no 30&32/UIDF/2025, Dated: 04-07-2026 (3rdCall)
పనుల సంఖ్య: (7)
బిడ్ పత్రాలను డౌన్‌లోడ్ చేయడం ప్రారంభమయ్యే తేదీ : 04-07-2026, సాయంత్రం 4:00 గంటలకు
బిడ్ పత్రాలను డౌన్‌లోడ్ చేయడం ముగిసే తేదీ : 10-07-2026, సాయంత్రం 4:30 గంటలకు
ప్రైస్ బిడ్ (ఆర్థిక బిడ్) తెరిచే తేదీ : 10-07-2026, సాయంత్రం 4:35 గంటలకు
గమనిక: టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను Tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చు. ఇతర సమాచారం కోసం మెదక్ మున్సిపాలిటీ కమిషనర్ లేదా ఇంజనీర్‌ను ఫోన్ నంబర్లు: 9154293322, 9154293336, 6303678200 ద్వారా సంప్రదించగలరు. టెండర్లను రద్దు చేసే లేదా వాయిదా వేసే పూర్తి అధికారం కమిషనర్‌కు ఉంటుంది.
సం/- కమిషనర్, మెదక్ మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 5540-PP/CL/ADVT/2026-27, Date: 04-07-2026

# స్వర్ణ తెలంగాణగా తీర్చిదిద్దడమే సిఎం లక్ష్యం

## టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ సమర్థవంతమైన నాయకత్వంలో తెలంగాణను అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తు స్వర్ణ తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం 2006లో ప్రారంబించి జడ్పిటిసి పదవి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగారని కొనియాడారు. ప్రజా సేవలో అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కోట్లాది ప్రజల ఆశయాలకు ప్రతినిధిగా నిలువడం ఆయన పట్టుదలకు నిదర్శమని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలన లక్ష్యంగా సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాలు రాష్ట్ర ప్రగతికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని చెప్పారు. సిఎం న్యాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి సాధించి పేద వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు స్వర్ణ తెలంగాణగా తీర్చిదిద్ది దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు



**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ సర్కిల్ పరిధిలోని సింహపురి కాలనీలో స్థానికులకు ఇబ్బందికరంగా మారిన అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. 100 ఫీట్ల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చేపట్టిన అక్రమ కట్టడాలను అధికారులు కూల్చివేశారు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ స్థలాలను ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను గుర్తించి, వాటిని జెసిబిల సాయంతో తొలగించారు. పాదచారుల భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్ సమస్యలను నివారించడం కోసం ఈ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణికరన్, ఎసిపి శ్రీనివాస్, టిపిఎస్ ముఖేష్ సింగ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్, బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి : ఎస్సై కె.గిరి

**ప్రజాపక్షం/నవాబుపేట :** నవాబుపేట మండలంలోని పులుమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నవాబుపేట్ ఎస్సై కే.గిరి తమ సిబ్బందితో కలిసి సురక్ష్ మిత్ర, సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులు, వేధింపులకు గురైనప్పుడు ఎలా స్పందించాలి, ఎవరికి సమాచారం ఇవ్వాలి, పోలీసులను ఎలా సంప్రదించాలి అనే విషయాలను వివరించారు. అదే విధంగా మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, ఒటిపిలు, బ్యాంకు వివరాలను ఎవరికీ ఇవ్వకూడదని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సురక్ష మిత్ర వాలంటీర్లను భాగస్వామ్యం చేసి, మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో పోలీసులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి వేధింపులు, సైబర్ మోసాలు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై గిరి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, సురక్ష్ మిత్ర వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వంగవీటి మోహనరంగా ఆశయాలు చిరస్మరణీయం : బండి రమేష్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** మాజీ ఎమ్మెల్యే, ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా శనివారం కెపిహెచ్‌బి టెంపుల్ బస్‌స్టాప్ వద్ద ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోహనరంగా ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. సమాజ సేవ, ధైర్యసాహసాలు, ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ పుష్పరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, నాయకులు గంధం రాజు, రంగమోహన్, కరుణాకర్, భరత్, అరవింద్‌రెడ్డి, కిలారు శ్రీనివాస్‌బాబు, రాజేష్ గౌడ్, నళినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.




# వరుస ఇళ్ల చోరీలు...ఏడుగురు అరెస్టు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రాత్రి వేళలో వరుసగా ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను కీసర పోలీసులు అరెస్టు చేశారు. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా నాలుగు కేసులలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో తాళం వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను అపహరించిన చోరీలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసులను ఛేదించారు. విశ్వసనీయ సమాచారం మేరకు డబ్బేట బాలలింగం(ఏ1), డబ్బేట అశోక్(ఏ2),డబ్బేట చంద్రశేఖర్(ఏ3),డబ్బేట నవీన్(ఏ4),బొక్కొల్ల బాబు(ఏ5),కెతొని నరేష్(ఏ6),బొక్కొల్ల రవి(ఏ7)లను కీసర గ్రామ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించడంతో తమ నేరాలను అంగీకరించారు. నేరాలకు ఉపయోగించిన రాయల్ ఇన్‌ఫీల్డ్,22 తులాల బంగారం,వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుల దర్యాప్తు మల్కాజ్‌గిరి డిసిపి శ్రీధర్, సిసిఎస్ డిసిపి గుణశేఖర్, సిసిఎస్ అడిషనల్ డిసిపి రామేశ్వర్, జవహర్‌నగర్ ఏసిపి మార్గదర్శకత్వం, కీసర సిఐ ఆర్కపల్లి ఆంజనేయులు, డిఐ బిక్కీ రమేష్, సిసిఎస్ సిఐ రవికుమార్, ఆధ్వర్యంలో కేసులను ఛేదించారు.

# దొడ్డి ఆశయాలు ముందుకు తీసుకువెళదాం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నిజాం పాలనలో భూస్వాముల దౌర్జన్యాలు, అణచివేతలను ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఎదురొడ్డి పోరాడి అమరుడైన దొడ్డి కొమరయ్య ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలందరిపై ఉందని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. కామ్రేడ్ దొడ్డి కొమరయ్య 80వ వర్థంతి సందర్భంగా శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో విసునూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి తన తల్లి జానకమ్మతో కల్సి కొనసాగించిన భూస్వాముల దోపిడీ, దైర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తూ పోరాడి చివరికి అతడి ప్రయివేట్ సైన్యం, రజాకార్ల కాల్పుల్లో దొడ్డి కొమరయ్య అమరుడయ్యాడన్నారు. ఈ త్యాగమే తెలంగాణా రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచి వేలాదిమంది రైతులు, కూలీలు ఉద్యమంలోకి రావటానికి దోహదపడిందన్నారు. దొడ్డి కొమరయ్య అమరత్వం తర్వాతనే కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభల సంయుక్తంగా అప్పటి హైదరాబాద్ రాష్ట్రవ్యాప్తంగా భూస్వామ్య వ్యవస్థకు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాయన్నారు.

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య చూపిన న్యాయం, సమానత్వం, లౌకిక ప్రజాస్వామ్య విలువల పరిరక్ష ణ కోసం యువత పోరాట స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.సత్యప్రసాద్, ధర్మేంద్ర, జిల్లా సమితి సభ్యులు లక్ష్మి నారాయ ణ, నారా నరసింహ, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు మహిళా నాయకురాలు శోభ, విజయ, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆ శాఖ అధికారి టి. ఝాన్సీ రాణి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతుల హక్కుల కోసం పోరాడిన దొడ్డి కొమరయ్య 1946లో జరిగిన తెలంగాణా



రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించి ప్రాణ త్యాగం చేసారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి సాంబశివ రావు, జిల్లా పరిపాలనాధికారి సీతారాములు, వెనుక బడిన తరగతుల శాఖ అధికారి రవీందర్, కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి తిరుపతి వెంకటేష్, ఉపాధ్యక్షులు గట్టయ్య, జాలేష్, తదితరులు పాల్గొన్నారు.

# అనురాగ్‌లో పట్టాల సందడి

## విద్యార్థులకు ప్రదానం చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి




**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** అనురాగ్ విశ్వవిద్యాలయం 3వ వార్షిక స్నాతకోత్సవా న్ని ఘనంగా నిర్వహించి ఇంజినీరింగ్ ఔషధశాస్త్రం యాజమాన్య విద్య, విజ్ఞానశాస్త్రాలు, వ్యవసాయ విభాగాలకు చెందిన 2,789 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసింది. ఈ వేడుకలో పట్టభద్రులు, కుటుంబ సభ్యులు, అధ్యాపకులు పారిశ్రామికరంగ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ ఏడాది 2,193 మంది ఎంబిఎ, 44మంది డాక్టరేట్ 155 మంది ఎంబిఎ, 90 మంది ఎంసిఎ, 88 మంది బిఫార్మసీ,74 మంది బిబిఎ విద్యార్థులతో పాటు పిజి డాక్టరేట్ కోర్సుల విద్యార్థులకు కూడా పట్టాలు అందజేశారు. చేనేతరంగంలో విశిష్ట సేవలకు పద్మశ్రీ చింతకింది మల్లేశంకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయ ఛైర్మన్ జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సులో నైపుణ్యం సాధించిన వారికే భవిష్యత్తులో అధిక అవకాశాలు ఉంటాయని తెలిపారు. దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పట్టభద్రులకు సూచించారు. ముఖ్య అతిథి సిఐఐ ఛైర్మన్ రీసస్టైనబిలిటీ లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకుడు గౌతమ్ రెడ్డి, ఛాన్సలర్ డా.యుబి దేశాయ్ కృత్రిమ మేధస్సును అవకాశంగా మలుచుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా అండ్ మహీంద్రా, ధృవ్‌స్పేస్, క్వాల్‌కామ్, డెలాయిట్, పీడబ్ల్యూసీ పెప్సికో, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, సీమెన్స్ కార్వీఫిన్‌టెక్ సంస్థల ప్రతినిధులు డీన్లు అధ్యాపకులు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# యువతి అదృశ్యం




**ప్రజాపక్షం/చర్లపల్లి:** యువతి అదృశ్యమైన సంఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి పిఎస్ పరిధిలోని అశోక్ నగర్‌కు చెందిన బండాలు అంజలి (20) తన స్నేహితురాలి పుట్టినరోజు వేడుకకు కుషాయిగూడకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పింది. ఒక గంట తర్వాత కుమార్తెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో బంధువులు, స్నేహితులు తెలిసిన ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# జోరుగా 'సర్' ప్రక్రియ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** సర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్, టిడిపి సీనియర్ రాష్ట్ర నాయకులు రుద్రగోని రాంచందర్ గౌడ్ అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లిలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ ఎన్యూరేషన్ ఫారాలను నింపి అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ అశ్విన్ రాజు, శ్రీలత, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



# స్వామి వివేకానంద 124వ వర్ధంతి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** భారత జాతి గర్వించదగ్గ మహనీయుడు యువతకు చిరస్థాయి, స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద 124వ వర్ధంతి ఈ డబ్ల్యూఎస్ కాలనీ చౌరస్తాలో యువజన సంఘం అధ్యక్షులు బర్ల రాధాకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్లు కుతాడి రవీందర్, కడుపోల్ల మల్లేష్, మాజీ వార్డు సభ్యులు, కాలనీ అధ్యక్షులు కేశవ పట్నం ఆంజనేయులు,సెక్రటరీ శశిధరన్,యువజన సంఘం అధ్యక్షులు బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, దంతాల అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


# పార్టీని నమ్మిన వారికే పదవులు ఇవ్వాలి

## సామ వెంకట్‌రెడ్డిని తప్పిస్తే ఎఐసిసిని ఆశ్రయిస్తాం

### వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య

**ప్రజాపక్షం/నవాబుపేట్:** దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారిని కాదని ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడంపై జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, బి బ్లాక్ అధ్యక్షు లు మధుసూదన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నవాబుపేట మండల కేంద్రంలో అధికార పార్టీలోని ఓ వర్గానికి చెందిన నాయకులతో కలిసి పత్రిక సమావేశం వారు నిర్వహించి మాట్లాడారు. చేవెళ్ల నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ఇతర అంశాలపై ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని వారు విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే మండలంలోనే రోడ్ల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని, ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు చేశారు.

పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలను పక్కనబెట్టి, ఎమ్మెల్యే అనుకూలంగా వ్యవహరించే వారికి మాత్రమే పదవులు కట్టబెడుతున్నారని విమర్శలు చేశారు. స్వార్థ ప్రయోజనాలు, వ్యక్తిగత ఆస్తులను కాపాడుకోవడానికే ఎమ్మెల్యే అధికార పార్టీలో చేరారని, ప్రజల సమస్యలను పక్కన బెట్టి రాజకీయ లబ్ధికోసం పార్టీ మారడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి కార్యకర్తకు తన అభిప్రాయా న్ని వ్యక్తపరిచే హక్కు ఉందని, వారిని లక్ష్యంగా చేసుకుని ఎమ్మెల్యే కానీ, వారి వర్గీయులు ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. పార్టీని నమ్ముకుని పని చేస్తున్న వారిని పక్కన పెట్టి నిన్న కాక మొన్న పార్టీలోకి వచ్చిన వారికి పదవులు ఎలా ఇస్తారంటూ మండిపడుతున్నారు. నవాబ్‌పేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సామ వెంకట్ రెడ్డినే కొనసాగించాలని, పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు. మండలంలో కాంగ్రెస్




పార్టీని మరింత బలోపేతం చేయడానికి సామ వెంకట్ రెడ్డి నాయకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు. అధిష్ఠానం కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆయనకే అవకాశం కల్పించాల ని విజ్ఞప్తి చేశారు. అధ్యక్ష పదవిలో సామ వెంకట్ రెడ్డినే కొనసాగించకపోతే ఆ విషయాన్ని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) దృష్టికి తీసుకెళ్లి న్యాయం కోరుతామని స్పష్టం చేశారు. అడ్డదారిలో పదవులు తెచ్చుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోం. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను పక్కనపెట్టి అన్యాయంగా పదవులు కట్టబెడితే తీవ్రంగా వ్యతిరేకిస్తాం. అర్హత, సేవాభావం పార్టీ పట్ల నిబద్ధత ఉన్న వారికే పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తు న్నాం. ఈ కార్యక్రమంలో సామ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బిసి సెల్ అధ్యక్షులు శ్రీధర్, అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ రెడ్డి, సర్పంచులు నర్సింహా రెడ్డి, దాన నర్సింలు, ప్రభాకర్, కొండల్ యాదవ్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి రామచంద్రయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పోచారం కాంగ్రెస్‌కు కొత్త సారథి



## కర్రె రాజేష్‌కు ఘన సన్మానం.. బాధ్యతల స్వీకారం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం 8వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కర్రె రాజేష్ నియామకాన్ని పురస్కరించుకుని అన్నోజిగూడలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పోచారం డివిజన్ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందనలు తెలిపారు.నాయకులు మాట్లాడుతూ సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పార్టీకి బలమైన సంస్థాగత పునాది వేయగా ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్ సమన్వయంతో పార్టీ మరింత బలోపేతం అయిందన్నారు. అదే స్ఫూర్తితో కర్రె రాజేష్ నాయకత్వంలో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కర్రె రాజేష్ మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కార్యకర్తలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం పార్టీ బలోపేతం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మెట్టు గణేష్ యాదవ్, పాలకూరి నాగరాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# నిస్వార్థ ప్రజా కళాకారుడు నాగన్నకు సిపిఐ ఘన నివాళి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** అరుణోదయ ప్రజా కళాకారుడు నాగన్న మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ సిపిఐ జగద్గిరిగుట్ట కార్యాలయం వద్ద ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో శనివారం నివాళి కార్యక్రమం నిర్వహించారు. నాగన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ ప్రతి పల్లెలో, ప్రతి ప్రజా ఉద్యమంలో ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో వినిపించిన పోరాట గీతాల్లో నాగన్న గొంతు చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. జీవితాంతం ప్రజల కోసమే పాటలు పాడిన ఆయన సంపదలు, ఆస్తులు కూడబెట్టే మార్గాన్ని ఎంచుకోకుండా నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితమయ్యారని కొనియాడారు. కోరుకుంటే కోట్ల రూపాయలు సంపాదించే అవకాశం ఉన్నప్పటికీ ప్రజల పక్షాన నిలిచిన అరుదైన కళాకారుడిగా నాగన్న నిలిచిపోయారన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు, సాంస్కృతిక రంగానికి తీరనిలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు హరినాథ్‌రావు, రాములు, జర్నలిస్టు నాయకుడు దప్పు రామస్వామి, తొండ వెంకట్, ఎఐఎస్ఎఫ్ నాయకులు అరవింద్, సాయి, యువజన నాయకుడు కీర్తి, సిపిఐ నాయకులు జానకిరామ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పూడికతీత పనులు పరిశీలించిన చైర్ పర్సన్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాలను, ఓపెన్ డ్రైనేజి వ్యవస్థలను మెరుగుపరుస్తున్నామని మురుగుపారుదలకు ఏలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపడుతున్నామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శనివారం అలియాబాద్ మున్సిపల్‌లోని పెద్ద మోరీ నాలాల పూడిక తీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం గడిచిన వేసవిలో స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి ప్రజలకు తాగు నీరు అందించి దాహార్తిని తీర్చిన నిర్వాహకులను అభినందించా రు. అలాగే కేశవరం గ్రామానికి చెందిన మేడోజి బాల్‌రామ్‌చారి స్వయంగా రచించిన కొన్ని పుస్తకాలను చదువుకోవడానికి చైర్ పర్సన్‌కు అందజేశారు. అలాగే అలియాబాద్ ప్రధాన చౌరస్తాలోని డైమండ్ కేఫ్‌ను సందర్శించి పారిశుద్ధ్య నిబంధనలు పాటించకుండా హోటల్ నడుపుతున్న యాజమాన్యానికి రూ.5వేలు జరిమానా విధించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నివారణలో భాగంగా హోటల్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహార పదార్థాల తయారీ, పరిశుభ్రత, ప్రమాణాల్లో లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీల్లో పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# అనుమానం పెనుభూతం... భార్యను కడతేర్చిన భర్త



**ప్రజాపక్షం/ఉప్పల్ :** అనుమానం పెనుభూతంగా మారటంతో ఓ యువకుడు కట్టుకొన్న భార్యనే కత్తితో పొడిచి హతమార్చిన దారుణఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన సురేష్(41), హైదరాబాద్‌లోని రాంనగర్‌కు చెందిన జెస్సికా (38)తో వివాహం జరుగగా వారికి తొమ్మిదేళ్ల కుమార్తె తో కల్సి చిలుకా నగర్ ప్రాంతంలోని ఆదర్శ్ నగర్ లో నివాసం ఉంటున్నారు. సురేష్ సఫిల్‌గూడలో క్యాబ్ సూపర్‌వైజర్‌గా పని చేస్తుండగా జెస్సికా తార్నాకలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. గత కొద్దికాలంగా భార్యపై రేకెత్తిన అనుమానాల కారణంగా దంపతుల మధ్య తరచు గొడవలు జరుగుతున్న క్రమంలో పది రోజుల క్రితం కుమార్తె బోడుప్పల్‌లో ఉండే బాబాయ్ ఇంటికి వెళ్లింది. శుక్రవారం రాత్రి వారిమధ్య మరోసారి జరిగిన గొడవలతో సురేష్ ఆవేశంతో ఇంట్లో ఉన్న పదునైన కత్తితో జెస్సికాపై దాడిచేసి పొడిచి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందిన విషయాన్ని స్థానికుల ద్వారా సమాచారం అందుకొని శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు పరారీలో ఉన్న నిందితుడిని చిక్కడపల్లిలో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సంఘటనాస్థలిని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకొని దర్యాప్తుకు సంబంధించి అధికారులకు సూచనలిచ్చారు.

# వివాహిత ఆత్మహత్య...

## భర్త, అత్తమామలపై కేసు నమోదు



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో ఒక వివాహిత అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్‌హెచ్‌వో సైదులు మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. ..శాంతినగర్‌కు చెందిన మజ్జారి రేఖ (21) అనే గృహిణికి, సుమారు మూడేళ్ల క్రితం ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సాయికిరణ్‌తో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. కాగా, శుక్రవారం (తేదీ: 03.07.2026) మధ్యాహ్నం సుమారు 4:00 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని వాతావరణంలో రేఖ తన బెడ్‌రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. ఆ తర్వాత ఇంటికి వచ్చిన అత్త, రేఖ ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. వెంటనే స్థానికులకు సమాచారం అందించగా, వారు రేఖను కిందికి దించి పరిశీలించగా ఆమె అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సమక్షంలో ప్రాథమిక ఆధారాలను సేకరించి పరిశీలించారు.

**భర్త, అత్తమామల వేధింపులే కారణం: తల్లి ఫిర్యాదు**

కుమార్తె మరణవార్త విన్న రేఖ తల్లి జయమ్మ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తన కుమార్తె మరణానికి అల్లుడు సాయికిరణ్‌తో పాటు అతని తల్లిదండ్రులు (అత్త, మామ) కారణమని, వారి వేధింపుల వల్లే తన కూతురు ప్రాణాలు కోల్పోయిందని జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొండోజు శ్రీనివాస్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా కొండోజు శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించిన నియామకాల్లో వనస్థలిపురం డివిజన్ చెందిన కొండోజు శ్రీనివాస్‌ను అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రం గారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మ ధుయాష్కీ గౌడ్, జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహ్మా రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం తన సహాయా సహాకారాలు అందిస్తూ, పార్టీకి కట్టుబడి ఉంటూ పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీని మరింతా ముందుకు తీసుకెళ్తుమని తెలిపారు.

## శ్రీరామ్‌నగర్‌లో ఫుట్‌పాత్‌లను అక్రమించి వేసిన షెడ్ల తొలగింపు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధీలోని శ్రీరామ్‌నగర్‌లో శనివారం ఫుట్‌పాత్‌లను అక్రమించి వేసిన షెడ్లను, ఇతర దుకాణాలను హైడ్రా అధికారులు, సిఎంసి అధికారులు భారీ బందోబస్తుతో కలసి తొలగించారు. సైబారాబాద్ మున్సిపల్ కమీషనర్ (సిఎంసి) కమీషనర్ కార్యలయంలో ఏర్పాటు చేసిన చిట్‌చాట్ కార్యక్రమంలో కమీషనర్ సృజన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సౌకర్యలతో పాటు ప్రతి సర్కిల్‌లో ప్రతి శనివారం ఫుట్‌పాత్‌ల అక్రమణలను తొలగిస్తున్నామని, మళ్ళీ వాటిని అలాగే వదలేస్తే మళ్ళీ, మళ్ళీ అక్రణలు చెపడుతున్నారని కాబట్టి అక్రమణలను తొలగించిన 15 రోజులలో రోడ్ల వెడల్పు అభివృద్ధి, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి చేయడానికి నూతన ప్రణాళిక ఏర్పాటు చేశామని సిఎంసి కమీషనర్ సృజన తెలిపారు. అదే విధంగా జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలేత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పదవీ విరమణ సర్వసాధారణమే



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఉద్యోగ పర్వంలో పదవీ విరమణ సర్వసాధారణమేనని, అందించిన సేవలను విద్యార్థులు ఎల్లప్పుడు గుర్తించుకోవాలని మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి సూచించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు కరుణ శ్రీ పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొని ఉపాధ్యాయురాలు కరుణశ్రీ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంతో కీలక పాత్ర పోషిస్తారని గుర్తు చేశారు. ఉపాధ్యాయురాలు కరుణ శ్రీ అందించిన సేవలను ప్రతి విద్యార్థి గుర్తించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, వార్డు సభ్యులు శ్రీనివాస్, శ్రీనివాస్ చారిలతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



**ప్రజాపక్షం/యాచారం :** విద్యార్థులు తల్లిదండ్రుల మాటలను గౌరవించి చక్కగా చదువుకోవాలని ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ లహరి, వ్యవస్థాపకులు నాయిని నవీన్‌రెడ్డి అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని ప్రైమరీ పాఠశాలల్లో తమ ఫౌండేషన్ అధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేస్తామని తెలిపారు. అయా గ్రామాల ప్రజాప్రతినిధుల సహకారంతో సమాజా సేవలో ముందుండి పని చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో బ్యాగులు పంపిణీ చేశామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఎప్పడు అండగా ఉంటుందన్నారు. చిన్నారులు కష్టపడి చదువుకోవాలన్నారు. మీకు అండగా నేను ఉన్నానంటు ధైర్యాన్ని నింపారు. అనంతరం గ్రామ సర్పంచ్ కోలన్ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణీ చేయడం ఎంతో శుభ పరిణామమన్నారు. మును ముందు కూడా పాఠశాల అభివృద్ధికి సహకరించాలని అమే కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఉప సర్పంచ్ బడే కుమార్, వార్డు సభ్యులు , ఎన్ఎన్అర్ సభ్యులు తదితరులు పాల్గోన్నారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సుక్షితంగా గమ్యం చేరాలి

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** ద్విచక్రా వాహన దారులందరు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని ఫ్యూచ్చర్ సిటీ కమిషనరేట్ ట్రాఫిక్ డిసిపి శివం ఉపాధ్యాయ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శాస్త్రా గార్డెన్‌లో బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత హెల్మెంట్ పంపిణీ కార్యక్రమానికి ట్రాఫిక్ డిసిపి ముఖ్య అతిథులుగా హజరై ద్విచక్రా వాహన దారులకు హెల్మెంట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిసిపి మాట్లాడుతూ వాహనదారులు హెల్మెంట్, సీటు బెల్ట్‌లు ధరించి, రోడ్డు భద్రత, ట్రాఫిక్ సూత్రాలు పాటించి రోడ్డు ప్రమాదం నుండి విముక్తి పొందాలని సూచించారు. వాహనాలు నడిపించే వాహనదారులు మద్యం సేవించి,సెల్ ఫోన్ మాట్లాడుతూ అతివేగంతో వివిధ వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనం ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలతో పాటు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించి ప్రాణాలను కాపాడుకొవాలని కుటుంబంతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమం లో బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బి రాంరెడ్డి,ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి, సిఐ మహేందర్ రెడ్డి.యువకులు,బిఆర్ఆర్ సభ్యులు పాల్గోన్నారు.



# డెంగీ నియంత్రణకు కట్టుదిట్ట చర్యలు

### అధికారులకు డిపిహెచ్ అదనపు డైరెక్టర్ డాక్టర్ పద్మజ ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో డెంగీ కేసులను సమర్థంగా అరికట్టేందుకు అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డిపిహెచ్) అదనపు డైరెక్టర్ డాక్టర్ పద్మజ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ మలేరియా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె ఈ మేరకు పలు కీలక సూచనలు చేశారు. సమావేశంలో నేషనల్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ ప్రోగ్రాం (ఎన్‌సివిబిడిసి) కన్సల్టెంట్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల డిస్ట్రిక్ట్ మలేరియా అధికారులు, జిహెచ్ఎంసి సీనియర్ ఎంటమాలజిస్టులు, మెట్రోపొలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ప్రతినిధులు, ప్రైవేట్ ఆస్పత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు. ఐహెచ్ఐపి పోర్టల్‌లో నమోదయ్యే డేటా నాణ్యతను మరింత మెరుగుపరచాలని డాక్టర్ పద్మజ సూచించారు. ప్రోగ్రాం అధికారులు, సబ్ యూనిట్ అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల సిబ్బంది ప్రతిరోజూ రోగుల వివరాలను ధృవీకరించాలని స్పష్టం చేశారు. కేసుల ట్రేసింగ్‌కు సౌలభ్యంగా పూర్తి చిరునామాలు, సంప్రదింపు నంబర్లు తప్పనిసరిగా నమోదు చేయాలని ప్రభుత్వ వైద్య సంస్థలకు సూచించారు. మూడు జిల్లాల సబ్ యూనిట్ అధికారులు, జిహెచ్ఎంసి ఏఎంఒహెచ్‌లు డెంగీ పాజిటివ్ కేసులను క్షుణ్ణంగా ఫీల్డ్‌లో పరిశీలించాలని, ఏవైనా వ్యత్యాసాలు గుర్తిస్తే 24 గంటల్లోపు సరిదిద్దాలని ఆదేశించారు. తీసుకున్న చర్యల నివేదికలను 48 గంటల్లోపు సిటీ కార్యాలయానికి పంపాలని సూచించారు. ఇతర జిల్లాలు లేదా రాష్ట్రాలకు చెందిన కేసులను 24 గంటల్లోపు ఐహెచ్ఐపి పోర్టల్ ద్వారా క్రాస్ నోటిఫై చేసి రాష్ట్ర ఐడిఎస్‌పికి సమాచారం అందించాలని తెలిపారు. ఫైలేరియా కేసులను సంబంధిత ఐహెచ్ఐపి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఐహెచ్ఐపి– ఐడిఎస్‌పి పోర్టల్ డేటాను ఎన్‌సివిడిసి అధికారులు ప్రతి వారం సమీక్షిస్తారన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో డెంగీ ముప్పు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక మొబైల్ హెల్త్ క్యాంపులు, ఫీవర్ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ పద్మజ తెలిపారు. ఈ శిబిరాల్లో జ్వర పరీక్షలు, అవసరమైన వారికి డెంగీ ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ పరీక్షలు, ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. దోమల నివారణకు సంబంధించిన సమాచారాన్ని ఐఇసి మెటీరియల్ ద్వారా ప్రజలకు చేరవేయనున్నట్లు తెలిపారు. జిహెచ్ఎంసి సీనియర్ ఎంటమాలజిస్టులు, మెట్రోపొలిటన్ సర్వైలెన్స్ యూనిట్ అధికారులు లార్వల్ సోర్స్ మేనేజ్‌మెంట్, అవసరమైన ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించడం, శిబిరాల పరిసరాల్లో ఎంటమాలజికల్ సర్వైలెన్స్ చేపట్టడం వంటి కార్యక్రమాలను సమన్వయం చేస్తారని డాక్టర్ పద్మజ వివరించారు.

# నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన దొడ్డి

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి,రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి,రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్టు మండలకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాది రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విసునూరి దొర రామచంద్రారెడ్డి ఆగడాల వ్యతిరేకించినందున దొర గుండాల కాల్పుల్లో వీర మరణం పొందినారని అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిందని,ఎర్రజెండాలతో బరిసెలతో దొరలను ఎదిరించిన వీరులు ఎందరో అమరులయ్యారని తద్వారా నిజాం రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనమైందని గుర్తు చేశారు.ఈ పోరాటంలో కమ్యూనిస్టులు పాత్ర మరువలేనిదని నేడు వచ్చిన తెలంగాణలో సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. సవర్ణ పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని,ఇందులో బిజెపి కుట్ర దాగి ఉందని, నిష్పక్షపాతంగా అధికారులు వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు ఉండే విధంగా కృషి చేయాలని,లేని ఎడల మరో మారు పోరాటాలకు సిద్ధం కావాల్సి ఉం టుందని హెచ్చరించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గు డిసె వాసులకు న్యాయం చేస్తామని,చెప్పిన మా ట నిలబెట్టుకోవాలని అన్నారు. గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని ఇందిర మ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6 తారీఖున ఇందిరా పార్క్‌లో జరిగే వామపక్షాల మహా ధర్నాలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, మెట్టు శాఖ కార్యదర్శి వర్త్య రమేష్, మహిళా సమైక్య నాయకులు చందన, అబ్దుల్లా పూర్ మెట్టు గ్రామ పంచాయతీ13 వ వార్డు సభ్యురాలు కేతరాజు మంజుల,బిక్షపతి, నాగేశ్వరరావు, సుల్తాన్, నరసయ్య ఎనుగోటి లక్ష్మి ప్రియా పేరాల లక్ష్మి వాసిరెడ్డి లక్ష్మి లలిత వైశాలి మానెమ్మ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత, కుటుంబ సమస్యల పరిష్కారానికి సమగ్ర సేవలు




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మహిళల భద్రత, కుటుంబ సమస్యల పరిష్కారానికి సమగ్ర సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు షాద్‌నగర్ డిసిపి శిరీష వివరించారు. శనివారం పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో భరోసా ఫ్యామిలి కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిపి శిరీష మాట్లాడుతూ మహిళల భద్రతకు భరోసా కల్పిస్తూ గృహహింస, లైంగిక వేధింపులు, కుటుంబ కలహాలు వంటి సమస్యలతో బాధపడుతున్న మహిళలకు భద్రత కల్పించేందుకే ఫ్యామిలి కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న కుటుంబ, సామాజిక సమస్యలకు చట్టపరమైన సలహాలు, మానసిక పరామర్శ, కుటుంబ కౌన్సిలింగ్‌తో పాటు అవసరమైన సహాయ సేవలను ఈ సెంటర్ ద్వారా అంధించడం జరుగుతుందని వివరించారు. కుటుంబ విభేదాలు, గృహహింస, వేధింపులు వంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఎలాంటి భయాందోళనలు లేకుండా ముందుకు వచ్చి ఈ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యలను ప్రారంభ దశలోనే పరిష్కరించడంతోపాటు కుటుంబ వ్యవస్థలను కాపాటంతోపాటు బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం పోలీసుశాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. బాధితులకు సత్వర సహాయం అంధించడంలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సూచించారు. ఆరు పోలీస్ స్టేషన్ల ప్రజలకు సేవలు అంధించేందుకు సిద్దంగా ఉన్నామని, ఈ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. మహిళలకు భద్రత కల్పించేందుకు ఈ కేంద్రం సమర్థవంతంగా పని చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ సీతారాం, పోలీస్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలింగ్ సెంటర్ కౌన్సెలర్ ప్రసన్న లక్ష్మీ , రిసెప్షనిస్ట్ అనిత పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వీరుడు 'దొడ్డి కొమురయ్య'

### రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి శారద

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి శారద అన్నారు.శనివారం దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి,విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమని తెలిపారు. దేశ స్వాతంత్రం, ప్ర జల సంక్షేమం కోసం విరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి కేషు రామ్, కలెక్టరేట్ ఎఒ సునీల్,తెలంగాణ రాష్ట్ర బిసి ఫ్రంట్ చైర్మన్ జి మల్లేష్ యాదవ్ ,పిసిసి కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్,క్యామ శంకర్,ఇబ్రహీంపట్నం కౌన్సిలర్ కాలే గణేష్ , సర్పంచ్ చర్ల పటేల్ గూడా పట్నం రమేష్ ,బిఎస్ పి నాయకులు బండ కుమార్ చేకూరి వెంకటేష్ పొట్టి శ్రీనివాస్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధాపూర్ చెత్త డంపింగ్ యార్డు ప్రతిపాదన విరమించుకోండి

### షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్



**ప్రజాపక్షం/కొత్తూరు:** సిద్ధాపూర్ చెత్త డంపింగ్ యార్డు ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని సిద్ధాపూర్ చెత్త డంపింగ్ యార్డు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ సిద్ధాపూర్‌లో పారిశ్రామిక ప్రాంతం ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం రైతుల నుండి భూములు సేకరించి ఇవ్వడం జరిగిందని వివరించారు. కానీ ఈ ప్రభుత్వం మాత్రం చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పచ్చని పొలాల మధ్య విషం చిమ్ముతున్న కాలుష్య చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. జారీ చేసిన జిఒను తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి చేయాల్సింది పోయి 2024 ఆగస్టు 1వ తేదిన చెత్త డంపింగ్ యార్డు కోసం ఉపయోగించాలన్న జిహెచ్ఎంసి కమిషనర్ ప్రతిపాదనకు అంగీకరించడం దురదృష్టమని పేర్కొన్నారు. సిద్ధాపూర్‌లో చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే మరో జవహర్ నగర్‌లా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో ప్రజలు అనారోగ్యాల పాలు కావడంతోపాటు చుట్ట పక్కల ఉన్న వ్యవసాయ పొలాలు సాగుకు అమోదయోగ్యంగా లేకుండా పోతాయని వివరించారు. ఈ ప్రాంతంలో భూముల ధరలు పూర్తిగా పడిపోవడంతో పాటు గాలి, నీరు పూర్తిగా కలుషితమైపొందన్నారు. ఒక్క సిద్ధాపూర్ గ్రామమే కాకుండా చుట్టు పక్కల ఉన్న గ్రామాలకు తీవ్ర నష్టం జరిగే అస్కారం ఉంటుందని, ఈ చెత్త డంపింగ్ యార్డు రాకుండా ఉండేందుకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. డంపింగ్ యార్డుకు సంబందించిన పనులు ప్రారంభం కాకముందే అడ్డుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. సిద్ధాపూర్ గ్రామంలో చెత్త డంపింగ్ యార్డు నిర్మించడం లేదని స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు పోరాటాలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని వివరించారు. దీనిపట్ల నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ అగమ్యగోచరంగా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉనికిని, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైన సిద్ధమని స్థానికులు పేర్కొంటున్నారు.



## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి

### గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి విపి గౌతం

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** డబుల్ బెడ్ రూమ్ (2బిహెచ్‌కె)ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయలని, ఇండ్ల కేటాయింపు సైతం పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి, హౌసిం గ్ కార్పొరేషన్ ఎండి వి. పి.గౌతం అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని మల్లాపూర్‌లో నిర్మాణంలో ఉన్న 1548 ఇండ్ల పనులను, అదేవిధంగా కుర్మల్ గూడలోని 1536 ఇండ్ల పనులను ఆయన పరిశీలించారు.అనంతరం ఆయన ఆయా ప్రాజెక్ట్ సైట్‌లలో వివిధ విభాగాల అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలతో పనులు జరుగుతున్న తీరును సమీక్షించారు.ఈ నిర్మాణపు పనులన్నిటిని నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేలా సైట్ ఇంజనీర్లు ప్రణాళిక ప్రకారం పని చేయాలని, జూలై నెలాఖరు లోపు నిర్మాణాలు పూర్తి చేయాలని చెప్పారు. అలాగే మౌలిక వసతులైన మంచినీరు, విద్యుత్ , డ్రైనేజి వ్యవస్థ లకు సంబంధించిన పనుల పురోగతి పై కూడా ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఇండ్లకు సంబంధించిన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ, ఇండ్లను కేటాయించే అంశంలో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.అంతకు ముందు రాజేంద్రనగర్ మండలం మైలార్ దేవులపల్లి,లక్ష్మీగుడ ప్రాంతా ల్లో కూడా ఆయన పర్యటించారు.లక్ష్మీగుడలోని రాజావ్ గృహ కల్ప,వాంబే కాలనీల్లో కూడా పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వాంబే కాలనీ (832 ఇండ్లు) నివాసులు తమకు నీటి కనెక్షన్ ఉన్నప్పటికీ,ఇండ్లకు మంచినీటి సరఫరా కావడం లేదని ఎండి దృష్టికి తీసుకువచ్చారు.ఈ అంశంపై ఆయన అక్కడికక్కడే వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్,రంగారెడ్డి జిల్లా పిడి డి.చాంప్లా నాయ క్, ఇఇ నర్సయ్య తో పాటు పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూలనకు అందరు సమన్వయంతో పనిచేయాలి

### రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం విజయవంతానికి అందరు సమన్వయంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి అన్నారు.శనివారం రంగారెడ్డి జిల్లా శివరాంపల్లి లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ డి స్వర్ణ కుమారి అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతంని కై సమీక్ష సమావేశం ఆర్‌బి ఎస్‌కె బృందాలు,డిఇఐసి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ 2026 జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాల్లో విజయవంతంగా నిర్వహించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 01 సంవత్సరం నుండి19 వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండాజోల్ మాత్రలు అందేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్‌బిఎస్‌కె వైద్య బృందాలు,డిఇఐసి సిబ్బంది,జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు,సంబంధిత కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం, పచ్చదనంపై ఎంఎంసి కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీలు



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి నగరంలోని పలుచోట్ల పారిశుద్ధ్యం, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు, నాలాల నిర్వహణ, దోమల నివారణ, పచ్చదనం అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గుంటి జంగయ్య కాలనీ, జహంగీర్ నగర్, హరిహరపురం, గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్ ప్రాంతాల్లో చెత్త తొలగింపు, నాలాల డీసిల్టింగ్, సిసి కెమెరాల ఏర్పాటు, మొక్కల పెంపకం, దోమల నివారణ చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధత, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నగరంలో హరితాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన మల్కాజిగిరి నిర్మాణానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, ప్రజలు మున్సిపల్ సిబ్బందితో సహకరిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

### 14తులాల బంగారం.. ఒక ఐఫోన్ స్వాధీనం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దొంగతనం చేసిన కేసును ఛేదించడంతో పాటు 14తులాల బంగారు వస్తువులు, ఒక ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. 2026 జూన్ 22వ తేది రాత్రి పట్టణ శివారులోని సాయిబాలాజీ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న యెన్నం వీరేందర్‌రెడ్డి ఇంట్లోకి దొంగలు చొరబడి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి 18తులాల బంగారం, వెండి అభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. దాంతో బాధితుడు యెన్నం వీరేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో ప్రధాన నిందితుడు మహ్మద్ సోహెల్ ఖురేషీ (26)తో పాటు మరో నింధితుడు కలిసి చోరికి పాల్పడినట్లు తెలిపారు. ఇంట్లో చోరీ చేసిన బంగారు అభరణాలను ఇద్దరు దొంగలు పంచుకొని తన వాటాగా వచ్చిన రెండు బంగారు ఉంగరాలను విక్రయించి సుమారు 1లక్ష పొందిన నిందితుడు వ్యక్తిగత ఖర్చులు చేసుకొని రూ.76వేలతో హైద్రాబాద్ కోటి జగదీష్ మార్కెట్‌లో ఐఫోన్ 17ఎయిర్ మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేసినట్లు తెలిపారు. మిగత బంగారు అభరణాలు తన ఇంట్లోనే ఉన్నాయని దొంగ ఒప్పుకున్నట్లు, జూలై 4వ తేదిన బంగారు అభరణాలు విక్రయించేందుకు వెళ్తున్న సమయంలో షాద్‌నగర్ క్రైమ్ టీం, సిసిఎస్ ఫ్యూచర్ సిటి పోలీసులు పట్టుకున్నట్లు వివరించారు. నింధితుడి నుండి మూడు తులాల బంగారు గొలుసులు, మూడు బంగారు నెక్లెస్‌లు మొత్తం 8.5తులాలు, ఐదు జతల బంగారు చెవిపోగులు (2.5తులాలు), ఒక ఐఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరు నిందితుల్లో ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దొంగతనం కేసు ను చేధించినందుకు ఎస్ఐలు శ్రీకాంత్‌నాయక్, శివారెడ్డి, షాద్‌నగర్ క్రైమ్‌టీం హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్, కానిస్టేబుళ్లు కరుణాకర్, సంతోష్, జాకీర్, మోహన్ లాల్, రాజు, రఫీతోపాటు సిసిఎస్ పోలీస్ సిబ్బంది ప్రవీణ్, రాజులను షాద్‌నగర్ డిసిపి శిరీష ప్రత్యేకంగా అభినందించారు. వారి ప్రతిభను గుర్తించి నగదు రివార్డులు అందించారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ సిఐ సీతారాం ఉన్నారు.



# వరద నీటి నిర్వహణకు మాస్టర్ ప్లాన్

- మూడు కార్పొరేషన్‌లలో సర్వే నిర్వహణకు టెండర్లు
- అంతర్జాతీయ స్థాయిలో కూడళ్లు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి
- సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని మూడు కార్పొరేషన్లకు సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన తెలిపారు. ఈ ప్రణాళికలో ఓపెన్ నాలాలు, భూగర్భ డ్రైనేజీలు, కొత్తగా నిర్మించాల్సిన నాలాలు, గొలుసుకట్టు డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి వంటి అంశాలను సమగ్రంగా పొందుపరుస్తున్నామని చెప్పారు. కన్సల్టెన్సీ ఎంపిక కోసం ఇప్పటికే టెండర్లు ఆహ్వానించామని, మాస్టర్ ప్లాన్ పూర్తయ్యేలోపే నగరంలో వరద ముప్పును తగ్గించే చర్యలను వేగవంతం చేస్తామన్నారు. హైటెక్ సిటీలోని సిఎంసి ప్రధాన కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఆమె ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నగర మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపడుతున్న పలు కీలక కార్యక్రమాలను వివరించారు. సిఆర్ఎంపి కింద ప్రధాన రహదారులను యంత్రాలతో శుభ్రపరచడం, అంతర్జాతీయ ప్రమాణాలతో రోడ్ల విస్తరణ, ఫుట్పాత్ల అభివృద్ధి, మురుగునీటి వ్యవస్థ బలోపేతం వంటి ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని తెలిపారు. అలాగే సిఎంసికి చెందిన ఆస్తులను గుర్తించి జియోట్యాగింగ్ పూర్తి చేశామన్నారు. హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ట్రైజంక్షన్ చౌరస్తాలో అండర్‌పాస్, ఫ్లైఓవర్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, లింగంపల్లి రైల్వే ల్వె రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి), బాజాఘాట్ కూడలిలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి 2027 ఏప్రిల్ నాటికి ఈ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**హోటళ్లకు స్టార్ రేటింగ్**

సిఎంసి పరిధిలోని హోటళ్లలో పరిశుభ్రత, ఆహార నాణ్యతపై నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయని కమిషనర్ తెలిపారు. తనిఖీల వివరాలను పారదర్శకంగా ప్రజలకు వెల్లడిస్తున్నామని, త్వరలో హోటళ్లకు స్టార్ రేటింగ్ విధానాన్ని కూడా అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. పాదచారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు బెంగళూరులో అమలవుతున్న టెండర్ ష్యూర్ నమూనాలో సైబరాబాద్ ప్రాంతంలో ఆధునిక ఫుట్‌పాత్‌లను నిర్మించనున్నట్లు సృజన వెల్లడించారు. వాహనాలకు రహదారులు ఎంత ముఖ్యమో, పాదచారులకు సురక్షితమైన కాలినడక దారులు కూడా అంతే అవసరమని ఆమె అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద సిఎంసి రూ.55 కోట్ల కేంద్ర నిధులు లభించాయని, సంస్థ వాటాతో కలిపి చెత్త సేకరణ యంత్రాల కొనుగోలు, బయోమైనింగ్, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుధ్య సదుపాయాల మెరుగుదలకు వినియోగించనున్నట్లు తెలిపారు. రానున్న స్వచ్ఛ సర్వేక్షన్2027లో మెరుగైన ర్యాంకు సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపడుతామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సోమవారం నిర్వహించే ప్రజావాణికే పరిమితం కాకుండా, ప్రతి రోజూ ఫిర్యాదులు స్వీకరించే విధంగా కేంద్ర, జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. అందిన ప్రతి ఫిర్యాదును వారం రోజుల్లో పరిష్కరించేలా యంత్రాంగాన్ని సిద్ధం చేశామని చెప్పారు. అలాగే సోషల్ మీడియా ద్వారా రోడ్లు, వీధిదీపాలు, పారిశుద్ధ్య సమస్యలను ప్రజలు సులభంగా నమోదు చేసుకునే విధంగా వ్యవస్థను సరళతరం చేసినట్లు వివరించారు.

**74 కూడళ్ల అభివృద్ధి - ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ**

ట్రాఫిక్ రద్దీని తగ్గించి పాదచారులకు సురక్షిత ప్రయాణం కల్పించేందుకు నగరంలోని 74 ప్రధాన కూడళ్ల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు కమిషనర్ తెలిపారు. మరోవైపు సిఎంసి ఆస్తుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సర్వేలో 777 ఖాళీ స్థలాలు, పలు ఆటస్థలాలు, కమ్యూనిటీ హాళ్లు, కార్యాలయ భవనాలు గుర్తించామని, వీటిలో 448 స్థలాలకు ప్రహారీ గోడలు లేవని తెలిపారు. ఆ స్థలాలకు త్వరలో ప్రహారీగోడలు నిర్మించి, ఇప్పటికే ప్రహారీ ఉన్న స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కమిషనర్ సృజన తెలిపారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** వివిధ డివిజన్లలో నెలకొన్న తాగునీటి సమస్యలపై ఖైరతాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి శనివారం జలమండలి అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. నీటి సరఫరాలో అంతరాయం, కలుషిత నీటి సరఫరా, సమయపాలన లేని నీటి సరఫరాపై నెలకొన్న ఇబ్బందులకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు గజ్జల ఆనంద్, ఫిలింనగర్ డివిజన్ సీనియర్ నాయకులు వెంకీ ముదిరాజ్, శ్యామ్ గౌడ్ పాల్గొన్నారు.

## పోలీసుల స్పెషల్ డ్రైవ్



**ప్రజాపక్షం/సనత్‌నగర్:** మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు పోకిరీల ద్వారా ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చర్యలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సనత్‌నగర్ సిఐ అశోక్ ఆధ్వర్యంలో ప్రేమనగర్, ఆనంద్‌నగర్ కాలనీ కూడలిలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలను చెక్ చేసి వారి వివరాలు సేకరించారు.

## కార్మికుల వివరాల సేకరణ

**ప్రజాపక్షం/బేగంపేట్:** మీ సురక్ష కార్యక్రమంలో భాగంగా బేగంపేట్ పోలీసులు కార్మికుల వివరాల సేకరణ కొనసాగిస్తున్నారు. ఈ మేరకు శనివారం బేగంపేట్‌లోని ప్యారడైజ్ హోటల్ బ్రాండ్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న కార్మికులు, డ్రైవర్ల వివరాలు పోలీస్ సిబ్బంది సేకరించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ నవీన్ మాట్లాడుతూ, కార్మికుల రక్షణనే ధ్యేయంగా మీ సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

## బాలుడి కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు శ్రేయాన్ష్ గౌడ్ (4) ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గల్లీలో టర్నింగ్ తీసుకుంటున్న సమయంలో వాహనం ఢీకొట్టడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం బాధిత కుటుంబ సభ్యులను వారి నివాసంలో ఆయన పరామర్శించారు.

## వార్షిక బ్రహ్మోత్సవం



**ప్రజాపక్షం/అమీర్‌పేట్:** బాపూనగర్‌లోని వెంకటేశ్వర ఆలయంలో శనివారం జరిగిన వార్షిక బ్రహ్మోత్సవం లో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం తలసాని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, కరుణాకర్‌రెడ్డి, గోపిలాల్‌చౌహన్, కూతురు నర్సింహ, హరిసింగ్ తదితరులు ఉన్నారు.

## న్యూ ఇండియా పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా మాధవరావు



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** న్యూ ఇండియా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా పాశం మాధవరావును నియమితులైనట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డా.జె.వి.రాజు తెలిపారు. శనివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్ వేదికగా ఆయనకు నియామక పత్రం అందజేసిన రాజు మీడియాతో మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆర్థికంగా లబ్ధిపొందాలన్నదే తమ పార్టీ లక్ష్యమన్నారు. అందుకు తమ పార్టీ ఆకలిచావులు, ఆత్మహత్యలు, దోపిడీ, అవినీతి, అరాచకాల్లేని రాజ్యాన్ని స్థాపించేందుకు ముందుకెళ్తున్నట్టు పేర్కొన్నారు. పేదలు ఇల్లు, ఉపాధి లేక, సరైన వైద్యం, విద్య అందక సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దేశ తల రాతను మార్చాలనే గొప్ప లక్ష్యంతో తమ పార్టీ పనిచేస్తున్నదన్నారు. సమావేశంలో పార్టీ నేతలు మోసం ప్రసాద్, పట్నం ప్రదీప్ కుమార్ తదితర నేతలు పాల్గొన్నారు.

## సర్ సహాయ కేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/నల్లకుంట:** ప్రజల సౌలభ్యం కోసం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్‌లో సర్ సహాయక కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ అధ్యక్షతన, పార్టీ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత గౌడ్ ఆధ్వర్యంలో శనివారం టిఆర్‌టి క్వార్టర్స్‌లో సర్ సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు విజయేంద్రసాగర్, నరేందర్, భాస్కర్‌గౌడ్, కరుణాకర్, యూసుఫ్, ఖలీమ్, సాయికిరణ్, వన్నాడి రమ్య, క్రిసోలైట్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## గుండె రిథమ్ లోపాలకు యశోద ఆసుపత్రిలో అత్యాధునిక పిఎఫ్ఎ చికిత్స

**31, 84 ఏళ్ల ఇద్దరికి విజయవంతంగా నిర్వహించిన వైద్యులు**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గుండె రిథమ్ లోపాల చికిత్సలో అత్యాధునిక పల్స్ ఫీల్ అబ్లేషన్ (పిఎఫ్ఎ) సాంకేతికతను సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో విజయవంతంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. గుండె కర్ణికల అసమాన స్పందన (ఏట్రియల్ ఫైబ్రిలేషన్)తో బాధపడుతున్న 31, 84 ఏళ్ల ఇద్దరు రోగులకు ఈ చికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేసినట్లు ఆసుపత్రి వెల్లడించింది. సీనియర్ కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజిస్ట్ డాక్టర్ ఎం.ఎస్. చంద్రమౌళి నేతృత్వంలోని వైద్య బృందం ఈ చికిత్స నిర్వహించింది. సంప్రదాయ థర్మల్ అబ్లేషన్‌తో పోలిస్తే పిఎఫ్ఎ విధానంలో గుండెలోని అసాధారణ విద్యుత్ సంకేతాలను సృష్టించే కణజాలాన్ని మాత్రమే ఖచ్చితంగా లక్ష్యంగా చేసుకోవడం వల్ల అన్నవాహిక, నరాల వంటి సమీప అవయవాలకు హాని కలిగే ప్రమాదం తక్కువగా ఉంటుందని, రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రపంచ స్థాయి వైద్య సాంకేతికతను రోగులకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు.

## ఫీజులివ్వకుంటే ఉద్యమాల సంవత్సరమే

**రూ.8వేల కోట్లు చెల్లించాలి**

**ఎంపి ఆర్.కృష్ణయ్య**



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పాత విధానంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీం అమలు చేయకపోతే, ఈ ఏడాదిని ఉద్యమాల సంవత్సరంగా మారుస్తామని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. పేద విద్యార్థులకు రూ.8వేల కోట్ల ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బిసి విద్యార్థి సంఘం కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్ , యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యామండలి ఆఫీసును ముట్టడికి యత్నించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై, మాట్లాడారు. పెండింగ్ ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నదన్నారు. ఫీజుల రీయింబర్స్‌మెంట్ అమలుకు పాత విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజులివ్వకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వటంలేదన్నారు. దీంతో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు, విదేశీ విద్య , పోటీల పరీక్షలకు దరఖాస్తు చేసుకొనే అవకాశాలు కోల్పోతున్నారన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రూ.8వేల కోట్ల ఫీజులివ్వాలని, జిఒ 9ను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో బిసి కులాల ఐక్యవేదిక అధ్యక్షులు అనంతయ్య, సిద్ధు, తదితర బిసి సంఘాల నేతలు పాల్గొన్నారు.

## సైబరాబాద్‌లో 114 టన్నుల గ్రీన్ వ్యర్థాల తొలగింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా ప్రత్యేక గ్రీన్ వ్యర్థాల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లలో మొత్తం 31 ప్రాంతాల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో 38 లోడ్ల ద్వారా సుమారు 114 టన్నుల గ్రీన్ వ్యర్థాలను తొలగించారు. చెట్ల కత్తిరింపు అనంతరం ఏర్పడే వ్యర్థాలను వెంటనే తొలగించాలని టిజిఎస్‌పిడిసిఎల్‌తో పాటు సంబంధిత సంస్థలను కమిషనర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా వ్యర్థాలను తొలగించని పక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వర్షాకాలంలో రహదారులు పరిశుభ్రంగా ఉండేలా, డ్రెయిన్లు మూసుకుపోకుండా ఈ ప్రత్యేక డ్రైవ్ను కొనసాగించనున్నట్లు తెలిపారు.

**'వాక్ ఫ్రీ' డ్రైవ్‌లో 697 ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు**



**హైదరాబాద్ :** పాదచారులకు ఆక్రమణల రహిత ఫుట్‌పాత్‌లు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) 'వాక్ ఫ్రీ' ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లలో 17 రహదారి విభాగాల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో 32.35 కిలోమీటర్ల మేర ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తం చేసి మొత్తం 697 ఆక్రమణలను తొలగించారు. టౌన్ ప్లానింగ్, పోలీసు శాఖల సమన్వయంతో ఈ డ్రైవ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. నగరవ్యాప్తంగా దశలవారీగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించి పాదచారులకు సురక్షిత ఫుట్‌పాత్‌లు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

## విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/అంబర్‌పేట్:** విద్యా రంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని, పిఆర్సి, డీఏ బకాయిలను పూర్తిగా చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టిపియుఎస్) హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేష్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సభ్యులు అంబర్‌పేట్ మండలం డిప్యూటీ తహశీల్దార్ బల్‌రామ్‌ను శనివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టిపియూఎస్ అంబర్‌పేట్ మండల అధ్యక్షురాలు సి.స్వర్ణలత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి , ఎస్జీటీ కార్తీక్, రేణుక, స్కూల్ అసిస్టెంట్లు రాజశేఖర్, రజిత, రామ సీత, సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య మాదిరాజు సాహితీ సదస్సు



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** శతాధిక పుస్తకాల రచయిత ఆచార్య మాదిరాజు రంగారావు సాహితీ సదస్సు శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరాటంకంగా కొనసాగిన సాహితీ సదస్సుకు తెలుగు వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్యఅతిథిగా విచ్చేయగా.. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్వ సలహాదారులు డాక్టర్ కె.వి రమణాచారి సభాధ్యక్షత వహించారు. డాక్టర్ అయాచితం శ్రీధర్, డాక్టర్ జి.నరసింహమూర్తి, డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, డాక్టర్ నాగేశ్వరం, శంకరం, నెల్లుట్ల రమాదేవి, ఆచార్య త్రివేణి.. తదితరులు మాదిరాజు సాహిత్యంపై సమగ్రంగా విశ్లేషించారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు, డాక్టర్ మాదిరాజు సంతోష్ కుమార్, దేవులపల్లి హరిత, మాదిరాజు చరిత సదస్సును సమన్వయం చేశారు. ఈ సందర్భంగా మాదిరాజు సమగ్ర సాహిత్యాన్ని తొమ్మిది సంపుటాలుగా ప్రచురించి ఆవిష్కరించారు.

## చిన్నారి వైద్య సేవలకు విరాళం



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి దయనీయ పరిస్థితికి చలించిన సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తక్షణ సాయంగా తన వ్యక్తిగత విరాళాన్ని అందించడంతో పాటు తన వంతు సంపూర్ణ సహకారాన్ని అందించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. రామంతాపూర్ ప్రాంతానికి చెందిన భేరి రమేష్ కుమార్తె చైత్రికకు అత్యంత అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ అనే వ్యాధికి ఏకంగా రూ.10 కోట్లతో ఇంజక్షన్ తీసుకోవాలని ప్రముఖ వైద్యులు తేల్చి చెప్పారు. శోకంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను సంప్రదంచగా రూ.లక్ష చెక్కును అందించారు. అదే విధంగా తన సన్నిహితుడైన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ ఫార్మా సంస్థ విబ్సన్ యజమాని సుంకు రామచందర్‌ను సంప్రదించి ఆయన ద్వారా మరో లక్ష విరాళాన్ని అందించారు. అదే విధంగా చిన్నారి వైద్య ఖర్చుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సహకరించాలని కోరుతు ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, ప్రధాన మంత్రి నరేంద్రమోడి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి లకు పద్మరావు గౌడ్ లేఖలు పంపారు. తమ చిన్నారి ఇబ్బందిని గుర్తించి తన వంతు సహకరించిన శాసనసభ్యులు పద్మారావు గౌడ్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

## వాటర్ పోలో జట్టుకు యూనిఫాం అందజేత

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర సీనియర్ వాటర్ పోలో జట్టు 79వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్నట్టు తెలంగాణ సీనియర్ నేషనల్ వాటర్ పోలో టీమ్, స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పి.చంద్ర శేఖర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి జి. ఉమేశ్ తెలిపారు. ఈ నెల 7 నుంచి 12 వరకు చెన్నై కట్స్ కుళత్తూర్ డాక్టర్ టి.పారివేందర్ ఆక్వాటిక్ కాంప్లెక్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా వారు వాటర్ పోలో జట్టుకు, మేనేజర్ అండ్ కోచ్‌లకు గచ్చిబౌలి ఆక్వాటిక్ స్టేడియంలో యూనిఫాం, టీ షర్ట్స్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ ఎండి ఎల్.ఎం.శంకర్, టీం మేనేజర్ టి.కిరణ్ కుమార్, ఐ. బాల మల్లేశ్వర్, కోచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి జయంతి వేడుక



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** మన్నెం వీరుడు, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు మధురానగర్‌లో శనివారం ఘనంగా జరిగాయి. మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో కాలనీలోని సాగి రామకృష్ణంరాజు భవనంలో జరిగిన ఈ వేడుకల్లో ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలిండియా క్షత్రియ ఫెడరేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ సామంతపూడి బాలకృష్ణంరాజు, సంక్షేమ సమితి అధ్యక్షుడు ఎన్వీ మనోహర్ రావు, కోశాధికారి కె.సుగుణ, ప్రధాన కార్యదర్శి కోడే సాంబశివరావు, ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, సంయుక్త కార్యదర్శి సి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో జాప్యం వద్దు



**ప్రజాపక్షం/బేగంపేట్:** అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని.. జాప్యం చేయరాదని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన బేగంపేట్ డివిజన్‌లోని ఓల్డ్ ఎయిర్ పోర్ట్ సమీపంలో భగవంతాపూర్ రోడ్డులో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహేశ్వరి, వాటర్‌వర్క్స్ జిఎం సునీల్, మేనేజర్ ఇందిర, ఎఇ వరుణ్ దేవ్, బిఆర్ఎస్ నాయకులు శ్రీహరి, నరేందర్, శేఖర్, ఆరీఫ్, శ్యామ్, ప్రవీణ్, అడ్డు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ రెన్నోవేషన్ పనులు



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని విధాల వసతులతో కూడిన మోడ్రన్ కమిటీ హాల్ త్వరగానే అందుబాటులో వస్తుందని గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఎ.పావని అన్నారు. శనివారం డివిజన్‌లోని కమిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టిన నిర్మాణ పనులను ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బిజెపి నాయకులు శ్రీకాంత్, ఎం.ఉమేష్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## టీ స్టాళ్లపై పోలీసుల దాడులు

**భారీగా సిగరెట్లు స్వాధీనం**



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** నిబంధనలు ఉల్లంఘించి టీస్టాళ్లలో విక్రయిస్తున్న సిగరెట్లను మధురానగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం సీఐ హెచ్.ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

## 50 మంది బంగ్లాదేశీయుల తరలింపు



**సేలం :** సరైన పత్రాలు లేకుండా భారత్‌లో నివసిస్తున్న బంగ్లాదేశీయులను ఆ దేశానికి పంపించే ప్రక్రియ కొనసాగుతోంది. అందులో భాగంగా 50 మంది బంగ్లాదేశ్ పౌరులను బహిష్కరించి, రైలు ద్వారా పశ్చిమ బెంగాల్‌కు తరలించినట్లు పోలీసులు శనివారం తెలిపారు. 44 మంది పురుషులు, ఆరుగురు మహిళలతో కూడిన ఈ బృందాన్ని ఇంతకుముందు సేలం జిల్లాలోని ఆత్తూరు తాలూకా కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ప్రత్యేక నిర్బంధ కేంద్రంలో ఉంచారు. అధికారిక బహిష్కరణ ఆదేశాల మేరకు, ఈనెల 3న కట్టుదిట్టమైన భద్రత మధ్య మూడు వ్యాన్లలో వీరిని తిరుచిరాపల్లికి తరలించారు. అక్కడికి చేరుకున్న తర్వాత, వీరిని హౌరా ఎక్స్‌ప్రెస్‌లోని ఒక ప్రత్యేక బోగీని ఎక్కించారు. సేలం ఆర్మ్‌డ్ రిజర్వ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి) శక్తివేల్ నేతృత్వంలోని 40 మంది సాయుధ పోలీసుల బృందం వీరి రైలు ప్రయాణంలో భద్రత కల్పిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లోని హరిదాస్పూర్ సరిహద్దు వద్ద తమిళనాడు పోలీసులు ఈ పౌరులను అధికారికంగా సరిహద్దు భద్రతా దళానికి (బిఎస్‌ఎఫ్) అప్పగిస్తారని అధికారులు తెలిపారు. ఆ తర్వాత, బంగ్లాదేశ్ అధికారులకు వారిని అప్పగించే ప్రక్రియను బిఎస్‌ఎఫ్ చేపడుతుంది. సరైన పత్రాలు లేని వలసదారుల కదలికలను తాత్కాలికంగా నియంత్రించడానికి ఏర్పాటు చేసిన ఆత్తూరు ప్రత్యేక శిబిరంలో ప్రస్తుతం 130 మందికి పైగా విదేశీ పౌరులు ఉన్నారు. వీరిలో కొందరి కేసులు పెండింగ్‌లో ఉండగా, మరికొందరు బెయిల్‌పై బయట ఉన్నారు.

## ముంబయిని ముంచెత్తిన భారీ వర్షాలు

### పాఠశాలలు, కాలేజీలకు సెలవు
### రోడ్డు, రైలు రవాణాకు తీవ్ర అంతరాయం

**ముంబయి :** ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు దేశ ఆర్థిక రాజధాని ముంబయిని ముంచెత్తాయి. ముంబయితో పాటు దాని పరిసర ప్రాంతాల్లోనూ వరదలు పోటెత్తాయి. జన జీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. రోడ్లు కుంగిపోవడం, చెట్లు, ఇళ్లు కూలిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకోవడంతో పాటు రోడ్డు, రైలు రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. నిరంతర వర్షపాతం, భారత వాతావరణ శాఖ (ఐఎండి) జారీ చేసిన అత్యంత భారీ వర్ష సూచన దృష్ట్యా, మధ్యాహ్న సమయంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. అంధేరి, కుర్లా, సాకినాకా, చెంబూర్, శాంతాక్రజ్, గోరేగావ్, పోవాయ్ వంటి నగరంలోని అనేక లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. దీనివల్ల ప్రజా రవాణా సేవలకు అంతరాయం కలగడమే కాకుండా, సొంత వాహనాలు వాడే వారికి కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా వెస్ట్రన్ రైల్వే మార్గంలోని నలసోపార, విరార్ స్టేషన్ల మధ్య పట్టాలపై నీరు నిలిచిపోవడంతో రైలు సేవలకు ఆటంకం కలిగింది. ఈ మార్గంలో రైళ్లు నిర్ణీత సమయం కంటే 15 నుండి 20 నిమిషాలు ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే యంత్రాంగం పేర్కొనగా, రైలు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. ప్రధాన మార్గం, హార్బర్ లైన్ వంటి ఇతర మార్గాల్లో కూడా రైలు రాకపోకలకు అంతరాయం కలిగింది. సోమవారం వరకు భారీ వర్షాలు, తుఫానులు సంభవించే అవకాశం ఉన్నందున, ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), పుణె–నాసిక్ ప్రాంతాల ప్రజలు అధికారిక వాతావరణ సూచనలను కచ్చితంగా పాటించాలని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కోరారు. రుతుపవనాలు ఆలస్యంగా వచ్చినప్పటికీ, ఈ వారం ప్రారంభం నుండి దేశ ఆర్థిక రాజధానిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం 8 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో నగరంలోని పలు ప్రాంతాల్లో 100 మి. మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని మున్సిపల్ అధికారులు తెలిపారు.



బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) అందించిన వివరాల ప్రకారం, పశ్చిమ శివారు ప్రాంతాల్లో బాంద్రా (H వెస్ట్ వార్డ్ ఆఫీస్) వద్ద అత్యధికంగా 150.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాతి స్థానాల్లో సుపారీ ట్యాంక్, బాంద్రా (146 మి.మీ), పాలీ చింబై, బాంద్రా (143.2 మి.మీ) ఉన్నాయి. ద్వీప నగర ప్రాంతంలో పరేల్ 141.8 మి.మీ వర్షపాతాన్ని నమోదు చేయగా, తర్వాతి స్థానాల్లో మటుంగా–దాదర్ (135.2 మి.మీ), ఫోర్ట్ (120.8 మి.మీ), వడాలా (118.3 మి.మీ), లోయర్ పరేల్ (118 మి.మీ) ఉన్నాయి. తూర్పు శివారు ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. విఖ్రోలిలో 143 మి.మీ, ఘాట్‌కోపర్‌లో 136.4 మి.మీ, మన్‌ఖుర్ద్‌లో 134.2 మి.మీ, చెంబూర్‌లో 127.6 మి.మీ, మన్‌ఖుర్ద్‌లోని మహారాష్ట్ర నగర్‌లో 124 మి.మీ వర్షపాతం నమోదైంది. గత 24 గంటల్లో ద్వీప నగరంలో సగటున 99 మి.మీ, తూర్పు శివారు ప్రాంతాల్లో 98 మి.మీ, పశ్చిమ శివారు ప్రాంతాల్లో 94 మి.మీ వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల మధ్య నగరంలో సగటున 28 మి.మీ వర్షపాతం నమోదు కాగా, తూర్పు శివారు ప్రాంతాల్లో 96 మి.మీ, పశ్చిమ శివారు ప్రాంతాల్లో 83 మి.మీ వర్షం కురిసింది. భారీ వర్షాలు, సముద్రపు పోటు కారణంగా అనేక ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. నిలిచిన నీటిని తొలగించడానికి పౌర యంత్రాంగం (బిఎంసి) బృందాలను రంగంలోకి దించినట్లు అధికారులు తెలిపారు. అంధేరి సబ్‌వేలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అలాగే సాకినాకా, చండివాలి, విలే పార్లే ప్రాంతాల్లో రోడ్లు నీట మునగడంతో వాహనాల కదలికలకు అంతరాయం కలిగింది. ముందస్తు జాగ్రత్త చర్యగా, చెంబూర్, అంధేరి, విఖ్రోలిలోని కొన్ని ప్రాంతాలతో సహా నీరు నిలిచిన అనేక రోడ్లను పోలీసులు మూసివేశారు. ప్రభావిత ప్రాంతాలకు వెళ్లవద్దని వాహనదారులకు సూచించినట్లు బిఎంసి తెలిపింది. నగరం అంతటా 64 చోట్ల చెట్లు కూలిపోయినట్లు సమాచారం అందిందని మున్సిపల్ యంత్రాంగం పేర్కొంది. ఇళ్లు లేదా గోడలు కూలిపోయిన ఎనిమిది సంఘటనలు కూడా నమోదయ్యాయి. బైకుల్లాలోని బనేవాడిలో జరిగిన ఒక ఘటనలో రెండు అంతస్తుల భవనం కూలిపోవడంతో ఇద్దరు పురుషులు, ఒక మహిళ గాయపడ్డారు. వారిని జె.జె. ఆసుపత్రిలో చేర్చారు, ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉంది. విక్రోలి వద్ద పట్టాలపై నీరు నిలవడం, దృశ్యమానత తక్కువగా ఉండటం వల్ల సెంట్రల్ రైల్వే మార్గాల్లో రైలు సర్వీసులు ఆలస్యం అవుతున్నాయని అధికారులు తెలిపారు. నీరు నిలవడంతో బృహన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్ట్ (బెస్ట్) సంస్థ ఆరు మార్గాల్లో బస్సులను దారి మళ్లించింది. వీటిలో ఐదు పశ్చిమ శివారు ప్రాంతాల్లో, ఒకటి తూర్పు శివారు ప్రాంతంలో ఉన్నాయి. అతి భారీ వర్షాలపై ఐఎండి రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో, ముంబయి నగరవ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మధ్యాహ్న సెషన్‌కు శనివారం సెలవు ప్రకటించింది. పగటిపూట అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తూ ఐఎండి ముంబయికి రెడ్ అలర్ట్ జారీ చేసింది.

## మా డిమాండ్‌కు కట్టుబడి ఉన్నాం

### కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనేత పదవిపై సిపిఐ



**తిరువనంతపురం :** కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష ఉప నాయకుడు పదవి కోసం తమ పార్టీ చేస్తున్న డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామని సిపిఐ ఎమ్మెల్యే కె. రాజన్ శనివారం తెలిపారు. సిపిఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)లో రెండవ అతిపెద్ద భాగస్వామ్య పక్షమైన సిపిఐ, ఇటీవలి ఎన్నికల తర్వాత కొత్త అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి ఈ పదవి కోసం పట్టుబడుతూ వస్తోంది. ఈ విషయంలో పార్టీ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని రాజన్ స్పష్టం చేశారు. 'ఈ పదవి కోసం నా పేరు చర్చకు రావడం మీరు విని ఉండకపోవచ్చు. కానీ పార్టీ మాత్రం ఆ పదవి కోసం డిమాండ్ చేసింది. పార్టీ కార్యదర్శి మా వైఖరిని స్పష్టం చేశారు, మేము ఆ వైఖరికే కట్టుబడి ఉన్నాము' అని రాజన్ అన్నారు. కూటమి ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఎల్‌డిఎఫ్ సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో జాప్యం గురించి అడిగినప్పుడు, సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఎల్‌డిఎఫ్ కన్వీనర్ బాధ్యత అని రాజన్ చెప్పారు. భాగస్వామ్య పక్షాలతో చర్చల తర్వాత జూన్ మధ్యలో ఎల్‌డిఎఫ్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాలతో సహా ఇతర కార్యక్రమాలు ఉండి ఉండవచ్చు, ఈ జాప్యానికి గల కారణాలను ఎల్‌డిఎఫ్ కన్వీనర్ వివరిస్తారని అన్నారు.

**సిపిఐకి ప్రతిపక్ష ఉపనేత పదవి గతం : విజయన్**

కాగా మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రస్తుతం కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. కన్నూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఐ డిమాండ్‌పై అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ ఆయన విజయన్ ఆ విషయం గతం అని అన్నారు. దాని గురించి ఇప్పుడు ఆలోచించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సిపిఐ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందని, తాను కూడా ఆ విషయంపై తన అభిప్రాయాన్ని చెప్పానని విజయన్ తెలిపారు. ఎల్‌డిఎఫ్‌లో విభేదాలు ఉన్నాయన్న ఊహాగానాలను తోసిపుచ్చుతూ, ఆ విషయం కూటమి చర్చించాల్సిన అంశం కాదని ఆయన అన్నారు. ఇది ఎల్‌డిఎఫ్ సమస్య కాదు. కూటమిలో చర్చించాల్సిన విషయం కూడా కాదు, ఇలాంటి విషయాలను మేము ఇంతకు ముందెన్నడూ ఎల్‌డిఎఫ్‌లో చర్చించలేదు అని విజయన్ పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడి ఎంపిక గురించి ప్రస్తావిస్తూ ఎల్‌డిఎఫ్ దీర్ఘకాలంగా వస్తున్న సంప్రదాయాన్ని అనుసరిస్తుందని విజయన్ తెలిపారు. ప్రతిపక్ష నాయకుడి నియామకంపై ఎల్‌డిఎఫ్‌లో చర్చ జరిగిందా? ఇక్కడ కూడా అదే వర్తిస్తుంది అని ఆయన అన్నారు.

కూటమి ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఎల్‌డిఎఫ్ సమావేశాన్ని ఏర్పాటు చేయడంలో జాప్యంపై స్పందిస్తూ, ఎల్‌డిఎఫ్ కన్వీనర్ చికిత్స పొందుతుండటం వల్ల ఆలస్యం జరిగిందని, ఆయన ఇప్పుడు కోలుకున్నారని విజయన్ తెలిపారు.

## టిఎంసి బెంగాల్ చీఫ్ చంద్రిమ రాజీనామా



**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు దెబ్బమీద దెబ్బలు తగులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పార్టీలో కీలకమైన సంస్థాగత బాధ్యతలు అప్పగించిన నెల రోజులకే, తృణమూల్ కాంగ్రెస్‌లోని మమతా బెనర్జీ వర్గానికి మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న చంద్రిమ భట్టాచార్య శనివారం తన పదవికి రాజీనామా చేశారు. పార్టీలో తాను నిర్వహిస్తున్న ఇతర పదవుల బాధ్యతల నుంచి కూడా తప్పుకుంటున్నట్లు పార్టీ చైర్‌పర్సన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీంతో మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ వర్గంతో ఆమె సంబంధాలను పూర్తిగా తెంచుకున్నారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి. జూన్ 3న మమతా బెనర్జీ నివాసం (కాళీఘాట్)లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో, సీనియర్ నాయకుడు సుబ్రతా బక్షి స్థానంలో చంద్రిమ భట్టాచార్యను రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించారు. అంతేకాకుండా, వివిధ బ్యాంకుల్లో ఉన్న టిఎంసి, దాని అనుబంధ సంస్థల ఖాతాలకు సంబంధించి అధికారిక సంతకం చేసే వ్యక్తిగా, అలాగే ఎన్నికల సంఘం వద్ద పార్టీ వ్యవహారాలను చూసుకునేందుకు మమతా బెనర్జీ తరపున అధికారిక ప్రతినిధిగా ఉన్న బాధ్యతల నుంచి కూడా ఆమె తప్పుకున్నారు. గతంలో మమతా బెనర్జీ ప్రభుత్వంలో ఆర్థిక, ఆరోగ్య శాఖల వంటి కీలక విభాగాలకు సహాయ మంత్రిగా పనిచేసిన భట్టాచార్య, పార్టీ మహిళా విభాగానికి నాయకత్వం వహించారు. ఆమె టిఎంసి అధినేత్రికి అత్యంత సన్నిహితురాలిగా, దీర్ఘకాలిక సహచరిగా ఉంటూ వచ్చారు. రాజీనామా ప్రకటన అనంతరం విలేకరులతో మాట్లాడిన భట్టాచార్య, కోల్‌కతాలోని పార్టీ ప్రధాన కార్యాలయం 'తృణమూల్ భవన్' కార్యకలాపాలపై రీటాబ్రత బెనర్జీ నేతృత్వంలోని రెబెల్ వర్గం పట్టు సాధించేలా అనుమతించారని మమతా బెనర్జీ ఫోన్ ద్వారా మందలించడమే తన నిర్ణయానికి కారణమని స్పష్టం చేశారు. శుక్రవారం నాడు రీటాబ్రత నేతృత్వంలోని రెబెల్ వర్గం తృణమూల్ భవన్‌లోకి ప్రవేశించినప్పుడు భట్టాచార్య తన కార్యాలయంలోనే ఉన్నారు, కానీ కాసేపటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెబెల్ వర్గం నాయకులు అక్కడే సమావేశం నిర్వహించి, ప్రధాన ద్వారం తాళాలు మార్చేశారు. ఇకపై అక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తామని ప్రకటించారు. తాను పార్టీ ప్రధాన కార్యాయలం తాళాలు అసమ్మతి వర్గానికి అప్పగించానని మమతా బెనర్జీ నాకు ఫోన్ చేసి చెప్పినప్పుడు తీవ్రంగా బాధపడ్డానని, నా పట్ల ఉన్న నమ్మకం, విశ్వసనీయత అనేవి పునాదుల నుంచే దెబ్బతిన్నాయని దీనిని బట్టి స్పష్టమవుతోందన్నారు. ఆ ప్రాథమిక అనుబంధాలు లేదా నమ్మకాలు పోయాక, పార్టీలో కొనసాగడానికి గానీ లేదా తిరిగి రావడానికి గానీ నాకు ఎటువంటి కారణం కనిపించడం లేదు అని భట్టాచార్య విలేకరులతో అన్నారు. తిరుగుబాటు వర్గంలో చేరుతారా అని అడిగినప్పుడు, భట్టాచార్య స్పందిస్తూ 'జీవితంలో దీనికంటే ముఖ్యమైన విషయాలు చాలా ఉన్నాయి. నా తదుపరి కార్యాచరణ ఏమిటనేది ఇంకా నిర్ణయించుకోలేదన్నారు.

## ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌లో ఓటు, సీటు, విరాళాల చోరీ

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ :** బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో 'ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వం' పేరుతో పాలన సాగుతున్నప్పటికీ, వాస్తవానికి 'ఓటు, సీటు, విరాళాల చోరీ' జరుగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన 'ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియపై తమకు ఉన్న ఆందోళనలను తెలియజేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ పంపినట్లు జైరాం రమేశ్ తెలిపారు. ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటోందని ఆయన వ్యాఖ్యానించారు. 'ఎస్‌ఐఆర్ ప్రక్రియకు సంబంధించి మాకు ఉన్న నిర్దిష్ట ఆందోళనలను ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాం. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడం లేదు. రాజకీయ పక్షపాతంతో పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలో ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం తీవ్రంగా క్షీణించింది. దేశంలో నేడు ఓట్ల దొంగతనం, సీట్ల దొంగతనం జరుగుతున్నాయి. ప్రజలు ఒకప్పుడు ఎన్నికల వ్యవస్థపై ఉంచిన విశ్వాసం ఇప్పుడు దెబ్బతింది. ఎన్నికల ఫలితాలు ముందే నిర్ణయిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతోంది. ఎన్నికల ఫలితాలు ముందే నిర్ణయిస్తే ఎన్నికలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటి? అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. దేశ రాజ్యాంగం, ఎన్నికల వ్యవస్థపై దాడి జరుగుతోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ అంశంపై న్యాయవ్యవస్థ జోక్యం అవసరమని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కూడా జైరాం రమేశ్ లక్ష్యంగా చేసుకుని, ఆయన తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తోందని ఆరోపించారు. బెంగాల్, బిహార్, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం వ్యవహరించిన తీరు దీనికి నిదర్శనమని అన్నారు. 'జ్ఞానేశ్ కుమార్ కపటత్వంతో వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సంఘం స్వతంత్ర రాజ్యాంగ సంస్థలా కాకుండా, కేంద్ర హోంమంత్రి, ప్రధానమంత్రి ఆదేశాల మేరకు పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది' అని జైరాం విమర్శించారు. అయోధ్యలోని రామమందిరంలోని విరాళాల వ్యవహారాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అక్కడ కూడా విరాళాల చోరీ ఆరోపణలు వస్తున్నాయని పేర్కొంటూ, 'ఇది ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వం. ఇక్కడ ఓట్ల దొంగతనం, సీట్ల దొంగతనం, విరాళాల దొంగతనం జరుగుతున్నాయి' అని ఆరోపించారు.

## రేపు రామాలయ ట్రస్ట్ సమావేశం



**అయోధ్య :** రామమందిర విరాళాల చోరీ ఘటన, తదనంతర పరిణామాల నేపథ్యంలో ట్రస్టీల రాజీనామాలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే సిట్ సమర్పించిన ప్రాథమిక నివేదికపై చర్చించేందుకు 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' సభ్యులు సోమవారం అయోధ్యలోని 'మణి రామ్‌దాస్ ఛావనీ'లో సమావేశం కానున్నారు. ఈ సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సి ఉంది. రామ మందిర వ్యవహారాలను నిర్వహించడానికి సిఇఒ నియామకంపై కూడా చర్చలు జరగనున్నట్లు సమాచారం. శనివారం అధికారులు ధృవీకరించిన ఈ సమావేశం ఐదు అంశాల అజెండాలో మొదటిది... ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాల రాజీనామాలపై చర్చ. చోరీ వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పటి నుండి ప్రత్యేక ఆహ్వానితుడు గోపాల్ రావుతో పాటు వీరు కూడా వివాదాల కేంద్రబిందువుగా నిలిచారు. ఈ ఆరోపణలపై రెండు సమాంతర దర్యాప్తులు జరుగుతున్న తరుణంలో ఈ సమావేశం జరుగుతోంది. అందులో ఒకటి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా, మరొకటి పోలీసుల ద్వారా దర్యాప్తు జరుగుతోంది. సిట్, పోలీసులు ఇద్దరూ ట్రస్ట్‌కు చెందిన ఈ ముగ్గురు సీనియర్ అధికారుల వాంగ్మూలాలను నమోదు చేశారు. అయితే, ట్రస్ట్ బాధ్యులైన ఈ ముగ్గురిపై ఇప్పటివరకు ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అయినప్పటికీ, ఫైజాబాద్ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు చంపత్ రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్ రావులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఎజెండాలోని ఇతర అంశాలలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ చేయని ఆదాయవ్యయాల నివేదిక మరియు బ్యాలెన్స్ షీట్, ఇతర ఆర్థిక వివరాలపై చర్చ మరియు వాటికి ఆమోదం తెలపడం వంటివి ఉన్నాయి. ఈ సమావేశ ఎజెండాను కోశాధికారి గోవింద్ దేవ్ గిరి జారీ చేశారు.

## ఉల్లికి కనీస మద్దతు ధర 13 శాతం పెంపు



**న్యూఢిల్లీ :** ఉల్లి రైతులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఉల్లి కనీస మద్దతు ధరను 13 శాతం మేర పెంచింది. తాజా పెంపుతో క్వింటాలు ఉల్లి ధర రూ.1,875 నుంచి రూ.2,125కు పెరిగింది. ఉల్లి సేకరణను పెంచేందుకు, రైతులకు లాభం చేకూర్చేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది . ఈ సవరించిన సేకరణ ధర శనివారం నుండే అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ ధరల స్థిరీకరణ నిల్వ కోసం నాఫెడ్, ఎన్‌సిసిఎఫ్ ద్వారా ఉల్లిపాయల సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సవరించిన ధర ఉల్లి రైతులకు మెరుగైన ఆదాయాన్ని అందించడంతో పాటు, నిల్వ సేకరణ ప్రయత్నాలకు కూడా మద్దతునిస్తుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ 2025–26 నాటి రెండవ ముందస్తు అంచనాల ప్రకారం, ఉల్లిపాయల ఉత్పత్తి 307.37 లక్షల మెట్రిక్ టన్నులుగా (ఎల్‌ఎంటి) అంచనా వేశారు. ఇది 2024–25లో నమోదైన 307.67 ఎల్‌ఎంటి ఉత్పత్తికి దాదాపు సమానంగా ఉంది. ఉత్పత్తి అంచనాలను బట్టి చూస్తే, ప్రస్తుత దశలో ఉల్లిపాయల లభ్యతకు సంబంధించి ఎటువంటి ఆందోళన లేదు. అయితే సాధారణ ధరల కాలానుగుణ ధోరణికి అనుగుణంగా ధరలు కొద్దిగా పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో ప్రస్తుత నిల్వలు సరిపడా ఉన్నాయి. ప్రస్తుతం, నిల్వ ఉంచిన ఉల్లిపాయల కొరతకు సంబంధించిన సంకేతాలేవీ లేవు కేంద్రం పేర్కొంది. దేశవ్యాప్తంగా మార్కెట్లకు (మండీలకు) రోజువారీ ఉల్లిపాయల రాక 50,000 మెట్రిక్ టన్నులకు పైగా ఉంటూ స్థిరంగా కొనసాగుతోంది. మహారాష్ట్రలో ఈ రాక 30,000 మెట్రిక్ టన్నులకు పైగా ఉండగా, సగటు మోడల్ ధర కిలోకు సుమారు రు. 18గా ఉంది.


## 23 మందిని టెర్రరిస్టులుగా ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** సీమాంతర ఉగ్రవాదంపై కేంద్రం కఠిన చర్యలు తీసుకుంటోంది. పాకిస్థాన్‌లో ఉన్న 23 మంది వ్యక్తులను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శనివారం కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం ఉపా కింద ఉగ్రవాదులుగా ప్రకటించింది. భద్రతా దళాలపై దాడులను ప్లాన్ చేయడం, సోషల్ మీడియాను ఉపయోగించి యువతకు భావజాల వ్యాప్తి చేయడం, ఉగ్రదాడులను సులభతరం చేయడానికి డ్రోన్ల ద్వారా ఆయుధాలను చేరవేయడం వంటి వాటిలో ప్రమేయం ఉన్నందుకు కేంద్రం ఈ చర్యకు పూనుకుంది. ఈ జాబితాలో మసూద్ ఇలియాస్ కశ్మీరీ, మొహమ్మద్ ముసాదిక్, ముఫ్తీ మొహమ్మద్ అస్గర్ ఖాన్, హాఫిజ్ అబ్దుల్ షకూర్, అబ్దుల్లా జిహాదీల పేర్లు ఉన్నాయి. అదే విధంగా హోం మంత్రిత్వ శాఖ జాబితాలో ఫిర్దౌస్ అహ్మద్ భట్, గులాం ఫరీద్, హరూన్ రషీద్ గనాయ్, బిలాల్ అహ్మద్ మీర్, అబిద్ ఖయూమ్ లోన్, నజీర్ అహ్మద్ గుజ్జర్, అబ్దుల్ రౌఫ్, అష్ఫాక్ అహ్మద్, హాఫీజ్ ఖలీద్ వాలిద్, మౌలానా ఇమ్దాద్ ఉల్లా మక్కీ, మౌలానా సైఫుల్లా ఖలీద్, మహ్మద్ యాకూబ్, మౌలానా యూసుఫ్ తైబీ, ఒవైస్ ఫరూజ్, ఖారీ యాకూబ్ షేక్, రానా ఇఫ్తీకర్, వసీం నూర్ జాట్, మహ్మద్ షాహిద్ ఫైసల్‌లు కూడా టెర్రరిస్టుల జాబితాలో ఉన్నారు.



## ఆపరేషన్ సిందూర్ తర్వాత... 'మేడ్-ఇన్-ఇండియా' రక్షణ వ్యవస్థలపై అమిత విశ్వాసం

### రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ తర్వాత 'మేడ్–ఇన్–ఇండియా' రక్షణ వ్యవస్థలపై విశ్వాసం పెరిగిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆయన శనివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ప్రసంగిస్తూ నేడు, మన రక్షణ ఉత్పత్తి రూ.1.78లక్షల కోట్లకు పైగా చేరుకుంది అని, ఇది దాదాపు 8–9 ఏళ్ల క్రితం గురించి మాట్లాడాల్సివస్తే సుమారు రూ. 46,000 కోట్లు మాత్రమే ఉండేదని కూడా పునరుద్ఘాటించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత నేడు మేడ్ –ఇన్–ఇండియా రక్షణ ప్లాట్‌ఫారమ్‌లపై విశ్వాసం చాలా పెరిగిందని రాజ్‌నాథ్‌సింగ్ నొక్కిచెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా 2025 మే నెలలో భారతదేశం చేపట్టిన నిర్ణయాత్మక సైనికచర్యే ఆపరేషన్ సిందూర్ అన్నారు. భారతదేశంలో నిర్మించిన అనేక రక్షణ వేదికలు ఇందులో కీలక పాత్ర పోషించాయన్నారు. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ రక్షణ రంగ ఎగుమతులు రూ. 38,000 కోట్లకు పైగా చేరుకున్నాయన్నారు. 2013–14లో అవి రూ.686 కోట్లు ఉండగా, నేడు ఆ వృద్ధి 57 రెట్లు పెరిగిందన్నారు. 'నేను దీనిపై పూర్తి నివేదిక కోరలేదు. కానీ ప్రస్తుతం అవి రూ.40,000 కోట్ల వద్ద నిలిచి ఉంటాయన్నది నా అంచనా' అని తెలియజేశారు. గత 12ఏళ్లుగా వివిధ రంగాలలో భారతదేశ ప్రయాణాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోదాహరణంగా తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) పురోగతి, జర్నలిజం రంగంతో సహా ఎఐ యుగంలో మానవ సున్నితత్వం ప్రాముఖ్యతను గురించి వివరించారు. జాతీయ హిందీ దినపత్రిక 'నవభారత్ టైమ్స్' 80ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఢిల్లీలో జరిగింది.'గత 12ఏళ్లుగా భారతదేశ ప్రయాణం ఒక ప్రగతి కొరతల నుంచి స్వావలంభనవైపు, స్వావలంభన నుంచి ఆత్మవిశ్వాసానికి, ఆత్మవిశ్వాసం నుంచి వికసిత్ భారత్ నిర్మాణం వైపు సాగింది' అని రాజ్‌నాథ్‌సింగ్ వివరించారు.

## మణిపూర్ బిజెపి ఎమ్మెల్యే అంత్యక్రియలకు ముందు... సిఎం పర్యటనను నిరసిస్తూ కుకీల బంద్, నిరసన

### కుకీ–జో మెజారిటీ జిల్లాలో బహిష్కరించిన ఆరు కుకీ సంస్థలు



**చురాచంద్‌పూర్ :** మణిపూర్‌లో కుకీల నిరసన జ్వాల రగులుతోంది. మణిపూర్ బిజెపి ఎమ్మెల్యే వుంగ్‌జాగిన్ వాల్టే అంత్యక్రియలకు ముందు, ముఖ్యమంత్రి వై.ఖేమ్‌చంద్ సింగ్ పర్యటనను నిరసిస్తూ శనివారం ఉదయం వందలాది కుకీలు చురాచంద్‌పూర్ జిల్లాలోని వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రంలో రాజుకుంటున్న జాతి సంఘర్షణకు ఒక శాశ్వత పరిష్కారం కోరుతూ కుకీ–జో మెజారిటీ జిల్లాలో ఖేమ్ చంద్ సింగ్ పర్యటనను దాదాపు ఆరు కుకీ సంస్థలు బహిష్కరించాయి. ఒక సాయుధ బృందం ఇచ్చిన బంద్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో మార్కెట్లు మూతపడ్డాయి. వాహనాలు రోడ్లపైకి రాలేదు. ఇంఫాల్ నుండి చిరాచంద్‌పూర్ వెళ్లే మార్గాన్ని దిగ్బంధించడానికి కప్రాంగ్ ప్రాంతం సమీపంలోని టెడిమ్ రోడ్ల వద్ద డజన్ల కొద్ది నిరసనకారులు కూడా గుమిగూడారు. శుక్రవారం రాత్రి సుమారు 11గంటలకు బిష్ణుపూర్ లోయ జిల్లా సరిహద్దులో ఉన్న చురాచంద్‌పూర్ జిల్లాలోని జలెంగ్‌పై ప్రాంతం సమీపంలో సాయుధులు గాలిలోకి పలుమార్లు కాల్పులు జరిపారు. కుకీ సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్, కుకీ ఇన్‌పి చురాచంద్‌పూర్, కుకీ ఉమెన్ యూనియన్ సహా కుకీ సంస్థలు ఒక ప్రకటనలో ఇలా పేర్కొన్నాయి. కొనసాగుతున్న కుకీ–జో–మెయిటీ సంఘర్షణకు పరిష్కారం లభించేంతవరకూ మా జిల్లాలో ఏ మెయిటీ వ్యక్తినీ, అధికారులను లేదా సమూహాన్ని అనుమతించబోమని, చురాచంద్‌పూర్ కెసిఎస్‌ఓలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో కన్నుమూసిన మాజీ బిజెపి ఎమ్మెల్యే ఉంగ్ జాగిన్ వాల్టే అంత్యక్రియలకు సింగ్ హాజరైన నేపథ్యంలో నిరసనలు, బంద్ జరిగాయి. థాన్లాన్ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎన్నికైన వాల్టే అంతయక్రియలను చురాచంద్‌పూర్ జిల్లాలోని డోర్కాస్ వెంగ్ గ్రామంలోని స్మశాన వాటికలో సుమారు మధ్యాహ్నం ఒంటిగంటన్నరకు నిర్వహిస్తారని శుక్రవారం జోమి కౌన్సిల్ విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపింది. జోమీ కమ్యూనిటీకి చెందిన 61ఏళ్ల బిజెపి నాయకుడి మృతదేహాన్ని ఫిబ్రవరిలో ఢిల్లీ నుంచి తీసుకువచ్చినప్పటి నుంచి చురాచంద్‌పూర్ జిల్లా ఆసుపత్రిలోనే ఉంచారు. ఇంఫాల్‌లోని నాగమపాల్ ప్రాంతంలో జాతి హింస చెలరేగినప్పుడు అక్కడ జరిగిన మూక దాడిలో తీవ్రంగా గాయపడిన వాల్టే కోలుకుంటున్నాడు. అయితే 2023మే లో మెడికల్ ట్రీట్‌మెంట్ కోసం ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే.రెండేళ్ల చికిత్స తర్వాత వాల్టే గత ఏడాది ఏప్రిల్‌లో తన భార్యతో సహా చురాచంద్‌పూర్‌కు వచ్చారు. ఫిబ్రవరి 20న గుర్‌గావ్ లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఆయన మరణించారు.

# గాజాపై వెయ్యిరోజుల యుద్ధంలో 21,500 మంది పాలస్తీనా పిల్లలు మృతి



గాజా:గాజాపై ఇజ్రాయెల్ చేసిన 1000 రోజుల యుద్ధంలో 21,500 మంది పిల్లలు ఇప్పటివరకూ మరణించారని గాజాలోని ప్రభుత్వ మీడియా కార్యాలయం శనివారం విడుదల చేసిన గణాంకాలు తెలియజేశాయి. ఈ దాడుల్లో 10,500 మంది పిల్లలు గాయపడ్డారు. 1000 మంది పిల్లలు అవయవాలను తొలగించారు. అప్పుడే పుట్టిన 520 మంది పసికందులు మరణించారని, మరో 1,022 మంది ఏడాది లోపు పిల్లలు కూడా మరణించారని నివేదిక పేర్కొంది. వేలాదిమంది పిల్లలు పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. గాజాలో ఇజ్రాయెల యుద్ధానికి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ నివేదిక విడుదల చేశారు. గాజాలో పిల్లలు దాడులు,హత్యలు,స్థానభ్రంశం,ఆకలి వంటి అనేక దారుణాలకు గురవుతున్నారని పేర్కొంది. ఇదిలా ఉండగా, ఐక్యరాజ్యసమితి బాలల నిధి (యూనిసెఫ్) జూన్ 26న విడుదల చేసిన నివేదికలో, గత ఏడాది అక్టోబరులో ప్రకటించిన కాల్పుల విరమణ ఒప్పందం పాలస్తీనా పిల్లలకు గాజాలో ఒక ప్రాణాంతకంగా,క్రూరమైన వర్గంగా, కేవలం ఒక భ్రమగా మిగిలిపోయిందని పేర్కొంది. ఇప్పటికీ గాజాకు సరైన ఆహారం,వైద్య సదుపాయాలు లభించడంలేదని పేర్కొంది. గత ఏడాది కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం రోజుకు 600 లారీలలో సహాయ సామాగ్రి,ఆహారం గాజాకు వెళ్ళాల్సి ఉండగా దీనిని ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటున్నది.

### ఎఎఫ్‌డి ఫాసిజానికి వ్యతిరేకంగా వేలాదిమంది నిరసన ప్రదర్శనలు

# వామపక్షాలు,కార్మిక సంఘాలు రహదారుల ముట్టడి



ఎర్ఫర్ట్:జర్మనీలోని పచ్చిమితవాద ఎఎఫ్‌డి పార్టీ (ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ) వార్షిక సమావేశం సందర్భంగా ఆ పార్టీని వ్యతిరేకించే కార్మిక సంఘాలు,వామపక్షాలు,పౌర సమాజ గ్రూపులు వేలాది మంది వీధుల్లోకి వచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దేశంలో కఠినమైన వలస వ్యతిరేక విధానాలు అమలు చేయాలని ఎఎఫ్‌డి పార్టీ కోరుకుంటున్నది. ఈ పార్టీ జాత్యాహంకార విధానాలను, ప్రజాస్వామ్య విరుద్ధమైన విధానాలు,సంప్రదాయాలను దేశంలో ప్రోత్సహిస్తోందని వామపక్షాలు,కార్మిక సంఘాలు తీవ్రంగా విమర్శిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. జర్మనీలో ఫాసిజం పెరుగుదలను ఎట్టిపరిస్థితుల్లో సహించబోమని ఎఎఫ్‌డి వ్యతిరేక వైడర్ సెట్జెన్ (ప్రతిఘటించండి) ప్రతినిధి జార్జ్ బెకెర్ చెప్పారు. ఈ 'వైడర్ సెట్జెన్' ఛత్రఛాయలోనే అన్ని సంఘాలు ఏకమై ఈ నిరసన చేపట్టాయి. సమావేశానికి వెళ్ళే మార్గాలన్నింటినీ వేలాదిమంది ప్రజలు దిగ్బంధనం చేసి నిరసన ప్రదర్శనలు చేశారు. కీలక ఎన్నికలకు ముందుగా, నాయకులు,ఇతరులు పార్టీ రెండు రోజుల పాటు జరిగే వార్షిక సమావేశానికి వెళ్ళే ముందుగా ప్రజలు వారి పార్టీ కార్యాలయానికి వెళ్ళే రహదారులను ముట్టడించారు. వివిధ మార్గాలలో బైఠాయించారు. ఎఎఫ్‌డి పార్టీ దేశంలో ప్రజాస్వామ్య వ్యతిరేక,రాజ్యాంగ వ్యతిరేక విలువలను,సంప్రదాయ విలువలను ప్రోత్సహిస్తోందని నినాదాలు చేశారు. ఎఎఫ్‌డి విధానాలు దేశ రాజ్యాంగానికి తీవ్ర ప్రమాదకరమని, వీటిని విడనాడాలని వామపక్షాలు,కార్మిక సంఘాలు,పౌర గ్రూపులు నినాదాలు చేశాయి. ప్లకార్డులు ప్రదర్శించాయి. సంకీర్ణ ప్రభుత్వాలలో పాలుపంచుకోకూడదని, పార్టీని ఏకాకిగా ఉంచేందుకు ఫైర్‌వాల్ వ్యూహాన్ని ఎఎఫ్‌డి ముందుకు తీసుకురావడాన్ని ప్రదర్శకులు వ్యతిరేకించారు. ఈ ఫైర్‌వాల్ వ్యూహానికి ఎలాంటి సహకారం అందించకూడదని ఎఎఫ్‌డి వ్యతిరేక ప్రధాన స్రవంతి పార్టీలు,గ్రూపులు నిర్ణయించాయి. ఐతే జర్మనీ ప్రజాస్వామ్య పునాదులను ఎఎఫ్‌డి పార్టీ వ్యతిరేకిస్తోందన్న ఆరోపణలను ఆ పార్టీ నాయకులు ఖండించారు. వేలాది మంది వీధుల్లోకి రావడంతో జర్మనీ వ్యాప్తంగా ఉన్న పోలీసులలో ఎక్కువ భాగం శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం ఈ ప్రాంతాలకు చేరుకున్నారు. ఎఎఫ్‌డి పార్టీ ప్రస్తుత జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ నాయకత్వానగల కన్జర్వేటివ్‌పార్టీపై ప్రజాభిప్రాయ సేకరణలో స్పష్టమైన ఆధిక్యతను సంపాదించింది. అనేది జర్మనీలో 2013 ప్రాంతంలో ఏర్పడిన పచ్చిమితవాద,సంప్రదాయవాద, వోల్కిష్ జాతీయవాదపార్టీ. జర్మనీ దిగువసభ బుందేస్టాగ్‌లో ఎఎఫ్‌డి పార్టీకి 151 మంది ప్రతినిధులు ఉండగా, యూరోపియన్ పార్లమెంటులో 15 మంది ప్రతినిధులు ఉన్నారు. వలసలను,ముఖ్యంగా ముస్లింలను ఎఎఫ్‌డి వ్యతిరేకిస్తోంది. దేశ తూర్పు ప్రాంతంలో జరిగే ఎన్నికలపై ఎఎఫ్‌డిపార్టీ కన్నువేసింది. స్థానిక ఎన్నికలలో గెలిచి రాష్ట్రస్థాయిలో అధికారాన్ని చేపట్టగల శక్తి సామర్థ్యాలు ఈ జనాకర్షక పార్టీకి ఉన్నాయి. ఇటీవలి పోలింగ్‌లో మెర్జ్‌కు చెందిన సిడియు–సిఎస్‌యు పార్టీలకు 22 శాతం ప్రజా మద్దతు లభించగా, ఎఎఫ్‌డి పార్టీకి 29 శాతం ప్రజా మద్దతు లభించింది.ఈ ఏడాది ఆరంభంలో పశ్చిమ జర్మనీలో జరిగిన స్థానిక ఎన్నికల్లో కూడా ఎఎఫ్‌డిపార్టీ గణనీయమైన విజయాలు సాధించింది. 2025 ఎన్నికల తర్వాత ఎఎఫ్‌డి బుందేస్టాగ్‌లో రెండవ అతిపెద్ద పార్టీగా,దేశంలో అతిపెద్ద ప్రతిపక్షంగా అవతరించింది. తూర్పు జర్మనీలో ఉన్న సంప్రదాయవాద కమ్యూనిస్టు కార్యకర్తలు,కమ్యూనిస్టు జీవనశైలి అనుసరించే ప్రజలు ఎఎఫ్‌డి విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# 2,645కు పెరిగిన వెనెజులా మృతులు

### భారత ఫీల్డ్ ఆసుపత్రి సందర్శించిన మంత్రి

కారకస్:వెనెజులాలో భూకంప మృతుల సంఖ్య 2,645కు పెరిగింది. ఇంకా 50,000 మంది జాడ తెలియకుండా ఉందని అమెరికా సర్వే సంస్థ మరోసారి తాజా ప్రకటన చేసింది. మరోవైపు విపరీతమైన వేడిగాలులు సహాయ బృందాలకు ఆటంకంగా మారాయి. ప్రజల నుండి కూడా వ్యవస్థ యలో ప్రభుత్వ వ్యతిరేకత వస్తోంది. దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌పై రోజు రోజుకూ ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. 58,000 వేల భవంతులు లా గువేరా రాష్ట్రంలో కుప్పకూలిపోయాయి. వేలాది కుటుంబాలు వీధినపడ్డాయి. వారు తమ ప్రియతమ ఆత్మీయులను కోల్పోయారు. వారంతా వీధుల్లో, రోడ్లు డివైడర్ల మధ్య కాపురాలు పెట్టారు. సరైన పరిశుభ్రత లేదు. కనీస సదుపాయాలు ప్రజలకు లేవు. దీంతో వ్యాధులు పెరుగుతోంది. ఇదిలా ఉండగా వెనెజులాలో భారత ప్రభుత్వం కూడా సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అనేకమంది సజీవులను శిథిలాల నుండి భారత సైనిక బృందం వెలికితీసింది. అక్కడ మొబైల్ ఆసుపత్రి ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో వెనెజులా విదేశాంగమంత్రి వైవాన్ గిల్ కారకస్‌లో భారత్ ఏర్పాటు చేసిన ఫీల్డ్ ఆసుపత్రిని సందర్శించారు. భారత్ అందిస్తున్న సహాయం,సహాయ కార్యక్రమాలపట్ల సంతోషం వ్యక్తం చేశారు. కృతజ్ఞతలు తెలియజేశారు.

# అమెరికా–ఇజ్రాయెల్‌కు మరణదండన

*ప్రతీకారం...ప్రతీకారం...*
*గుండెలు బాదుకుంటూ లక్షలాదిమంది నినాదాలు*
*ఖమేనీసహా ప్రముఖుల పార్థివదేహాలకు ప్రజానివాళి*
*స్తంభించిన టెహ్రాన్ నగరం,దేశవ్యాప్తంగా తరలివచ్చిన ప్రజలు*



టెహ్రాన్:అమెరికా–ఇజ్రాయెల్ దేశాలకు మరణ దండన విధించాలని, వారిపై ప్రతీకారం తీర్చుకోవాలని టెహ్రాన్‌లో లక్షలమంది ప్రజలు నినాదాలు చేశారు.అమెరికా దాడుల్లో హత్యకు గురైన ఇరాన్ నాయకుడు అయితొల్లా అలీ ఖమేనీ,ఆయనభార్య,కుమార్తె,అల్లుడు,మనుమరాలుసహా అనేకమంది జనరల్స్,కమాండోలు,ఇతర ప్రముఖులు కూడా మరణించారు. వారి పార్థివ దేహాలను టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసెల్లా హాలులో ఉంచారు. ప్రతీకారం...ప్రతీకారం...ప్రతీకారం..అనే నినాదాలు సర్వత్రా టెహ్రాన్‌లో మారుమోగిపోయాయి. అంతరూ బ్యానర్లు,జెండాలు చేతబూనారు. కన్నీళ్ళపర్యంతమవుతున్నారు.టెహ్రాన్ నగరం అంతటా ఖమేనీ చిత్రాలు,హోర్డింగులతో నిండిపోయింది. షియా మతంలో సర్వసాధారణమైన అంత్యక్రియల ఆచారం ప్రకారం పురుషులు వరుసలో నిలబడి లయబద్ధంగా గుండెలు బాదుకుంటూ విలపిస్తారు. ''ఇమామ్ ఖమేనీ మా తండ్రి,మా సర్వస్వం,మా హృదయం'' అని ఒక మహిళ మసూమే మొహమ్మదీ గుండెలు బాదుకుంటూ విలపించారు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తర్వాత ఆ దేశం రెండవసారి ఒక సర్వోన్నత నాయకుణ్ణి కోల్పోయింది. లక్షలమంది ప్రజలపై అనేకమంది ఒకవైపు చల్లని నీరు జల్లుతున్నారు. బయట స్టాండ్స్‌లో ప్రజలకు ఆహారం,పానీయాలు అందిస్తున్నారు.మెటల్ డిటెక్టర్ల తనిఖీల తర్వాత గ్రాండ్ మసీదులో వేరువేరుగా స్త్రీలు,పురుషులు ప్రార్థనలు నిర్వహించారు. భారీసంఖ్యలో సాయుధ పోలీసులు పరిసర ప్రాంతాలలో రైఫిళ్ళతో పహారాకాస్తున్నారు. నగరం మొత్తాన్ని మూసివేశారు. ఖమేనీ అంత్యక్రియలు మినహా అన్ని కార్యకలాపాలు స్తంభించాయి. దేశవ్యాప్తంగా ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలివచ్చారు. దీనికి రెండు రోజులముందు దేశ ప్రజలందరూ ఈ అంత్యక్రియల్లో పాల్గొనాల్సిందిగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ పిలుపు ఇచ్చారు.మనదేశాన్ని,మతాన్ని రక్షించుకోవడం కోసమే మేం ఇక్కడికి తరలివచ్చాం అని టెహ్రాన్‌కు 530 కి.మీ దూరంలో ఉన్న తబ్రిజ్ నుండి వచ్చిన పెద్ద బృందం తరపున అలీ కజెమీ చెప్పారు. శత్రువులకు వ్యతిరేకంగా ఇది ఇస్లామిక్ రిపబ్లిక్ చేసిన శక్తిప్రదర్శనగా కొందరు అభివర్ణించారు. ప్రజలకు వారి పార్థివ దేహాలవద్ద గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నారు. నివాళులు అర్పిస్తున్నారు.అమెరికా,ఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలు చేస్తున్నారు. ఆదివారం నుండి రెండు రోజులపాటు దేశంలోని కీలక పుణ్యక్షేత్రాల ద్వారా ఖమేనీ పార్థివదేహాన్ని ఊరేగిస్తారు. ఈ అంతిమ యాత్ర తర్వాత ఆయన స్వగ్రామంలో రాబోయే గురువారం నాడు ఖనన ప్రక్రియ పూర్తిచేస్తారు.ఖమేనీ మృతదేహాన్ని గాజుపెట్టెలో భద్రపరచి ఇరాన్ జాతీయ జెండాను ఆ పట్టెపై కప్పారు. లక్షలమంది ప్రజలు ఆయన పార్థివ దేహాన్ని సందర్శిస్తున్నారు. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి సాధనకు వీలుగా అమెరికాతో ఒకవైపు చర్చలు,హోర్ముజ్ జలసంధిపై తన పట్టు నిలబెట్టుకుని పూర్తి ఆధిపత్యం కొనసాగించాలన్న ప్రయత్నాలు,మరోసారి ఇజ్రాయెల్ దాడులు చేస్తుందన్న ఆందోళన మధ్య ఖమేనీ అంత్యక్రియల ప్రక్రియ దేశ ప్రజలకు, మాతృభూమిపై మమకారాన్ని, శత్రువుపై వ్యతిరేకతను పెంచే ఒక స్ఫూర్తిదాయకమైన కార్యక్రమంగా నిలిచింది. గ్రాండ్ మొసల్లాలో ఖమేనీ కూర్చునే సింహాసనంపై ఆయన చిత్రపటాన్ని ఉంచారు. ఈ అంతిమయాత్ర మంగళవారంనాడు మతపెద్దల కేంద్రమైన ఖోమ్‌కు వెళుతుంది. బుధవారంనాడు ఇరాక్‌లోని పవిత్రపుణ్యక్షేత్ర నగరాల మీదుగా అంతిమయాత్ర కొనసాగి,గురువారంనాటికి ఖమేనీ జన్మస్థలం మషద్‌కు చేరుకుంటుంది. అక్కడే చిట్టచివరిగా ఖమేనీ అంత్యక్రియలు పూర్తిచేస్తారు.

# ఖమేనీ భవిష్యత్ తరాలకు స్ఫూర్తి

### పాకిస్థాన్ ప్రధానమంత్రి షరీఫ్ నివాళి



టెహ్రాన్:హత్యకు గురైన ఇరాన్ సర్వోన్నత నాయకుడు అలీ ఖమేనీని ఒక జ్ఞానిగా పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అభివర్ణించారు. టెహ్రాన్‌లో ఖమేనీ పార్థివదేహం వద్ద ఆయన నివాళులు అర్పించారు. ఆ తర్వాత శనివారం ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, ఖమేనీ ప్రగాఢమైన ఆలోచనలు భవిష్యత్ తరాలకు ఒక వారసత్వంగా,ఒక స్ఫూర్తిగా నిలిచిపోతాయని ఆయన కొనియాడారు.ఈ దుఃఖసమయంలో ఇరాన్‌కు పాకిస్థాన్ అండగా నిలబడుతుందని పేర్కొన్నారు. శుక్రవారంనాడు ఆయనతోపాటు ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్, సర్వసేనాధిపతి ఆసిఫ్ మునీర్‌సహా ఉన్నతస్థాయీ ప్రతినిధిబృందం ఇరాన్ వెళ్ళి ఖమేనీ పార్థివ దేహంవద్ద నివాళులు అర్పించిందని తెలియజేశారు. ఖమేనీ నాయకత్వం,ఆయన ప్రభావం తరతరాలు నిలిచిపోతుందని పేర్కొన్నారు.అదేవిధంగా టెహ్రాన్‌లో పాకిస్థాన్ నాయకులతో శుక్రవారం ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బఖేర్ ఘాలిబాఫ్ సమావేశమయ్యారు. క్లిష్టసమయాల్లో ఇరాన్‌కు అండదండలు అందించినందుకు కృతజ్ఞతలు,అభినందనలు తెలియజేశారు. పాకిస్థాన్ పార్లమెంటు సెనేట్ ఛైర్మన్ యూసుఫ్ రజా గిలానీతో ఆయన సమావేశం జరిపారు.

# ప్రపంచ వేదికపై తెలంగాణ ప్రతిష్ఠను చాటుతున్న ప్రవాస తెలంగాణవారికి..

**అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు: సిఎం రేవంత్ రెడ్డి**

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణకు చెందిన వైద్యులు, ఇంజినీర్లు, ఐటీ నిపుణులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పారిశ్రామికవేత్తలు తమ ప్రతిభ, కృషి, అంకితభావంతో అమెరికా అభివృద్ధిలో విశేష పాత్ర పోషిస్తూ రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అక్కడి ప్రజలకు, ప్రవాస భారతీయులకు, ముఖ్యంగా అమెరికాలో నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ ముఖ్యమంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ స్థాయిలో తమ ప్రతిభను చాటుతూ తెలంగాణ పేరును ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న ప్రతి తెలుగు బిడ్డ అభినందనీయుడని సిఎం అన్నారు. అమెరికాలోని తెలంగాణ సమాజం వృత్తిపరమైన విజయాలతో పాటు భారత్‌అమెరికా మధ్య సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే వారధిగా నిలుస్తోందని తెలిపారు. అలాగే తెలుగు భాష, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తూ రాష్ట్ర ఆత్మను ప్రపంచవ్యాప్తంగా చాటుతోందని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాస తెలంగాణవారితో సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్ర అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని ఎల్లప్పుడూ స్వాగతిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం రెండు దేశాల మధ్య స్నేహం, శాంతి, సమృద్ధి, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎటిఎ సదస్సుకు ఆహ్వానం



ప్రజాపక్షం/హైదరాబాద్: అమెరికా తెలుగు అసోసియేషన్ (ఎటిఎ) నిర్వహిస్తున్న 19వ ద్వైవార్షిక మహాసభలకు కరీంనగర్ జిల్లా ప్రవాస తెలుగు సంఘాల ప్రతినిధులు, ప్రముఖులకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఎటిఎ జిపి శ్యాంప్రసాద్ లాల్, కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పాసునూరి రవీందర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.అమెరికాలోని మేరీల్యాండ్‌లో జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు జరిగే ఈ మహాసభల్లో తెలుగు సంస్కృతి, సాహిత్యం, వ్యాపారం, పెట్టుబడులు, విద్య, వైద్యం, సామాజిక సేవ తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు, సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహాసభల్లో తెలంగాణతో పాటు కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# నేటి మహావృక్షం

**(మొదటి పేజీ తరువాయి)**

తీసుకెళ్లిందని వివరించారు.

**మిడ్జిల్ అభివృద్ధి చెందిన మండలంగా మారాలి**

మహబూనగర్ జిల్లాలోని పలు మండలాల్లో 2006లో డార్క్ మండలాలుగా ఉండేవన్న సిఎం, తన రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత తనపై ఉందని తెలిపారు. మిడ్జిల్ మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని వెల్లడించారు. మిడ్జిల్ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కని కోరుతున్నానని పేర్కొన్నారు. ఒకప్పుడు డార్క్ మండలమైన మిడ్జిల్ అభివృద్ధి చెందిన మండలంగా మారాలని పిలుపునిచ్చారు. తాను ఏనాడూ పదవి, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదని, వందేళ్లుగా కులగణన జరగలేదన్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టి దేశానికే దిక్సూచిగా నిలిచామని చెప్పారు. దొర దురహంకారాన్ని మరోసారి బొందపెట్టాల్సిన అవసరం ఉందని సిఎం స్పష్టం చేశారు. 'తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ అన్నను దొర గడీ ముందు గంటల కొద్దీ నిలబెట్టారు. రాష్ట్రంలో పదేళ్లపాటు పేదలకు సొంతింటి కల నెరవేరలేదు. ఈ ప్రభుత్వం గ్రామగ్రామాన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదల కలను సాకారం చేస్తోంది. రూ.70వేల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి దిగజార్చారు. కేసీఆర్ ఏ గ్రామంలోనైనా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారా? మూడెకరాల భూమి ఇచ్చారా? కోటి ఎకరాలకు నీరు ఇచ్చారా?ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఇసుక దోపిడీకి అడ్డువచ్చిన నేరెళ్ల దళితులను లారీలతో తొక్కించారు. పదేళ్లు తన కుటుంబానికి, బంధువులకు తప్ప.. ఎవరికైనా ఉద్యోగాలు, పదవులు వచ్చాయా? కెసిఆర్ కుటుంబం దోపిడీలు, దొంగతనాలు మళ్లీ మొదలు కావడానికి ప్రజాపాలన పోవాలా? కెసిఆర్‌కు గజ్వేల్‌లో వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఎలా వచ్చింది? కెటిఆర్, కవిత, హరీశ్‌రావుకు రూ.వేల కోట్ల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎక్కడి నుంచి వచ్చాయి?' అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.




అంతకుముందు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు జిల్లా పట్ల ముఖ్యమంత్రికి ప్రత్యేకమైన అభిమానం ఉందని పాలమూరు జిల్లాలో పుట్టి పెరిగినందుకు రుణం తీర్చుకునేందుకు ఆయన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తారని వివరించారు. వల్లూరు ఉదండపూర్ భూ నిర్వాసితులకు అండగా ఉండాలని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. పాలన అంటే కేవలం నలుగురు అధికారులను కూర్చోబెట్టుకుని వారు చెప్పిన సమాచారంతో ఫైళ్లపై సంతకాలు చేయడం కాదు. సామాన్య రైతు కష్టాలను నిరుపేదల ఆకలి బాధలను స్వయంగా అనుభవించిన నాయకుడు కాబట్టే, రేవంత్‌రెడ్డి చేస్తున్నది నిజమైన ప్రజాపాలన అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. అధికారులు రాసిచ్చిన నివేదికలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను స్వయంగా చూసి, వాటిని పరిష్కరించే నాయకుడిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని సంక్షేమ బాటలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు సన్నబియ్యంతో కడుపునిండా భోజనం చేయాలనేది సిఎం రేవంత్‌రెడ్డి సంకల్పం. గొప్ప వాళ్లే తినే సన్నబియ్యం పేదవాడికి ఎందుకు అందకూడదనే ఆయన ఆలోచన, సామాన్యుడిని గౌరవించే పాలనకు నిదర్శనమని భట్టి పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 27 లక్షలు మంది విద్యార్థులు అర్ధాకలితో బడికి వెళ్లకూడదని వారికి పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం, గ్లాసు పాలు, గుడ్లు అందించాలనే నిర్ణయం వెనుక. ఆకలి బాధను స్వయంగా తెలిసిన నాయకుడి గొప్ప మనసు ఉందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆంజనేయస్వామిని దర్శించుకున్న రేవంత్ రెడ్డి**

ముందుగా ఊర్కొండ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మిడ్జిల్, ఊర్కొండకు చెందిన నేతలు కలిశారు. మహబూబ్‌నగర్ జిల్లా నేతలు రేవంత్‌రెడ్డిని సన్మానించారు. తన రాజకీయ అనుచరులను ఆత్మీయంగా పలకరించిన సిఎం ఊర్కొండలో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఊర్కొండలో ఆంజనేయస్వామి ఆలయంలో సిఎం ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ఆలయాన్ని దర్శించుకున్నారు. సిఎం, మంత్రులకు పూజారులు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు. రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనుచరులు, నేతలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

**సిఎం రేవంత్‌రెడ్డికి మంత్రులు శుభాకాంక్షలు**

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా, రాజకీయ నాయకుడిగా 20 ఏళ్ల విజయవంతమైన రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ చారిత్రాత్మక మైలురాయిని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రముఖులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సి.దామోదర రాజనరసింహ, ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, తదితరులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎన్నో ఒడుదొడుకులను తట్టుకుని, ప్రజల పక్షాన నిలిచి నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన రేవంత్ రెడ్డి ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రులు ప్రశంసించారు.

**'లక్షల అక్షరాలతో రాసినా.. కోట్ల పదాలను కూర్చి చెప్పినా... తరగని మధుర జ్ఞాపకం'**

''లక్షల అక్షరాలతో రాసినా.. కోట్ల పదాలను కూర్చి చెప్పినా... తరగని మధుర జ్ఞాపకం ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక భావోద్వేగ పూరితమైన పోస్ట్ చేశారు. 'లక్షల అక్షరాలతో రాసినా.. కోట్ల పదాలను కూర్చి చెప్పినా... తరగని మధుర జ్ఞాపకం ఈ రెండు దశాబ్దాల ప్రజా జీవితం. నాడు మిడ్జిల్‌లో రేవంత్ రెడ్డిగా మొదలై.. నేడు మీ అందరి గుండెల్లో 'రేవంతన్న'గా నిలిచే వరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం నా జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయం. ఇదే స్ఫూర్తితో, ప్రజలకు మరింత సేవ చేయాలన్న ఆర్తితో, మీ అందరి ఆశీర్వాద బలంతో, భవిష్యత్తులో తెలంగాణ పునర్ నిర్మాణ శ్రామికుడిగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సేవకుడిగా మీ హృదయాల్లో నా స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటానని మాట ఇస్తున్నాను' అని ''జడ్‌పిటిసి టూ సిఎం '' అనే హ్యాష్ ట్యాగ్‌తో సిఎం పేర్కొన్నారు.

# విజృంభిస్తోంది

**(మొదటి పేజీ తరువాయి)**

డెమోక్రటిక్‌పార్టీని అతివాద కమ్యూనిస్టులుగా ముద్ర వేసేందుకు రిపబ్లికన్లు చేస్తున్న ప్రయత్నాలు ముమ్మరం చేసిన దశలో ట్రంప్ చేసిన రాజకీయ దాడి ఆ పార్టీ మితవాద ఆలోచనలను ప్రతిబింబించింది. కమ్యూనిస్టు ముప్పు అమెరికా జీవన విధానానికి వ్యతిరేకమైనదిగా చెప్పేందుకు ఆయన ప్రయత్నించారు. గతంలో ఎన్నికల సమయంలో కూడా ఆయన కమ్యూనిస్టులపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆయన ప్రసంగంలో దేశభక్తి ఉప్పొంగి పరవళ్ళు తొక్కింది. గతకాలపు గొప్ప అధ్యక్షులపై ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. అమెరికా విశిష్టతను వివరించారు. అమెరికాకు గొప్ప వైభవం, విశిష్టత ఉన్నాయని, కానీ ఈ విశిష్ట వైభవాన్ని చెడగొట్టేందుకు, చెరిపేసేందుకు, అమెరికా స్ఫూర్తిని, ''అమెరికా ఐడెంటిటీ''ని లేకుండా చేసేందుకు, మన చరిత్ర నుండి మనల్ని దూరం చేయడానికి ఇటీవలి సంవత్సరాల్లో పెద్ద ప్రయత్నం జరిగిందని అన్నారు. ''మీరు ఇక్కడ పుట్టకపోయినాగానీ, మనం నిర్మించిన దానిని మన వ్యవస్థను ప్రేమించాలి'' అన్నారు. డెమోక్రటిక్‌పార్టీలో ఉన్న ప్రగతిశీల వామపక్ష విభాగం రాబోయే నవంబరు ఎన్నికల సన్నాహంగా ప్రైమరీ ఎన్నికల్లో భారీ విజయాలు సాధించిన నేపథ్యంలో ట్రంప్ కమ్యూనిస్టులపై తీవ్రస్థాయిలో విమర్శల దాడి చేశారు. ప్రైమరీ ఎన్నికల్లో వామపక్ష భావజాలంగలమమ్దానీ సమర్థించిన నలుగురు అభ్యర్థులు ఇటీవల ఘన విజయాలు సాధించారు. స్వయంగా ట్రంప్ సమర్థించిన రిపబ్లికన్ అభ్యర్థులు వారి చేతుల్లో పరాజయం పొందారు. ఈ సందర్భంగా ట్రంప్ ప్రసంగం తర్వాత మౌంట్ రష్మోర్ ఆకాశంలో మిరుమిట్లు గొలిపే ఆకాశంలో కళాత్మకతను వెదజల్లిన బాణసంచా పేలుళ్ళ విన్యాసాలు జరిగాయి.వాషింగ్టన్ డిసిలో ఏటా బాణసంచా విన్యాసాలు ఒక ప్రత్యేక ఆకర్షణ. నిర్వాహకులు చెప్పిన సమాచారం ప్రకారం ఈఏడాది మాత్రం ప్రత్యేకంగా వాషింగ్టన్ వ్యాప్తంగా పోటోమాక్ నదిపై ఉన్న ఎనిమిది బార్జ్‌లు సహా 10 ప్రాంతాల నుండి 8.50 లక్షల బాణసంచాల విన్యాసాలు 45 నిమిషాలసేపు కొనసాగుతాయి. దీనికి ఒక ప్రపంచరికార్డుగా నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# క్షీణిస్తున్న సోనమ్ ఆరోగ్యం

**(మొదటి పేజీ తరువాయి)**

దీప్కే చెప్పారు. 'ధర్మేంద్ర ప్రధాన్ వెనక్కి వెళ్ళండి' అనే శీర్షికతో, 'ఎగ్జామ్ పేపర్' అని రాసి ఉన్న కాగితాలను తినడానికి ప్రయత్నిస్తున్న ఒక వ్యక్తిని ఇద్దరు బొద్దింకలు అడ్డుకుంటున్నట్లుగా ఉన్న ఒక వ్యంగ్య కార్టూన్‌ను కూడా దిప్కే షేర్ చేశారు.

**సిజెపి నిరసన ప్రదర్శనకు ఎస్‌కెఎం మద్దతు**

కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలో జరుగుతున్న ధర్నాకు మద్దతు ప్రకటించింది. ఆదివారం జంతర్ మంతర్ వద్ద జరిగే ఆందోళనలో తమ ప్రతినిధి బృందం పాల్గొంటుందని తెలిపింది. ప్రస్తుతం రద్దు చేయబడిన కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020–21లో నిరసనలకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకత్వం వహించిన విషయం తెలిసిందే. కాగా, శనివారం ఎస్‌కెఎం సిజెపి వ్యవస్థాపకుడు దీప్కేకు లేఖ రాసింది. ఈ శాంతియుత ప్రజాస్వామ్య నిరసనకు, అందులో పాల్గొంటున్న విద్యార్థులు, యువత, వారి కుటుంబాలకు తాము సంపూర్ణ సంఘీభావం తెలుపుతున్నామని పేర్కొంది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ పలువురు విద్యార్థులతో కలిసి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులకు, వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌కు మద్దతుగా తమ ప్రతినిధి బృందం ఆదివారం ఉదయం 11 గంటలకు నిరసన ప్రదేశాన్ని సందర్శిస్తుందని ఆ రైతు సంఘం తెలిపింది.మోదీ ప్రభుత్వపు దీర్ఘకాలిక ప్రశ్నపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో అవకతవకలుగా తాము అభివర్ణించిన వాటి వల్ల ప్రభావితమైన విద్యార్థులకు, కుటుంబాలకు సంయుక్త కిసాన్ మోర్చా తన ప్రగాఢ సానుభూతిని కూడా వ్యక్తం చేసింది. 'ప్రతి విద్యార్థికి పారదర్శకమైన, నిష్పక్షపాతమైన, విశ్వసనీయమైన విద్యా, పరీక్షా వ్యవస్థను పొందే హక్కు ఉంది. ఈ విషయంలో జవాబుదారీతనాన్ని నిర్ధారించడం ప్రభుత్వ బాధ్యత' అని ఆ లేఖలో పేర్కొంది. ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో విద్యారంగంలో నెలకొన్న కుంభకోణాల సంస్కృతిని వ్యతిరేకిస్తూ జరుగుతున్న విద్యార్థి ఉద్యమానికి మద్దతు తెలుపుతూ తమ జాతీయ మండలి జూన్ 17న ఒక తీర్మానాన్ని ఆమోదించినట్లు ఆ రైతు సంఘం తెలిపింది. సిజెపి సోషల్ మీడియా ఖాతాలపై నిషేధాన్ని తాము గతంలోనే ఖండించినట్లు కూడా అది పేర్కొంది. తమ ప్రతినిధి బృందం ఆదివారం పర్యటన ప్రజాస్వామ్య ఉద్యమాన్ని బలోపేతం చేస్తుందని, అర్థవంతమైన చర్చలు జరిపేలా ప్రభుత్వాన్ని ఒత్తిడి చేస్తుందని, అలాగే 'విద్యాశాఖ మంత్రి రాజీనామాతో ప్రారంభించి అవసరమైన చర్యలు' తీసుకునేలా చేస్తుందని ఆశిస్తున్నట్లు ఎస్‌కెఎం తెలిపింది. ఇదిలా ఉండగా ఇప్పటికే సిజెపి నిరసనలు, సోనమ్ నిరాహారీదక్షకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, సిపిఐ(ఎం) నాయకురాలు బృందా కరత్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్, సిపిఐ నాయకురాలు అన్నీ రాజా, పారదర్శకత కార్యకర్త అంజలి భరద్వాజ్, ఆర్‌టిఐ కార్యకర్త నిఖిల్ డే, టిఎంసి ఎంపిలు సాగరిక ఘోష్, మహువా మోయిత్రాలతో సహా పలువురు రాజకీయ నాయకులు, పౌర సమాజ సభ్యుల నుంచి మద్దతు లభించింది.

# చితక్కొట్టిన బెథెల్..

## రెండో టీ20లో చిత్తుగా ఓడిన టీమిండియా..!



మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్ యువకెరటం జాకబ్ బెథెల్(76 నాటౌట్) చితక్కొట్టాడు. భారత బౌలర్లను బెంబేలెత్తించిన ఈ చిచ్చరపిడుగు మెరుపు అర్ధ శతకంతో ఇంగ్లాండ్ గెలిపించాడు. 191 పరుగుల ఛేదనలో అర్ష్‌దీప్ సింగ్(3—40) తొలి ఓవర్లోనే రెండు వికెట్లతో భయపెట్టినా.. బెథెల్ బెదరలేదు. హ్యారీ బ్రూక్(32), టామ్ బ్యాంటన్(39)లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అతడి తుఫాన్ ఇన్నింగ్స్ కారణంగా రెండో టీ20లో భారత జట్టు చిత్తుగా ఓడింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 1—0తో ముందంజ వేసింది. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు ఇంగ్లాండ్ పర్యటనను ఓటమితో ప్రారంభించింది. 191 పరుగుల భారీ ఛేదనలో తొలి ఓవర్లోనే అర్ష్‌దీప్ సింగ్(3—40) ఇంగ్లాండ్ ఓపెనర్లను పెవిలియన్ చేర్చారు. ఫిల్ సాల్ట్(0) తొలి బంతికే ఔటవ్వగా.. జోస బట్లర్(0) అతడిని అనుసరించాడు. ఆ తర్వాత కెప్టెన్ హ్యారీ బ్రూక్(39), జాకబ్ బెథెల్(76 నాటౌట్) బౌండరీలతో చెలరేగారు. వీరిద్దరూ 23 బంతుల్లోనే 50 రన్స్ జోడించి భయపెట్టారు. అయితే.. అక్షర్ పటేల్ బౌలింగ్‌లోలెగ్ సైడ్ ఆడబోయిన బ్రూక్ వికెట్ కీపర్ ఇషాన్ చేతికి చిక్కాడు. అంపైర్ నాటౌట్ ఇవ్వగా రివ్యూతో అతడి వికెట్ సాధించింది భారత్. 53 వద్దే మూడో వికెట్ పడినా టామ్ బ్యాటన్(39) జతగా బెథెల్ దంచాడు. వరుణ్ ఓవర్లో 6, 4 కొట్టగా 10 ఓవర్లకు ఇంగ్లండ 91 రన్స్ చేసింది. రెండో స్పెల్‌లో బంతి అందుకున్న అర్ష్‌దీప్ ఆతిథ్య జట్టుకు షాకిస్తూ బ్యాంటన్‌ను వెనక్కి పంపాడు. కానీ, బిష్ణోయ్ వేసిన 17వ ఓవర్లో రెచ్చిపోయిన బెథెల్.. మూడు సిక్సర్లు, ఫోర్‌తో 27 రన్స్ పిండుకున్నాడు. అంతే.. మ్యాచ్ ఇంగ్లండ వైపు మళ్లింది. విజయానికి 14 బంతుల్లో 12 రన్స్ అవసరమైన వేళ విల్ జాక్స్(7) ఔటైనా.. అర్చర్ అండగా లాంఛనం ముగించాడీ హిట్టర్.

### ఇషాన్, అభిషేక్ మెరవగా..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్లు శుభారంభమిచ్చారు. అభిషేక్ శర్మ(43), వైభవ్ సూర్యవంశీ(14)లు దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించి తొలి వికెట్‌కు 50 రన్స్ జోడించారు. అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన వైభవ్.. జోఫ్రా ఆర్చర్ తొలి బంతినే సిక్సర్‌గా మలిచాడు. అనంతరం టంగ్‌కు సిక్సర్ రుచి చూపాడు. కానీ, విల్ జాక్స్ ఓవర్లో ముందు కొచ్చి ఆడబోయి స్టంపౌటయ్యాడు. దాంతో, అరంగేట్రం మ్యాచ్‌లో ఔటైన తొలి భారత ఆటగాడిగా మరో రికార్డు నెలకొల్పాడు.

### అభిషేక్ శర్మ(43), ఇషాన్ కిషన్(49)

కాసేపటికే సామ్ కరన్ ఓవర్లో అభిషేక్ వెనుదిరిగాడు. ఓపెనర్లు విఫలమైనా ఇషాన్ కిషన్(49), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(37)లు వేగంగా ఆడారు. మూడో వికెట్‌కు 65 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని డాసన్ విడదీశాడు. శివం దూబే(5) నిరాశపరచగా.. చివరి ఓవర్లో తిలక్ వర్మ(24 నాటౌట్) 6, 6, 4 కొట్టాడు. దాంతో, భారత్ 7 వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసింది.

## అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన వైభవ్..

### 37 ఏళ్ల రికార్డు కనుమరుగు..!

అంతర్జాతీయ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ అడుగుపెట్టాడు. కోట్లాదిమంది ఎదురుచూపులకు ముగింపు పలుకుతూ ఎంట్రీ ఇచ్చిన ఈ చిన్నోడు వస్తూనే రికార్డులు నెలకొల్పాడు. ఇంగ్లాండ్‌తో రెండో టీ20లో డెబ్యూ క్యాప్ అందుకున్న వైభవ్ 15 ఏళ్లకే తొలి మ్యాచ్ ఆడిన భారత ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. టీమిండియా తరఫున ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా అవతరించాడు. 1989లో సచిన్ టెండూల్కర్ సాధించిన రికార్డును బద్ధలు కొట్టేశాడీ యువకెరటం. జూనియర్ స్థాయిలో శతకాలతో హోరెత్తించిన వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి వస్తూనే రికార్డుల దుమ్ము దులిపాడు. జూలై 4 శనివారం టీ20ల్లో అడుగుపెట్టిన వైభవ్ భారత్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

## ర్యాపిడ్ చెస్‌లో ప్రజ్ఞానంద హ్యాట్రిక్..

### ఐదో స్థానంలో గుకేశ్..!

క్రొయేషియా వేదికగా జరుగుతున్న గ్రాండ్ చెస్ టూర్‌లో ఆర్.ప్రజ్ఞానంద అదరగొడుతున్నాడు. ర్యాపిడ్ విభాగం చివరిరోజు మూడుకు మూడు మ్యాచుల్లో గెలుపొందిన భారత స్టార్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. ఫ్రాన్స్ ఆటగాడు అలీరెజా ఫిరౌజాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే.. వరల్డ్ ఛాంపియన్ డి.గుకేశ్. అనూహ్యంగా మూడు ఓటములతో ఐదో స్థానంలో నిలిచాడు. ప్రతిష్ఠాత్మక గ్రాండ్ చెస్ టూర్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద జోరు చూపించాడు. ర్యాపిడ్ చెస్ అంటే చాలు చెలరేగిపోయే ప్రజ్ఞానంద చివరిరోజు తనకు తిరుగులేదని చాటుతూ మూడు మ్యాచుల్లో విజయం సాధించాడు. చివరి రోజు ఇవాన్ సరిక్(క్రొయేషియా), డీక్ బొగ్డన్(రొమేనియా), నెదర్లాండ గ్రాండ్‌మాస్టర్ అనిశ్ గిరిను ఓడించి 12 పాయింట్లు కొల్లగొట్టాడు. హ్యాట్రిక్ విక్టరీలు కొట్టిన భారత స్టార్ ప్లేయర్ ఫ్రాన్స్ ఆటగాడు అలీరెజా ఫిరౌజాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానం సాధించాడు. ర్యాపిడ్ చెస్‌లో మూడుకు మూడు కోల్పోయిన డి.గుకేశ్, జర్మనీ ప్లేయర్ విన్సెంట్ కేమెర్ 10 పాయింట్లతో సంయుక్తంగా ఐదో స్థానంలో కొనసాగుతున్నారు. తదుపరి బ్లిట్జ్ విభాగంలో 18 రౌండ్లు గ్రాండ్ చెస్ టూర్ విజేతను నిర్ణయించనున్నాయి. కాబట్టి.. ఈ రౌండ్‌లో ప్రతి మ్యాచ్ కీలకం కానుంది.






## చరిత్రాత్మక గరిష్ఠాలకు చేరువగా బంగారం ధరలు



ఈ వారం దేశీయ మార్కెట్లో బంగారం ధరలు మరోసారి రికార్డు స్థాయిలకు చేరువయ్యాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1.47 లక్షల వద్ద కొనసాగింది. అంతర్జాతీయంగా భౌగోళిక ఉద్రిక్తతలు, సురక్షిత పెట్టుబడులపై పెట్టుబడిదారుల ఆసక్తి, కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు ధరలను బలపరిచాయి. అయితే వారాంతంలో లాభాల స్వీకరణ కారణంగా ధరల్లో స్వల్ప ఒడిదుడుకులు కనిపించాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అమెరికా డాలర్ బలపడితే బంగారం ధరలపై కొంత ఒత్తిడి ఉండవచ్చు. మరోవైపు, ద్రవ్యోల్బణం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితి కొనసాగితే బంగారం మళ్లీ బలపడే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. దీర్ఘకాలిక పెట్టుబడిదారులు బంగారాన్ని ఇప్పటికీ భద్రమైన పెట్టుబడిగానే పరిగణిస్తున్నారు.

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 77,055.21 పాయింట్లు. ముగింపు 77,763.91 పాయింట్లు. లాభం 708.70 పాయింట్లు (+0.92%)

**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,061.75 పాయింట్లు. ముగింపు 24,270.85 పాయింట్లు. లాభం 209.10 పాయింట్లు (+0.87%).

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)

**24 క్యారెట్లు:** రూ. 1,47,369

**22 క్యారెట్లు:** రూ. 1,34,990

**18 క్యారెట్లు:** రూ. 1,10,520.

(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).




## లాభాల్లో ముగిసిన మార్కెట్లు


భారతీయ ఈక్విటీ మార్కెట్లు ఈ వారం సానుకూల ధోరణిని కొనసాగించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 77,700 పాయింట్లకు పైగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ50.. 24,270 పాయింట్లకు పైగా ముగియడంతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది. ముఖ్యంగా ఐటి కంపెనీల తొలి త్రైమాసిక ఫలితాలపై ఆశావహ అంచనాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) కొనుగోళ్లు, అంతర్జాతీయ ముడి చమురు ధరల్లో స్థిరత్వం మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. బ్యాంకింగ్, ఫార్మా, ఆటో, ఐటీ రంగాల షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, వచ్చే వారం ప్రారంభమయ్యే కంపెనీల త్రైమాసిక ఫలితాల సీజన్ మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశంగా మారనుంది. అమెరికా వడ్డీ రేట్లపై అంచనాలు, రూపాయి మారకం విలువ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు కూడా భారత మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మొత్తంగా ఈ వారం భారత స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులకు లాభదాయకంగా ముగిసిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## భారత్—ఇజ్రాయెల్ కొత్త పెట్టుబడి ఒప్పందం

భారత్—ఇజ్రాయెల్ మధ్య కొత్త ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం శనివారం (జులై 4) నుంచి అమల్లోకి వచ్చింది. 1996లో కుదిరిన పాత ఒప్పందానికి బదులుగా ఈ కొత్త వ్యవస్థ అమలు కానుంది. తాజా ఒప్పందం ద్వారా రెండు దేశాల మధ్య పెట్టుబడులకు మెరుగైన చట్టపరమైన రక్షణ, పారదర్శకత, వివాద పరిష్కార విధానాలను కల్పించారు. రక్షణ, వ్యవసాయ సాంకేతికత, నీటి నిర్వహణ, కృత్రిమ మేధస్సు, స్టార్టప్‌లు, సెమీకండక్టర్లు వంటి రంగాల్లో పెట్టుబడులు పెరిగే అవకాశముందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. భారత పెట్టుబడిదారులకు ఇజ్రాయెల్‌లో, అలాగే ఇజ్రాయెల్ సంస్థలకు భారత్‌లో వ్యాపార విస్తరణకు ఇది కొత్త అవకాశాలను తెరవనుంది.



## తయారీ పరిశ్రమలపై సైబర్ దాడులు



భారత తయారీ రంగంలో సైబర్ భద్రత ప్రధాన ఆందోళనగా మారుతోంది. ఇటీవల రెండు ప్రధాన తయారీ యూనిట్లపై జరిగిన సైబర్ దాడులు పరిశ్రమల్లో ఉపయోగించే యంత్రాల నియంత్రణ వ్యవస్థలు కూడా హ్యాకర్ల లక్ష్యంగా మారుతున్నాయని వెల్లడించాయి. గతంలో ప్రధానంగా బ్యాంకులు, ఐటి సంస్థలపై దాడులు జరిగేవి. ఇప్పు డు ఉత్పత్తి యంత్రాలను నియంత్రించే 'ఆపరేషనల్ టెక్నాలజీ'వ్యవస్థలపై కూడా దాడులు పెరుగుతున్నాయి. దీనివల్ల ఉత్పత్తి నిలిచిపోవడం, ఆర్థిక నష్టాలు, సరఫరా గొలుసులో అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది. పరిశ్రమలు కేవలం కంప్యూటర్ నెట్‌వర్క్‌లనే కాకుండా యంత్రాల భద్రతపైనా పెట్టుబడులు పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. డిజిట ల్ తయారీ పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ భద్రత వ్యాపార సంస్థలకు అత్యంత కీలక అంశంగా మారిందని ఈ సంఘటనలు సూచిస్తున్నాయి.

## భారత ఆర్థిక వ్యవస్థకు స్టార్టప్‌ల బలం

భారత్‌లో నమోదైన 1.14 లక్షలకు పైగా స్టార్టప్‌లు ఇప్పటికే 12 లక్షలకుపైగా ఉద్యోగాలను సృష్టించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాంకేతికత, ఆరోగ్యం, వ్యవసాయం, ఫిన్‌టెక్, విద్య, క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో స్టార్టప్‌లు వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రభుత్వ 'స్టార్టప్ ఇండియా' కార్యక్రమం, పెట్టుబడుల లభ్యత, యువ పారిశ్రామికవేత్తల ఆసక్తి ఈ వృద్ధికి కారణమయ్యాయి. ప్రధాన ఆర్థిక సలహాదారులు కూడా భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో స్టార్టప్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉపాధి కల్పనతో పాటు కొత్త సాంకేతిక పరిష్కారాలు, ఎగుమతులు, గ్రామీణ ఆవిష్కరణలకు కూడా ఇవి దోహదపడుతున్నాయి. భారత ఆర్థికాభివృద్ధిలో స్టార్టప్‌లు ప్రధాన వృద్ధి ఇంజిన్‌గా మారుతున్నాయని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి


కరీంనగర్‌లో...


వరంగల్‌లో...

## కొమురయ్య ఆశయ సాధనకు నేటి యువత ఉద్యమించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** భూమికోసం,భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు కమ్యూనిస్టు దొడ్డి కొమురయ్య ఆశయ సాధన కోసం నేటి యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా శనివారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పంజాల శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు దొరల ఆగడాలను ఎదిరించలేని స్థితిలో దొడ్డి కొమురయ్య ఒక వైపు దొరల గుండాల తూటాల ఎదురు నిలిచి పేగులు బయటికి వస్తున్న ఆంధ్ర మహాసభకు జై అంటూ నేల కొరిగిన ఆయన తెగువ నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ కరీంనగర్ జిల్లాలో నేటికీ దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. కడివెండి చుట్టూ పక్కల 40 గ్రామాలలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉవ్వెత్తున చెలరేగిన సమయంలో ప్రజలను ఐక్యపరచి పోరాటాలకు సిద్ధం చేసి సబ్బండ వర్గాల స్వేచ్ఛ కోసం ప్రాణ త్యాగానికి కూడా వెనకాడని ధైర్యశాలి కొమురయ్య అని కొనియాడారు. అమరుల త్యాగాలతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రం నేటికీ సమస్యలతో సతమతమవుతుందని నీళ్లు, నిధులు, నిరుద్యోగం నేటికీ అలాగే ఉన్నాయని ప్రభుత్వాలు మారిన ప్రజల జీవన స్థితిగతులు మారడం లేదని అమరులకు ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా లేదని ప్రజా వ్యతిరేక పరిపాలనపై ఉద్యమాలకు సిద్ధం కావాలని పంజాల శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు టేకుమల్ల సమ్మయ్య,పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కటిక రెడ్డి, బుచ్చన్న యాదవ్, బీర్ల పద్మ, మచ్చ రమేష్, బూడిద సదాశివ నగర నాయకులు కసి బోసుల సంతోష్ చారి నునావత్ శ్రీనివాస్ నాయక్, భాకం అంజయ్య, అల్లెపు రాజు, కాల్వ శ్రీనివాస్ యాదవ్, రాము,సందీప్ రెడ్డి, బోయిని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### శివనగర్ తమ్మెర భవన్‌లో

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో భూ పోరాటాలు ఉధృతం చేస్తామని, ఈనెల 6న ఇంద్ర పార్క్ వద్ద వామపక్ష పార్టీలు పిలుపునిచ్చిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. శివనగర్ తమ్మెర భవన్‌లో కామ్రేడ్ దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, దామర కృష్ణ, ఎండి అక్బర్ పాషా, పరికరాల రమేష్, చిట్యాల సువర్ణ, రాచర్ల రాజేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కసుధీర్, నాయకులు శ్వేత, వెంకటాద్రి, జగదీష్ ,జన్ను, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### జనగామ పట్టణంలో

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చారిత్రాత్మకమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కమ్యూనిస్టులు ఐక్యతతోనే విజయవంతమైందని, నేడు మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కార్మిక, కర్షక పీడిత ప్రజల అణచివేతకు వ్యతిరేకంగా చీలిపోయిన కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమైన ఎర్రజెండా నాయకత్వాన పోరాడితే ప్రజలు స్వాగతిస్తారని, భారతదేశంలో కార్మిక, కర్షక రాజ్యానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని జనగామ మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అన్నారు. శనివారం జనగామ పట్టణంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, జిల్లా నాయకులు సొప్పరి సోమయ్య, మోటె శ్రీశైలం, చామకూర యాకూబ్, పుప్పాల ఐలయ్య, సుదర్శన్, పరుశరాములు, ఆకుల అచ్యుత్, కె.శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలో


జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలోని సిపిఐ కార్యాలయం సి.ప్రభాకర్ భవన్‌లో జగిత్యాల జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సి ప్రభాకర్ స్మారక గ్రంథాలయం కమిటీ అధ్యక్షులు రాస భూమయ్య, బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు చింత భూమేశ్వర్, విద్యార్థి యువజన సంఘాల నేతలు అందె వంశీ కృష్ణ, ఎండి సమీర్,ఎం.డి.గని,ఏన్నం రాదా, తదితరులు పాల్గొని వారి సేవలను కొనియాడారు.

### మోత్కూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మోత్కూరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరజీవి దొడ్డి కొమురయ్య విగ్రహానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బుష్పాక నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, మొగుళ్ల శేఖర్ రెడ్డి, మండల సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి, పుల్కరం మల్లేష్, మహిళా సంఘం నాయకులు జంపాల జయమ్మ, యానాల సంధ్యారాణి, మోత్కూరు పట్టణ సహాయ కార్యదర్శి గొలుసుల యాదగిరి, తాడూరు లక్ష్మి నరసయ్య, బిసి సంఘం మండల అధ్యక్షులు పెండెం వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి మండల అధ్యక్షులు బోడ సోమనరసయ్య, పెండం శ్రీనివాస్, ఈశ్వరయ్య, బాసోజు బిక్షం తదితరులు పాల్గొన్నారు.

### భూపాలపల్లి జిల్లా కేంద్రంలో

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, నిజాం నవాబులకు ఎదురొడ్డి పోరాడిన ధిక్కార స్వరం, దొడ్డి కొమురయ్య అని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శనివారం రావి నారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి వేడుకలు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి కుమార్ పాల్గొని ముందుగా దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, నాయకులు గోలి లావణ్య, గంప శ్రావణి, ఉల్లేరావు బన్నీ, పీక రవి, పోతుగంటి స్వప్న, సుభద్ర, శ్రీలత, మట్టి నాగమణి, గణేష్, దొగ్గల చరణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.


జనగామ పట్టణంలో...


జగిత్యాల జిల్లాలో...


భూపాలపల్లి జిల్లాలో...

# రాజకీయాల్లో నిజాయితీకి ప్రతీక రోశయ్య





జయంతి సభలో మంత్రి పొన్నం ప్రభాకర్

ఆదర్శ రాజకీయ నేత రోశయ్య : మంత్రి వివేక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయాల్లో నిజాయితీ, నిబద్ధత, విలువలకు ఎంపి మాజీ సిఎం, మాజీ గవర్నర్ కీ.శే. రోశయ్య ప్రతీక అని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏపి మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 93వ జయంతి సభ శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి తదితర ప్రజాప్రతినిధులు కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఐదు దశాబ్దాలకు పైగా సేవలందిస్తూ శాసనసభ, శాసనమండలి, ఆర్థిక శాఖ మంత్రి, ముఖ్యమంత్రి, అనంతరం తమిళనాడు గవర్నర్‌గా అనేక కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిన గొప్ప నాయకుడు రోశయ్య అని కొనియాడారు. ఆర్థిక వ్యవహారాలపై ఆయనకున్న అపారమైన పట్టు, ప్రజాధనాన్ని ఎంతో బాధ్యతగా వినియోగించాలనే దృక్పథం ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టిందన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ 'తెలంగాణ కోసం కొట్లాడండి. కానీ రెండు ప్రాంతాలకూ న్యాయం జరిగేలా ఆలోచించాలి' అని రోశయ్య చెప్పేవారని గుర్తుచేశారు. పరిపాలనలో రోశయ్య సరికొత్త ప్రమాణాలు నెలకొల్పారని, ప్రజా ప్రయోజనాలనే ప్రామాణికంగా నిర్ణయాలు తీసుకునేవారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కెఎస్‌ఆర్ ఎడ్యుకేషన్ లోగోను ఆవిష్కరించారు. ప్రముఖ ప్రవచన కర్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావును మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంఎల్‌సి విజయ్, మాజీ మంత్రి టిజి.వెంకటేష్, మాజీ ఎంపి కెవిపి.రామచంద్ర రావు, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

**కొణిజేటి రోశయ్యకు ఘన నివాళులు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ శాసనసభ మెంబర్స్ లాంజ్‌లో రోశయ్య చిత్రపటానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర శాసనమండలి కార్యదర్శి డా.వి.నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



**రోశయ్య జీవితం రాజకీయ విలువలకు ప్రతీక : మహేశ్ కుమార్ గౌడ్**

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య సందర్భంగా గాంధీ భవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి, బి.మహేష్ కుమార్ గౌడ్ రోశయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోశయ్య ప్రజా జీవితంలో నిజాయితీ, నిబద్ధత, రాజకీయ విలువలకు ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు, విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని కొణిజేటి రోశయ్యకు ఘన నివాళులర్పించారు.



శ్రీలంక కమ్యూనిస్ట్ పార్టీ ఆహ్వానం మేరకు శ్రీలంకలో పర్యటిస్తున్న సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కొలంబోలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ ఆయనకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు స్వాగతం పలికారు.

## హోంశాఖలో అధికారాల బదిలీ.. ప్రిన్సిపల్ సెక్రటరీకి కీలక బాధ్యతలు

**ప్రజాపక్షం /హైదరాబాద్:** తెలంగాణ హోంశాఖ పరిపాలనలో కీలక మార్పు చోటుచేసుకుంది. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయి కంటే దిగువ హోదాలోని పోలీస్ అధికారులు, అలాగే హోంశాఖ పరిపాలనా పరిధిలోని సమాన హోదా కలిగిన పోలీసేతర ఉద్యోగులపై విధించిన శిక్షలకు సంబంధించిన అప్పీలు, రివ్యూ, రివిజన్ పిటిషన్లు పరిష్కరించే అధికారాన్ని హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు హోం (ఓపీ) శాఖ జీ.ఓ.ఆర్‌టి. నెం.516ను జూలై 3న విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వ వ్యాపార నియమావళిలోని రూల్ 22 (a) ప్రకారం ముఖ్యమంత్రి, హోంమంత్రి ఆమోదంతో ఈ అధికారాలను హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో డీఎస్పీ కంటే దిగువ స్థాయి అధికారులపై విధించిన క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన అప్పీలు, రివ్యూ, రివిజన్ పిటిషన్ల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతం కానుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్ర గవర్నర్ పేరుతో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

# ప్రేమ, పెళ్లి పేరుతో రూ.3.5 కోట్ల టోకరా

మహిళతో పాటు కుటుంబ సభ్యులపై కేసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో ప్రేమ, పెళ్లి హామీ, నకిలీ వైద్య చికిత్సల పేరుతో ఓ వ్యాపారవేత్త నుంచి ఏకంగా రూ.3.50 కోట్లు కాజేసిన మహిళతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే వివాహిత అయి ఇద్దరు పిల్లలకు తల్లైన విషయాన్ని దాచిపెట్టి, మెదడు శస్త్రచికిత్స, అమెరికాలో వైద్యం, కుటుంబ ఆస్తుల విక్రయం పేర్లతో పలుమార్లు డబ్బులు వసూ లు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సిసిఎస్ డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్‌లో టి.క్రాంతి సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. హర్షితా సింగ్, ఆమె సోదరుడు హేమంత్ సింగ్, తల్లి మీరాబాయి (మరణించారు), కుమార్తె శార్దా, డా.శైలేందర్ సింగ్, లాజ్వంతి సింగ్‌లపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 318(4) చదవబడిన 3(5) కింద కేసు నమో దు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫిర్యాదు ప్రకారం, 2019 లో కుటుంబ వేడుకలో పరిచయమైన హర్షితా సింగ్ తనను వివాహం చేసుకుంటానని నమ్మించి ప్రేమలోకి దింపింది. అనంతరం తనకు బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టిందని, అత్యవసర చికిత్స అవసరమని చెబుతూ మొదట రూ.50 వేలతో ప్రారంభించి, తర్వాత రూ.37 లక్షల చికిత్స, అమెరికాలో ఆపరేషన్, ఇతర వైద్య ఖర్చుల పేరుతో భారీ మొత్తాలు తీసుకున్నట్లు తెలిపాడు. హర్షితా కుటుంబ సభ్యులు కూడా తమకు గౌరారం వద్ద 25 ఎకరాల భూమి, కిషన్ సింగ్ ఆస్పత్రిలో వాటా, కోట్ల రూపాయల పెట్టుబడులు ఉన్నాయని చెప్పి, ఆస్తులు అమ్మిన వెంటనే డబ్బంతా తిరిగి చెల్లిస్తామని పదేపదే హామీ ఇచ్చినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఆ నమ్మకంతో తన తల్లి స్థలాన్ని తాకట్టు పెట్టడం, బంగారం అమ్మడం, స్నేహితులు, బంధువుల వద్ద అప్పులు తీసుకోవడం, ఫ్లాట్ విక్రయం, చిట్ ఫండ ఫైనాన్స్ రుణాలు తదితర మార్గాల ద్వారా మొత్తం రూ.3.50 కోట్లు సమకూర్చి నగదు, యూపీఐ రూపంలో చెల్లించినట్లు పేర్కొన్నారు. అయితే శిర్డీ యాత్ర సందర్భంగా హర్షితా మెడ పై శస్త్రచికిత్స మచ్చలు లేకపోవడంతో అనుమానం వచ్చిందని, అనంతరం సన్‌షైన్ ఆస్పత్రిలో విచారించగా ఆమె పేరుతో ఎలాంటి చికిత్స జరగలేదని, విదేశీ న్యూరాలజిస్ట్ డా.టోనీ విట్‌వర్త్ భారత్‌కు వచ్చిన రికార్డులు కూడా లేవని తెలిసి మోసపోయినట్లు గ్రహించినట్లు ఫిర్యాదులో వివరించారు. తాను మోసాన్ని ప్రశ్నించగా మహిళతో పాటు ఆమె కుటుంబ సభ్యు లు తప్పుడు కేసుల్లో ఇరికిస్తామని, మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని, మీడియా ముందుకు వెళ్తామని బెదిరించి మరో రూ.50 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. అప్పుల భారం, ఆర్థిక ఇబ్బందులతో 2024లో ఆత్మహత్యకు కూడా ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తర్వాత కుటుంబ సభ్యుల సమక్షంలో డబ్బు తిరిగి చెల్లిస్తామని అంగీకరిస్తూ 2024 నవంబర్ 4న సంయుక్త హామీ పత్రం ఇచ్చినా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని బాధితుడు పేర్కొన్నాడు.ఈ మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, యూపీఐ చెల్లింపులు, వాట్సాప్ చాట్స్, ఆడియో రికార్డింగ్స్, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## మధ్యాహ్న భోజన పథకానికి అల్పాహార బిల్లుల విడుదల పట్ల హర్షం

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంతో పాటు అమలవుతున్న అల్పాహార పథకానికి సంబంధించిన పెండి ంగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయడంపై తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియూసి) హర్షం వ్యక్తం చేసింది. 2022 నుంచి 2025 వరకు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో అందించిన అల్పాహారానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో వంట కార్మికులు ఆందోళన చెందిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గత రెండున్నర ఏళ్లుగా ప్రభుత్వాన్ని అధికారులను కలిసి వినతిపత్రాలను, జిల్లా వ్యాప్త ఆందోళనలను చేపట్టటం జరిగిందని రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేమ్‌పావని, ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ద్వారా రూ.14.04 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేస్తూ జిఓ జారీ చేయడం స్వాగతిస్తున్నామన్నారు. ఇది కార్మికుల సుదీర్ఘ పోరాటానికి లభించిన ఫలితమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బిల్లుల విడుదలకు చొరవ చూపిన మంత్రి సీతక్కతో పాటు సంబంధిత అధికారులకు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ తరుపున వారు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల ఆత్మహత్యలతో ఆందోళన.. పరిష్కారం ఎక్కడ?

ఒత్తిడి, ఒంటరితనం, మానసిక సమస్యలు..

యువ ప్రాణాలను బలితీసుకుంటున్న నిశ్శబ్ద సంక్షోభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గచ్చిబౌలిలోని ఐఐఐటిలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న 20 ఏళ్ల విద్యార్థి అభిరూప్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మరోసారి విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ఆందోళనను రేకెత్తించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం అనారోగ్యం, కుటుంబ సమస్యలతో కొంతకాలంగా మానసిక ఒత్తిడికి గురైన అభిరూప్ హాస్టల్ భవనం ఆరో అంతస్తు నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన ఒక వ్యక్తి విషాదం మాత్రమే కాదు. విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం, భవిష్యత్తుపై భయం వంటి సమస్యలు ఎంత తీవ్రమైన స్థాయికి చేరుకున్నాయో తెలిపే హెచ్చరిక. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో కూడా ఇలాంటి ఘటనలు తరచూ చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.నిపుణుల అభిప్రాయం ప్రకారం చదువులో ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆరోగ్య ఇబ్బందులు, ఒంటరితనం, స్నేహితులతో లేదా అధ్యాపకులతో భావాలను పంచుకోలేకపోవడం వంటి అంశాలు విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడిలోకి నెట్టే అవకాశం ఉంది. ఇలాంటి సంకేతాలను కుటుంబ సభ్యులు, స్నేహితులు, అధ్యాపకులు ముందుగానే గుర్తించి స్పందిస్తే అనేక ప్రాణాలను కాపాడవచ్చు.విద్యాసంస్థలు కేవలం విద్య బోధించే కేంద్రాలుగానే కాకుండా, విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి భరోసా కల్పించే వేదికలుగా కూడా మారాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి కళాశాలలో సమర్థవంతమైన కౌన్సెలింగ్ వ్యవస్థ, గోప్యంగా సహాయం పొందే అవకాశం, అధ్యాపకులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన శిక్షణ, విద్యార్థులతో నిరంతర పరస్పర సంభాషణ ఉండాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు కూడా మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకుండా పిల్లల భావోద్వేగాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. సమస్యలు వచ్చినప్పుడు విమర్శించకుండా మాట్లాడే వాతావరణం కల్పించాలి. 'సహాయం కోరడం బలహీనత కాదు' అనే భావన విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉంది.ఒక విద్యార్థి ప్రాణం కోల్పోవడం కుటుంబానికే కాదు, సమాజానికీ తీరని లోటు. విషాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం కలిసి విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది.

**ట్రిపుల్ ఐటీలో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య**

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రిపుల్ ఐటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అనిరుధ్ (20) తాను ఉంటున్న హాస్టల్ భవంతి ఆరవ అంతస్థుపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి అతడు గచ్చిబౌలిలోని త్రిబుల్ ఐటిలో బీటెక్ కంప్యూటర్ ఆండ్ సైన్స్ ద్వితీయ సంవతసరం చదువుతున్నాడని అని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని ఉస్మానియా అసుపత్రికి తరలించామని కేసు నమోదు చేసుకొని అతని ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కార్స్24 పేరుతో రూ.1.50 కోట్ల మోసం

దంపతులపై చీటింగ్ కేసు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్స్24లో పని చేస్తున్నానంటూ తక్కువ ధరకు కార్లు కొనుగోలు చేసి అధిక లాభాలతో విక్రయిస్తానని నమ్మించి పెట్టుబడుల పేరుతో రూ.1.50 కోట్లకు పైగా వసూలు చేసి పరారైన దంపతులపై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈఓడబ్ల్యూ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట భవానీనగర్‌కు చెందిన రయీస్ అహ్మద్‌కు వాజిద్ అహ్మద్ ఖాన్ వ్యక్తిగతంగా పరిచయం ఉంది. గత ఏడాది నవంబర్‌లో కార్స్24లో పనిచేస్తున్నానని, తక్కువ ధరకు పాత కార్లు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించడం ద్వారా భారీ లాభాలు వస్తాయని, పెట్టుబడి పెడితే మంచి రాబడులు ఇస్తానని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన రయీస్ అహ్మద్ వివిధ తేదీల్లో మొత్తం రూ.58 లక్షలు వాజిద్ అహ్మద్ ఖాన్, అతని భార్య ఆర్తి కుమారికి బదిలీ చేశారు. అదే విధంగా జుబేర్, ఆమిర్, అమ్మార్, హరీఫ్ బాషా తదితరులను కూడా ఇదే విధంగా మోసం చేసి పెట్టుబడులు పెట్టించడంతో మొత్తం వసూళ్లు రూ.1.50 కోట్లకు పైగా చేరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నమ్మకం కలిగించేందుకు కార్స్24 డీలర్‌షిప్‌కు సంబంధించిన నకిలీ పత్రాలను కూడా చూపించినట్లు ఆరోపించారు. కొంతకాలం తర్వాత పెట్టుబడులు, లాభాలు తిరిగి ఇవ్వాలని కోరగా నిందితులు ఫోన్ కాల్స్, సందేశాలకు స్పందించడం మానేశారు. అనంతరం బాధితులు కార్స్24 కార్యాలయాన్ని సంప్రదించగా, వాజిద్ అహ్మద్ ఖాన్ చాలా కాలం క్రితమే సంస్థను వీడి వెళ్లిపోయాడని, ప్రస్తుతం అతనికి కంపెనీతో ఎలాంటి సంబంధం లేదని తెలిసింది. దీంతో తమను ముందే పథకం ప్రకారం మోసం చేసినట్లు బాధితులు గుర్తించారు. ప్రస్తుతం వాజిద్ అహ్మద్ ఖాన్, అతని భార్య ఆర్తి కుమారి పరారీలో ఉన్నారని, వారి ఆచూకీ తెలియడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాంకు లావాదేవీలు, వాట్సాప్ సందేశాలు, కాల్ రికార్డులు తదితర ఆధారాలను పోలీసులకు అందజేయడానికి సిద్ధంగా ఉన్నట్లు బాధితుడు తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సిసిఎస్ ఎస్ఐ జి. అనిల్ కుమార్‌కు అప్పగించారు. పరారీలో ఉన్న దంపతుల ఆచూకీతో పాటు మోసపోయిన నగదు లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది.

## ఈ శతాబ్దపు ఇంధన సంక్షోభాన్ని విజయవంతంగా దాటివచ్చాం

ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ విమర్శలు

**పచ్‌పద్ర(రాజస్థాన్):** ఈ శతాబ్దంలో ఎదురైన అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కానీ దేశంలో భయాందోళనలు సృష్టించే కొన్ని శక్తులు మాత్రం దీంతో తీవ్ర నిరాశానిస్పృహలో కూరుకుపోయాయని విమర్శించారు. ప్రతిపక్షాలపై ప్రత్యేకించి కాంగ్రెస్‌పార్టీని ఉద్దేశించి ఆయన ఈ విమర్శలు చేశారు. రాజస్థాన్ బలోత్రా ప్రాంతంలో చమురు శుద్ధి చేయడంకోసం దేశంలోనే మొట్టమొదటిసారి నిర్మించిన సమీకృత హరిత చమురు శుద్ధి–పెట్రోకెమికల్ పారిశ్రామిక సముదాయాన్ని శనివారం జాతికి అంకితం చేసిన సందర్భంగా ప్రధానమంత్రి పైవిధంగా విమర్శలు చేశారు. ఏప్రిల్–జూన్ మధ్యకాలంలో దేశంలో చమురు కంపెనీలు రూ.75,000కు పైగా నష్టాలు చవిచూశాయని, ఆ నష్టాలను ప్రభుత్వమే భరించిందని, అనేక దేశాల్లో పెట్రోలు, డీజిలు ధరలు 50 శాతం మేరకు పెరిగాయని, కానీ మనదేశంలో అలాంటి పరిస్థితి తలెత్తలేదని అన్నారు.

క్రియాశీల చర్యలద్వారా అనుసరించిన విధానాలు, బలమైన దౌత్యసంబంధాలు, విభిన్న ఇంధన వనరుల ద్వారా ఈ సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా దాటి వచ్చిందన్నారు. ''దేశంలో కొన్ని శక్తులు వదంతులు పుట్టించాయి, ప్రజల్లో భయం వ్యాప్తిచేశాయి, వారి ప్రయత్నాలు సఫలంకాలేదు'' అన్నారు. భారతదేశ ఎల్‌పిజి అవసరాలు 70 శాతం మేరకు దిగుమతుల ద్వారానే తీరుతున్నాయని, ఇందులో 90 శాతం మేరకు హోర్ముజ్ జలసంధి ద్వారా గల్ఫ్‌దేశాలే భారత్ అవసరాలు తీరుస్తున్నాయని, పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనూహ్యమైన సరఫరా సంక్షోభం తలెత్తిందని మోదీ అన్నారు. ఆ సమయంలో తమ ప్రభుత్వం సకాలంలో స్పందించిందని, దేశీయ ఎల్‌పిజి ఉత్పత్తుల సామర్థ్యాన్ని గరిష్ఠస్థాయిలో పెంచాలని నిర్ణయించామని, సంక్షోభ సమయంలో ఎల్‌పిజి ఉత్పత్తి 54,000 మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఏనాడూ ఎల్‌పిజి ఉత్పత్తి చేయని రిఫైనరీలు కూడా ఆ శక్తిని కూడగట్టుకున్నాయని, పౌరులపై అతి తక్కువ భారాలు పడేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. చాలా తక్కువ సమయంలో 11 లక్షల ఇళ్ళకు పిఎన్‌జి కనెక్షన్లు ఇచ్చామని, దేశీయ వినియోగదారులకు రక్షణ కల్పించామని,ఒక దేశీయ వంటింటి గ్యాస్ సిలిండరు ధర రూ.2000 వరకూ ఉండవచ్చునని నిపుణులు అంచనావేశారని, కానీ ఈనాడు రూ.950లకే వంటగ్యాస్ సిలిండరు లభిస్తోందని, ఎలాంటి ధరలభారం వినియోగదారులపై పడకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బలోత్రా శుద్ధి సముదాయాన్ని బాగుచేసేందుకు గడచిన రెండు నెలలుగా అవిశ్రాంతంగా కృషిచేసి కష్టపడి ఫలితాలు సాధించిన కార్మికులు,అధికారులను ఆయన ప్రశంసించారు. ఏప్రిల్ 20వ తేదీన ఈ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. తర్వాత కార్మికులు దీనికి మరమ్మతులు చేశారు. ఐతే నిర్ణీత ప్రకారం శుక్రవారంనాడు ప్రధానమంత్రి దీనిని ప్రారంభించాల్సి ఉంది. కానీ ఆరోజు పెద్ద పెద్ద గాలులతో రిఫైనరీ ప్రాంతంలో నష్టం వాటిల్లింది. కొన్ని మరమ్మతుల తర్వాత శనివారంనాడు మోదీ ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. గడచిన యాభై సంవత్సరాలలో అమెరికా ఒక్క కొత్త రిఫైనరీని కూడా నిర్మించలేదని, యూరప్‌లో రిఫైనరీ సామర్థ్యం కూడా అదేపనిగా క్షీణిస్తూ వస్తోందని, దేశం ఈనాడు ప్రపంచంలోనే చమురుశుద్ధి సామర్థ్యంలో నాలుగవ స్థానంలో నిలబడిందని,భారతదేశం సమకూర్చుకుంటున్న ఈ సామర్థ్యం ఇంకా ఇంకా ముందుకు కొనసాగుతుందని చెప్పారు.

# నర్సింగ్ ఆఫీసర్ల యూనిఫామ్ మార్చాల్సిందే!

ఆధునిక 'స్కబ్' డ్రస్ కోడ్‌కు 97.7 శాతం మంది మద్దతు

టిఎన్ఎ రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ సర్వేలో వెల్లడి

జీ.ఓ నెంబర్ 12ను సవరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన తెలంగాణ నర్సస్ అసోసియేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ వైద్య సంస్థల్లో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్ల యూనిఫామ్ డ్రెస్ కోడ్‌లో మార్పులు చేయాలని అధిక శాతం నర్సింగ్ ఆఫీసర్లు కోరుతున్నట్లు తెలంగాణ నర్సస్ అసోసియేషన్ (టిఎన్ఎ) నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ సర్వేలో వెల్లడైంది. సర్వేలో పాల్గొన్న వారిలో 97.7 శాతం మంది ప్రస్తుతం అమలులో ఉన్న యూనిఫామ్ స్థానంలో ఆధునిక స్కబ్ యూనిఫామ్‌ను అమలు చేయాలని అభిప్రాయపడగా, కేవలం 2.3 శాతం మంది మాత్రమే ప్రస్తుత విధానాన్ని కొనసాగించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో మొత్తం 2,637 మంది ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. వీరిలో 532 మంది (20.2 శాతం) పురుషులు, 2,105 మంది (79.8 శాతం) మహిళలు ఉన్నారు. విభాగాల వారీగా డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డిపిహెచ్) నుంచి 650 మంది, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ) నుంచి 1,514 మంది, తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి) నుంచి 316 మంది, ఇతర ప్రభుత్వ ఆరోగ్య సంస్థలకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. సర్వే ప్రకారం 2,576 మంది నర్సింగ్ ఆఫీసర్లు ఆధునిక స్కబ్ యూనిఫామ్ అమలుకు మద్దతు తెలపగా, 61 మంది మాత్రమే ప్రస్తుత డ్రెస్ కోడ్‌ను కొనసాగించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధానంగా 2011, 2021, 2024 బ్యాచ్ లకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు అధిక సంఖ్యలో స్పందించగా, హైదరా బాద్ జిల్లా నుంచి అత్యధిక స్పందన నమోదైంది. ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రుల్లో అమలులో ఉన్న ఆధునిక స్కబ్ యూనిఫామ్ తరహాలోనే ప్రభుత్వ నర్సింగ్ ఆఫీసర్లకు కూడా సౌకర్యవంతమైన, వృత్తి నైపుణ్యాన్ని ప్రతిబింబించే, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన యూనిఫామ్ ను అమలు చేయాలని యువ నర్సింగ్ ఆఫీసర్లు కోరుతు న్నట్లు టిఎన్ఎ తెలిపింది. ప్రస్తుతం అమలులో ఉన్న జీ.ఓ. ఎంఎస్. నెంబర్ 12లో ప్రధానంగా మహిళా ఉద్యోగుల యూనిఫామ్ గురించే ప్రస్తావన ఉందని, ప్రభుత్వ వైద్య సంస్థల్లో సుమారు 1,500 మంది పురుష నర్సింగ్ ఆఫీసర్లు పనిచేస్తున్నప్పటికీ, వారి యూనిఫామ్‌పై స్పష్టమైన మార్గదర్శకాలు లేవని అసోసియేషన్ పేర్కొంది. ప్రస్తుత జీఓను సవరించి మహిళా, పురుష నర్సింగ్ ఆఫీసర్లందరికీ ఒకే విధమైన ఆధునిక స్కబ్ యూనిఫామ్‌ను అమలు చేసినా ప్రభుత్వ ఖజానాపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదని టిఎన్ఎ అభిప్రాయపడింది. మారుతున్న వైద్య సేవల అవసరాలు, కాలానుగుణ మార్పులు, నర్సింగ్ వృత్తి గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే జీ.ఓ. ఎంఎస్. నెంబర్ 12ను సవరించి ఆధునిక యూనిఫామ్ డ్రెస్ కోడ్‌ను అమలు చేయాలని తెలంగాణ నర్సస్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

## వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకోండి

అటవీ శాఖ పనితీరును సమీక్షించిన ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వర్షాకాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా వనమహోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం తొలిసారిగా అరణ్య భవన్‌కు వచ్చిన ఆమె శాఖ పనితీరుపై ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. అటవీ ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో అమలవుతున్న కాంపా కార్యక్రమాలు, సామాజిక అటవీ ప్రాజెక్టులు, రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వనమహోత్సవ కార్యక్రమాలు, అటవీ సంరక్షణ చర్యలు, అటవీ సంరక్షణ చట్టం కింద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలు, అనుమతుల మంజూరు ప్రక్రియ, అటవీ భూములకు సంబంధించిన అంశాలతో పాటు శాఖ చేపడుతున్న ప్రధాన కార్యక్రమాల పురోగతిని అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. ప్రతి కార్యక్రమాన్ని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సమయపాలనతో అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని పూర్తిగా వినియోగించుకుని వనమహోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అలాగే అటవీ సంరక్షణ చట్టం పరిధిలోని పెండింగ్ ప్రతిపాదనలను వేగంగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం పెంచి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రాధా న్య కార్యక్రమాల అమలులో నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచేలా కార్యాచరణ రూపొందించాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సిసిఎఫ్‌లు శరవణన్, ఎస్.జె.ఆశా, ప్రియాంక వర్గీస్, క్షితిజతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## జంతర్ మంతర్ వద్ద పోలీసు విధ్వంసం, దురుసు ప్రవర్తన

పోలీస్‌లపై కఠిన చర్యలకు డిమాండ్:

ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు సంయుక్త లేఖ

**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీ జంతర్ మంతర్‌లో కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నిరసన చేస్తున్న ప్రదేశం వద్ద జులై రెండో తేదీన అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్), ఇతర వామపక్ష విద్యార్థులపై పోలీసుల దాడి,అనుచిత ప్రవర్తన, బలప్రయోగం, దురుసుతనం, దుందుడుకు చర్యలను 100 మంది శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు తీవ్రంగా ఖండించారు. కొందరు ప్రదర్శకులను పోలీసులు కొట్టారు. ఎఐఎస్ఎఫ్ విద్యార్థులు అక్కడ ఏర్పాటు చేసుకున్న సంఘీభావ గ్రంథాలయాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. ఛత్రపతి శివాజీ,సర్దార్ భగత్ సింగ్ వంటి స్ఫూర్తివంతమైన యోధులకు సంబంధించిన పుస్తకాలను రోడ్డుమీదకు విసిరికొట్టారు. జ్ఞానానికి, ప్రజాస్వామ్య విలువలకు,మహోన్నతమైన జాతీయ వారసత్వ నాయకులకు ఇది అవమానకరం.పోలీసుల చర్య సిగ్గుచేటు. ఈ చర్యలకు పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలి,విద్యార్థులకు ఉన్న రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలి అని డిమాండ్ చేస్తూ శాస్త్రవేత్తలు,విద్యావేత్తలు,మేధావులు, కార్యకర్తలు ఉమ్మడిగా ఢిల్లీ పోలీస్ కమీషనర్‌కు ఒక లేఖ రాశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఐసిఎఆర్ (భారత వ్యవసాయ పరిశోధనామండలి) ముఖ్యశాస్త్రవేత్త(రిటైర్డ్) డా.రీడ్ మార్లా సహా మేడమ్ జయంతీఘోష్, ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, అన్నేరాజా, సుభాషిణీ హైదర్‌తోపాటు మేధావులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, కార్యకర్తలు పోలీస్ కమిషనర్‌కు రాసిన లేఖపై సంతకాలు చేశారు. ఈ లేఖలో ఉన్న కీలక సారాంశాన్ని డా.రీడ్‌మార్లా శనివారం పత్రికలకు విడుదల చేశారు. విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించి అక్కడ వారు ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయాన్ని ధ్వంసం చేయడంపట్ల ఈ లేఖపై సంతకాలు చేసినవారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలు సహా ఇతర పరీక్షలలో జరిగిన అవకతకలు,నిర్లక్ష్యధోరణి చర్యలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతాపార్టీ జంతర్ మంతర్ వద్ద జూన్ 21వ తేదీ నుండి నిరసన ప్రదర్శన కొనసాగిస్తోంది. ఈ ప్రదేశంలో అఖిలభారత విద్యార్థి సమాఖ్య జూన్ 21వ తేదీన ఒక సంఘీభావ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది. విద్యార్థులు, ప్రదర్శకులు ఈ గ్రంథాలయంలో స్ఫూర్తిమంతమైన గాథలను చదువుకుంటున్నారు. పోలీసులు గురువారంనాడు బలప్రయోగం చేశారు. ఈ పుస్తకాలను రోడ్డుమీదకు విసిరికొట్టారు. కొందరు ప్రదర్శకులపై పోలీసులు దాడి చేశారు. వారిని కొట్టారు. పోలీసులు అవమానకరంగా ప్రవర్తించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, జామియా మిలియా ఇస్లామియా విద్యాలయాలలో కూడా పోలీసులు గతంలో ఇదేవిధంగా ప్రవర్తించన చరిత్రను ఈ సందర్భంగా లేఖలో వారు గుర్తుచేశారు. గ్రంథాలయాలు మానవ జ్ఞానానికి నిలయాలని, శతాబ్దాలుగా మేధావులు, శాస్త్రవేత్తలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను, ఆలోచనలను, తరతరాల సాహిత్యాన్ని అక్షరబద్ధం చేసి పుస్తకాలు భద్రపరుస్తాయని, విద్యార్థులు, జిజ్ఞాసగలవారు అన్వేషణ చేయడానికి వాటిని కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత అందరికీ ఉందని వారు పేర్కొన్నారు. ఈ పోలీసు చేష్టలను మేధావులు, శాస్త్రవేత్తలు, కార్యకర్తలు, విద్యావేత్తలుగా తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలియజేశారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వం 'డబుల్' ఇండ్లను అసంపూర్తిగా వదిలేశారు

### పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బీబీనగర్** : మండలంలోని కొండమడుగు, మక్త అనంతారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కొండమడుగు గ్రామంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ నిర్మాణ పనులను ప్రారంభించిన అనంతరం బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయల అప్పులు చేసి డబుల్ బెడ్రూం ఇండ్లను అసంపూర్తిగా వదిలేసి లబ్దిదారులకు పంపిణి చేయలేదని విమర్శించారు. అనంతరం కొండమడుగు రాగాల రిసార్ట్లో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణపై బిఎల్ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్ఏలు అత్యంత అప్రమత్తంగా పనిచేయాలన్నారు. మాజీ ఎంపిటిసి గోలి నరేందర్ రెడ్డి ఆర్థిక సహాయంలో ప్రైవేటు పాఠశాలల నుండి ప్రభుత్వపాఠశాలలో చేరిన పేద విద్యార్థులకు 20 మందికి సైకిళ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, పొట్టొల్ల శ్యామ్గౌడ్, మండల పార్టీఅధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇంధిరా ప్రేమ జ్యోతి, సర్పంచ్లు పంజాల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా కృషి చేయాలి : ఎస్పి




**ప్రజాపక్షం/సూర్యాపేట** : కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా కోర్టు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పి కె. నరసింహ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీస్ స్టేషన్ల నుండి కోర్టు విధుల పర్యవేక్షణ కోసం పనిచేస్తున్న కోర్టు డ్యూటీ పోలీసు సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిలో నాణ్యత, పారదర్శకత ఉండాలన్నారు. పెండింగ్ ఉండకుండా పనిచేయాలని, కోర్టు వారెంట్, సమన్లు సకాలంలో అందజేయాలని తెలిపారు. సిబ్బంది కోర్టుల్లో సమన్వయంగా, సమయపాలనతో పనిచేయాలని, ఎప్పటికప్పుడు కేసుల స్థితిగతులను రికార్డులలో, అంతర్జాలంలో నమోదు చేసుకోవాలని వివరించారు. బాధితులను, సాక్షులను, నింధితులను సకాలంలో కోర్టులకు ప్రవేశపెట్టి కేసులు పరిష్కారం అయ్యేలా పనిచేయాలని సూచించారు. కేసుల్లో త్వరితగతిన నేరస్తులకు శిక్షలు అమలు అయితేనే క్షేత్రస్థాయిలో నేరాలను అదుపు చేయవచ్చనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. కోర్టు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి రవి, ఇన్స్పెక్టర్ మగ్దూం అలీ, సైబర్ సెక్యూరిటి ఇన్స్పెక్టర్ లక్ష్మి నారాయణ, కోర్టు డ్యూటి పోలీసు సిబ్బంది ఉన్నారు.

## కరోనా ముందటి బస్సులన్నీ పునరుద్ధరించాలి

### సిఐకి సిపిఐ జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి వినతి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదాద్రి భువనగిరి జిల్లాలో కరోనా మహమ్మారి కంటే ముందు నడిపిన అన్ని ఆర్టీసీ బస్సు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన యాదగిరిగుట్ట డిపో సీఐను కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల నుండి మండల ,జిల్లా కేంద్రాలకు పూర్తి స్థాయిలో బస్సులు నడపకపోవడం వల్ల సామాన్య ప్రయాణికులతో పాటు ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నడిచిన అన్ని రూట్ల బస్సులను యధావిధిగా పునరుద్ధరించి ప్రజల రవాణా కష్టాలను తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, పేరబోయిన మహేందర్, యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నయీమ్, నరసయ్యపాల్గొన్నారు.

## గీత కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమం

### ఎక్స్గ్రేషియా, పెన్షన్, భూమి కేటాయింపు డిమాండ్




**ప్రజాపక్షం/మునుగోడు** : గీత కార్మికుల హక్కుల సాధనకై ఉద్యమించాలని తెలంగాణ గీత పనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మరబోయిన లాలయ్య పిలుపునిచ్చారు.శనివారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఆ సంఘం మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లాలయ్య మాట్లాడుతూ గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తులో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు.పెండింగ్లో ఉన్న గీత కార్మికుల ఎక్స్గ్రేషియా వెంటనే చెల్లించాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికుడికి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల పెన్షన్ రూ. 24వేలును రూ. 4వేలుకు పెంచాలని, ప్రతి సొసైటీకి తాటి,ఈత వనం పెంపునకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు.సమావేశానికి తెలంగాణ గీత పనివారల సంఘం మండల అధ్యక్షులు మాధగోని మల్ల య్య అధ్యక్షత వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి వనం వెంకన్న, నాయకులు కైలాష్, యాదయ్య, గంగాదేవి గాలయ్య, రమేష్, నరసింహ,గౌని ప్రసాదులు పాల్గొన్నారు.

## 6న స్పాట్ కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/నడిగూడెం:** సూర్యాపేట జిల్లాలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో రెండు విడతలుగా జరిగిన అడ్మిషన్స్ అనంతరం మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు గానూ ఈనెల 6న సూర్యాపేటలోని ఇమాంపేట గురుకుల కళాశాలల్లో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ డిసివో సిహెచ్ పద్మ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థిని, విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న తర్వాత అభ్యర్థుల మెరిట్ లిస్టును తయారు చేసి మధ్యాహ్నం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు కౌన్సిలింగ్కు వచ్చేటప్పుడు క్యాస్, డేట్ ఆఫ్ భర్త్ సర్టిఫికెట్, టెన్త్ మెమో, మీసేవ ద్వారా తీసుకున్న ఇన్కమ్ సర్టిఫికెట్లు తీసుకుని కౌన్సిలింగ్కు హాజరుకావాలని కోరారు.

# కారుమబ్బులు కమ్ముకున్నా... చిరుజల్లులే...!

### ఎల్నినోతో వర్షపాతంలో వైవిధ్యం
### ఆందోళనలో రైతన్నలు



**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా సూర్యాపేట జిల్లాలో ఆశించిన వర్షాలు లేవు. కారుమబ్బులు కమ్ముకున్నా ఎల్నినో ప్రభావంతో చిరుజల్లులు మాత్రమే పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా నమోదైన వర్షపాతంలో వైవిధ్యం కనిపిస్తుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ మాసంలో జిల్లాలో సాధారణ వర్షపాతం 95.5 మీ.మీ. కాగా 120.3 మీ.మీ. వర్షం కురిసిందని లెక్కలు చెబుతున్నారు. ఈ లెక్కలను బట్టి చూస్తే సాధారణం కన్నా 24.8 మీ.మీ. వర్షాలు ఎక్కువగా కురిసాయని స్ప ష్టం అవుతున్నా ఆ పరిస్థితులు మాత్రం ఎక్కడా కనపడడం లేదు. సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు తాము పంట సాగు ఎలా చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో మొత్తం 23 మండలాలు ఉండగా వాతావరణ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ మాసంలో 95.5 మీ.మీ. వర్షపాతం నమోదు కావల్సి ఉండగా 120.3 మీ.మీ. వర్షపాతం నమోదైనట్లు ప్రకటించారు. సుమారుగా 14 రోజుల వర్షాలు పడ్డట్లు చెబుతున్నారు. నాగారం, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్, జాజిరెడ్డిగూడెం, మోతె, అనంతగిరి, చిలుకూరు, మఠంపల్లి, హుజూర్నగర్ మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలుపగా, తిరుమలగిరి, సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, పెన్పహాడ్, మునగాల, నడిగూడెం, కోదాడ, గరిడేపల్లి, నేరేడుచర్ల, మేళ్ళచెర్వు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారులు లెక్కల ద్వారా స్పష్టమవుతుంది.

**చింతలపాలెం, పాలకవీడులో లోటు వర్షపాతం...**

జిల్లాలోని చింతలపాలెం, పాలకవీడు మండలాల్లో సాధారణంగా కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. చింతలపాలెంలో 80.4 మీ.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావల్సి ఉండగా కేవలం 42.4 మీ.మీ. వర్షపాతం మాత్రమే నమోదు కావడం గమనార్హం. దీంతో 47 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పాలకవీడు మండలంలో సాధారణ వర్షపాతం 88.4 మీ.మీ. కాగా 64.8 మీ.మీ. వర్షపాతం నమోదు కావడంతో 27 శాతం లోటు వర్షపాతం ఉన్నట్లు స్పష్టం అవుతుంది.

**జిల్లాలో నమోదైన వర్షపాతంలో తీవ్ర వైవిధ్యం**

కనబడుతుంది. కొన్ని మండలాల్లో సాధారణం కన్నా ఎక్కువగా వర్షపాతం నమోదు కాగా కొన్ని మండలాల్లో సాధారణం కన్నా లోటు వర్షపాతం నమోదు అయ్యింది. జిల్లాలో భిన్న పరిస్థితులు ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొద్దిపాటి వర్షాలకే మెట్ట పంటలు సాగు చేసిన రైతులు విత్తనాలు విత్తిన తరువాత అంతంత మాత్రమే వర్షాలు పడుతుండడంతో కొన్నిచోట్ల వేసిన విత్తనాలు మొలకెత్తగా మరికొన్ని చోట్ల మొలకెత్తని పరిస్థితి. దీనితో రైతులు మొలకెత్తిన పైరును ఏలా రక్షించుకోవాలి తెలియక సతమతమవుతున్నాడు. ప్రతిరోజు ఆకాశం వైపు ధీనంగా చూస్తూ వరుణ దేవుడ్ని ప్రార్థిస్తున్న పరిస్థితి. కారుమబ్బులు కమ్ముతున్నాయి వర్షం పడుతుందని అనుకున్నా చిరు జల్లులే పడుతుండడంతో చింత తీరడం లేదు.

## నిర్ణీత గడువులోగా దున్నపోతుల గండి ఎత్తిపోతల పనులు

### లిఫ్టు నిర్మాణ పనులను తనిఖీ చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అడవిదేవులపల్లి మండలం చిట్యాల గ్రామ సమీపంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం జరుగుతున్న దున్నపోతుల గండి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలి. శనివారం రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఉమ్మడిగా ప్రాజెక్టు సైట్ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను వారు నిశితంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ప్రాజెక్టు నిర్మాణ పురోగతిపై అక్కడి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రి, పనుల నాణ్యత, నిర్మాణ వేగం, సాంకేతిక అంశాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, నిర్దేశిత కాలపరిమితిలోగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డిమాట్లాడుతూ దున్నపోతుల గండి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయితే నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సాగునీటి వసతి పూర్తిగా మెరుగుపడటంతో పాటు రైతులకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూ పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.

### వచ్చే వేసవి నాటికి నెల్లికల్ లిఫ్ట్ పనులు పూర్తి :మంత్రి

**ప్రజాపక్షం/తిరుమలగిరి /నందికొండ** : వచ్చే వేసవి నాటికి నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.శనివారం నాగార్జునసాగర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న నెల్లికల్ లిఫ్ట్ పనులను మంత్రి పరిశీలించారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు వచ్చే సాగు సీజన్ నాటికి నీరు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి, ప్రజలకు తప్పుడు సమాచారం అందిస్తూ తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగాయని, వాటిని కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ నాయకులు ప్రస్తుత ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి,మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ ధరావత్ శంకర్ నాయక్, నీటిపారుదల శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో లోపాలు ఉండొద్దు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గ వ్యాప్తంగా సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అధికారులు, బూత్ లెవెల్ అధికారులు సమిష్టిగా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం మిర్యాలగూడ పట్టణ శివారులోని నందిపాడు ప్రాంతంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఇంటింటి ఓటరు సర్వేను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్వోలు రికార్డులను నమోదు చేస్తున్న తీరును, ఓటరు ఫారాల పంపిణీని దగ్గరుండి చూసి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. సమాజంలో ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడి ఓటు కూడా జాబితాలో మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న సమయంలో ఎలాంటి సాంకేతిక లేదా నమోదు లోపాలు దొర్లకుండా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని రాజకీయ పక్షాల నాయకులు, ప్రతినిధులు తమ వంతు పూర్తి సహకారాన్ని అందించాలని కలెక్టర్ కోరారు. ఫారాలు నింపే క్రమంలో ఓటర్లలో నిరక్షరాస్యులు ఉన్నట్లయితే, బిఎల్వోలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. వారి నుండి సరైన సమాచారాన్ని సేకరించి, ఫారాలను పూర్తి చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేయాల్సిన బాధ్యత సిబ్బందిదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, ఆయా పోలింగ్ కేంద్రాల బిఎల్వోలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధలు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : అప్పుల బాధలు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జిబ్లక్ పల్లి గ్రామానికి చెందిన మృతురాలు మానస (30) గురువారం ఇంట్లో ఎవరు లేని సమయంలో చిరుత ఫ్యాన్కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలకు 12 ఏళ్ల క్రితం నడిగొండ గణేష్ తో వివాహమైంది. ఫైనాన్స్లో అప్పు తీసుకుని ఒక ఆటో కొనుక్కొని పాత ఇనుపసమాను వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు ఈ క్రమంలో ఒక ఆటో కొనుక్కని పాత ఇనుప సామాను సేకరించి అమ్ముకునే వాడు. ఆటో కొన్న కొద్ది రోజులకే వ్యాపారం సరిగా సాగకపోవడంతో, ఆయన అప్పుల పాలై ఆర్థిక నష్టాలలో ఇరుక్కొని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మృతురాలు మనస్థాపానికి గురై ఫ్యాన్కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి కొండపల్లి యాదయ్య ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.




## 10న రాష్ట్రవ్యాప్తంగా, విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

### వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు

**ప్రజాపక్షం/భువనగిరి** : స్థానిక భువనగిరి పట్టణ కేంద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ అధ్యక్షతనవామపక్ష విద్యార్థి సంఘాల జూలై 10 బంద్ సన్నాహక సమావేశం జరిగింది. రాష్ట్రంలో, దేశంలో విద్యారంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ, విద్యను వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీ, పాఠ్యపుస్తకాలు,యూనిఫాంల బలవంతపు అమ్మకాలు, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను నిర్వీర్యం చేయడం, విద్యారంగానికి బడ్జెట్ను తగ్గించడం వంటి చర్యలు విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుతుందన్నాయి. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు మీడియాతో మాట్లాడుతూ 27వేల ప్రభుత్వ పాఠశాలలు 4వేల క్లస్టర్ ప్రభుత్వ పాఠశాలలుగా కుదింపు నిర్ణయాన్ని ఉపసంహా రించుకోవాలని కోరారు. విద్యా హక్కును పరిరక్షించు కోవడానికి ప్రతీ విద్యార్థి జూలై 10న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్లో భాగస్వామి కావాలనీ, బంద్ను విజయవంతం చేసి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కందుల మధు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జానీ, ఈర్ల రాహుల్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పుట్టాల ఉదయ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ నాయకులు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన చేనేత సహకార సంఘం ఎన్నికల నామినేషన్లు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికలలో భాగంగా శనివారం నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. 9 మంది పాలకవర్గానికి గాను మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అందులో మహిళలు 4 నామినేషన్లు దాఖలు చేశారు. కాగా నేడు నామినేషన్ల పరిశీలన 6న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం తుది జాబితా విడుదల చేయనున్నట్లు ఎన్నికల అధికారి యూసుఫ్ అలీ తెలిపారు.

### ముగిసిన నామినేషన్ ప్రక్రియ

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధిలోని భోగారం చేనేత సహకార సంఘం ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మూడు రోజుల నుండి కొనసాగి జనరల్ విభాగం నుండి 17 మంది అభ్యర్థులు, మహిళా విభాగం నుండి ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. శనివారం పోటీ చేస్తున్న పద్మశాలి సొసైటీ డైరెక్టర్ల అభ్యర్థులు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ ర్యాలీలో బోగారం బీఆర్ఎస్ పార్టీ పద్మశాలి శ్రేణులు,పద్మశాలి కుటుంబ సభ్యులు, సర్పంచ్, మాజీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థులకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## పటేల్ను కలిసిన వెలుగు వెంకన్న



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా వెలుగు వెంకన్న తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిని శనివారం హైదారాబాద్లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి వెలుగు వెంకన్నను శాలువాతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రమణ రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నేరెళ్ళ మధు, మున్సిపల్ కౌన్సిలర్లు పిల్లల రమేష్ నాయుడు, పలగాని కృష్ణ, మేగ్య తండ సర్పంచ్ రాజు నాయక్, నాయకులు వల్దాస్ దేవేందర్, చిలుముల గోపాల్రెడ్డి, యాట ఉపేందర్, పానుగంటి మల్లారెడ్డి, ధరావత్ ధర్మ పాల్గొన్నారు.

## దొడ్డికొమరయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం



### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య త్యాగం, ధైర్యసాహసాలు, ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. దొడ్డి కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరి, సామాజిక దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన కొమరయ్య తెలంగాణ ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారన్నారు. తెలంగాణ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్రాజ్, బిసి వెల్ఫేర్ అధికారి విశాల్, ఉప్పల రమేష్, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి కంచకట్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మన్యం యాదగిరి, టిఎన్జివోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### తెలంగాణ అగ్నికణం దొడ్డి కొమరయ్య
### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : భూమి కోసం,భుక్తి కోసం,తెలంగాణ విముక్తి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య తెలంగాణ అగ్నికణమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ అన్నారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ భూస్వామ్య దేశ్ముఖ్ విసునూరి రామచంద్రారెడ్డి ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో దొడ్డి కొమరయ్య అమరత్వం పొందడంతో యావత్ తెలంగాణ అగ్గిగుండంలా మారిందని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య త్యాగాన్ని తెలంగాణ సమాజం ఎన్నటికీ మరచిపోదని, ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,పట్టణ కార్యదర్శి కె.ఎస్. రెడ్డి,శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య,జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.డి అక్బర్,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీకృష్ణ,పట్టణ సహాయ కార్యదర్శులు విశ్వనాథులు లెనిన్, అలాగే ఎం.నందం, బాసాని వెంకటయ్య,ఆర్.సీతారాములు,వి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



'జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఎయు అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్‌పై పూర్వాజ్, పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు.'

రీల్


## 'కిల్లర్' జ్యోతి పూర్వజ్ పోస్టర్ రిలీజ్



జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సెన్సేషనల్ సై ఫై థ్రిల్లర్ మూవీ 'కిల్లర్'. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఎయు అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్‌పై పూర్వాజ్, పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. వీఎఫ్ఎక్స్ వరక్స్ సహా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలో గ్రాండ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.సూపర్ టాలెంటెడ హీరోయిన్ జ్యోతి పూర్వజ్ బర్త్ డే సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ 'కిల్లర్' చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో సూపర్ వుమెన్ గా, మిస్టీరియస్ వుమెన్ గా జ్యోతి పూర్వజ్ ఎలక్ట్రిఫైయింగ్ లుక్స్‌లో కనిపించి ఆకట్టుకుంటున్నారు. మెలిఫిసెంట్ మూవీలో ఏంజెలీనా జోలిని తలపించేలా జ్యోతి పూర్వజ్ లుక్స్ ఉండటం విశేషం. 'కిల్లర్' సినిమాలో సూపర్ షీ క్యారెక్టర్‌లో జ్యోతి పూర్వజ్ నటన ప్రేక్షకులను మెస్మరైజ్ చేయనుంది.'కిల్లర్' సినిమాలో ప్రేక్షకులు మర్చిపోలేని ఒక ప్రపంచాన్ని డైరెక్టర్ పూర్వాజ్ క్రియేట్ చేస్తున్నారు. ఆయన ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు సీఎన్ఏ ఇంటిగ్రేషన్, రాయ్ ప్రోటోకాల్ కోసం వర్క్ చేసే సైంటిస్ట్ గా కనిపించబోతున్నారు.'కిల్లర్' సినిమా ప్రోగ్రెస్ గురించి డైరెక్టర్ పూర్వాజ్యోతి పూర్వజ్, పూర్వాజ్ , మనీష్ గిలాడ, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి, తదితరు లున్నారు

## ఇవివి సినిమా బ్యానర్‌పై కొత్త సినిమా షురూ

తెలుగు సినిమా రంగంలో ఐకానిక్, పేరెన్నికగన్న నిర్మాణ సంస్థల్లో ఒకటైన ఇవివి సినిమా ప్రతిష్ఠాత్మకంగా తాజాగా ఓ వైవిధ్యమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. లెజెండరీ దర్శకుడు ఇవివి సత్యనారాయణ స్థాపించిన ఈ బ్యానర్‌పై గతంలో 'చాలా బాగుంది', 'మా ఆవిడ మీద ఒట్టు మీ ఆవిడ చాలా మంచిది', 'తొట్టి గ్యాంగ్', 'అత్తిలి సత్తిబాబు ఎల్‌కెజి', 'ఫిట్టింగ్ మాస్టర్', నువ్వంటే నాకిష్టం, కితకితలు వినోదాత్మక చిత్రాలు ప్రేక్షకులను అలరించాయి. ఇప్పుడు ఈ లెజెండరీ బ్యానర్‌పై ఇవివి తనయుడు ఆర్యన్ రాజేష్ మరో నిర్మాత ఎన్.వి.కృష్ణారెడ్డితో కలిసి ఓ సినిమా నిర్మంచబోతున్నారు. నిజ జీవిత కథ ఆధారంగా ఓ ఇంటెన్స్ లవ్ డ్రామాగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హర్ష్ రోషన్ హీరోగా, ప్రియాంక ఆచర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'కోర్ట్' చిత్రంతో మంచి ప్రశంసలు అందుకున్న హర్ష్ రోషన్, తెలుగు సినిమాలో ప్రతిభావంతులైన యువ నటుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఇప్పుడు మరో భావోద్వేగ కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ చిత్రానికి అరుణ్ బాలాజీ, శ్రీ రంజని సంయుక్తంగా దర్శకత్వం వహిస్తారు. ఇవివి సినిమా, ఎన్‌విఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వాస్తవికత, తీవ్ర భావోద్వేగాలు, బలమైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకోనుంది.ఈ చిత్రానికి దర్శకులు: అరుణ్ బాలాజీ, శ్రీ రంజని, డిఒపి: జిజు సన్నీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వినీల్ నల్లమిల్లి వ్యవహరిస్తున్నారు.






## సోనీ లివ్‌లో సమంత కొత్త ప్రాజెక్ట్

సమంత ప్రస్తుతం బ్లాక్ బస్టర్ హిట్‌తో దూసుకుపోతున్నారు. క్రియేటివ్ కంటెంట్ కోసం సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటూ క్రేజీ ప్రాజెక్ట్‌ల్లో సమంత భాగమవుతున్నారు. అతి పెద్ద ఒటిటి మాధ్యమాల్లో ఒకటైన సోనీ లివ్ తమిళంలో ఓ కొత్త ప్రాజెక్ట్‌ను స్టార్ట్ చేస్తోంది. అందులో సమంత ప్రధాన పాత్రలో నటిస్తోంది. ఈ మేరకు సోనీ లివ్ తమిళ్ అనౌన్స్‌మెంట్ చేసింది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను త్వరలోనే తెలియజేస్తామని నిర్మాతలు అంటున్నారు. ఇటీవల విడుదలైన మా ఇంటి బంగారం సినిమా థియేటర్లలో దూసుకుపోతున్న ఈ క్రమంలోనే సమంత ఈ కొత్త ప్రాజెక్ట్‌కి ఒకె చెప్పారు. ఈ కొత్త ప్రాజెక్ట్ గురించి సమంత తన సోషల్ మీడియాలో విషయాన్ని పోస్ట్ చేస్తూ.. 'మార్పును స్వీకరించడం, ప్రయాణాన్ని నమ్మడం, కొత్త ఆరంభాలకు స్వాగతం పలకడం వంటి విషయాలను ఈ ఏడాది నాకు గుర్తు చేసింది. సోనీ లివ్ తమిళ్‌తో కలిసి ఈ కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. మేం ఎంతో ఆసక్తికరమైన ఒక విషయంపై వర్క్ చేస్తున్నాం. త్వరలోనే దానిని మీ అందరితో పంచుకోవడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని అన్నారు.



## 30న థియేటర్లలో 'శ్రీనివాస మంగాపురం'

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని అజయ్ భుపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానిని కూడా ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో సీనియర్ నటుడు డాక్టర్ మోహన్ బాబు పవర్ ఫుల్ పాత్రను పోషిస్తున్నారు. నిర్మాత పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్విని దత్ సమర్పిస్తున్నారు. ఆకట్టుకునే ప్రచార చిత్రాలు, వీడియోలతో ఈ సినిమా ఇప్పటికే మంచి ఆదరణను పొందుతోంది. ఈ చిత్రం జులై 30న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటివరకు విడుదలైన మూడు పాటలు, టీజర్లు, పోస్టర్‌లకు ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందన వచ్చింది. జయకృష్ణ సినిమాటోగ్రఫీని నిర్వహించగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మాధవ్ కుమార్ గుళ్ళపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్. ఈచిత్రానికి సమర్పణ: అశ్విని దత్, నిర్మాత: పి. కిరణ్, ఎడిటర్: మాధవ్ కుమార్ గుళ్ళపాటి, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శాకమూరి నారాయణ స్వామి, ఫైట్స్: రియల్ సతీష్ అందిస్తున్నారు.



## '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' టీజర్ విడుదల

శివరాజ్‌కుమార్ '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' టీమ్... మీడియాకు టీజర్ విడుదల చేసింది. డా. శివరాజ్‌కుమార్, డాలీ ధనంజయ, ప్రియాంక మోహన్, అదితి బాలన్, దర్శకుడు హేమంత్ ఎం.రావు, నిర్మాత వైశాక్ జె గౌడ, ఛాయాగ్రాహకుడు అద్వైత గురుమూర్తి, సంగీత దర్శకుడు చరణ్ రాజ్, ప్రొడక్షన్ డిజైనర్ విశ్వాస్ కశ్యప్ పాల్గొన్నారు ఈ ఈవెంట్ లో పాల్గొన్నారు. టీజర్‌లో '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్' మూవీ వరల్డ్ ని అద్భుతంగా చూపించారు. చిత్రాన్ని స్పై డ్రామాగా తెరకెక్కించారు. లెజెండరీ డా.రాజ్‌కుమార్ ' సిఐడి 999'ని గుర్తు చేస్తూ, నివాళులర్పించేలా ఉంది టీజర్. సినిమా జరిగే సమయం, మిషన్, అనుభవం ఉన్న ఏజెంట్, వృద్ధిలోకి రావాలనుకుంటున్న ఏజెంట్, మాస్క్ మేన్, వాళ్ల కళ్లుగప్పే చెడ్డ వ్యక్తి, అందమైన తల్లి కథ.. ఆఖరిలో ధనంజయ ఇచ్చే ట్విస్టు.. టీజర్‌లో ప్రతిదీ ఆకట్టుకుంటోంది. డా. శివరాజ్‌కుమార్ ఇందులో ఏజెంట్ ప్రకాష్‌గా కనిపించారు. స్క్రీన్ మీద ఫైర్ పుట్టించే ఆయన ప్రెజెన్స్ హైలైట్. అందులోనూ ఏజెంట్‌కి ఉండాల్సిన మోస్ట్ డేంజరస్ వెపన్ దృష్టి. శివరాజ్‌కుమార్ కళ్లు పర్ఫెక్ట్‌గా అందుకు సూట్ అయ్యాయి. టీజర్ ఆఖరిలో ధనంజయను చూసే వరకు, ఆయన పనిలో ఎదుర్కొనే సవాళ్లు మెప్పిస్తాయి. ఈ ఏడాది విడుదలవుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాను హేమంత్ ఎం రావు డైరక్ట్ చేశారు. వైశాఖ్ జె గౌడ నిర్మించారు. వైశాఖ్ జె ఫిలమ్స్ పతాకంపై తెరకెక్కింది. చరణ్ రాజ్ సంగీతం అందించారు. అద్వైత్ గురుమూర్తి ఛాయాగ్రాహకుడిగా పనిచేశారు. విశ్వాస్ కశ్యప్ ఈ సినిమాకు ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరించారు. సురేష్ కాస్ట్యూమ్స్ ఇన్‌ఛార్జ్ గా పనిచేశారు.

## పార్కు స్థలం స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు చేసిన కుట్రను అధికారులు భగ్నం చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండల పరిధిలోని సర్వే నెంబర్లు 873, 882లలో 2000 సంవత్సరంలో 'సాయి శ్రీ నిలయం' పేరుతో 13.31 ఎకరాల విస్తీర్ణంలో 256 ప్లాట్లతో ఒక లేఅవుట్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్లాట్ నెంబర్లు 111, 112, 113, 114, 115, 116 లకు సంబంధించిన మొత్తం 1,970 చదరపు గజాల విస్తీర్ణాన్ని పార్కు కోసం కేటాయించారు. కబ్జాకు గురైన ఈ 1,970 గజాల పార్కు స్థలం మార్కెట్ విలువ సుమారు రూ. 20 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ స్థలానికి చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులు నాటారు. పార్కు స్థలానికి చెందిన సుమారు 400 చదరపు గజాల స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించారు. దాన్ని ప్లాట్లుగా విభజించి, ప్రీకాస్ట్ కాంక్రీట్ బ్లాకులతో ప్రహరీ గోడ కూడా నిర్మించారు. దీనిపై 'సాయి శ్రీ నిలయ రెసిడెన్సీ వెల్ఫేర్ సొసైటీ' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన హైడ్రా బృందం, సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది. కబ్జా నిజమేనని తేలడంతో శనివారం ఉదయం హైడ్రా సిబ్బంది రంగంలోకి దిగారు. పార్కు స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రీకాస్ట్ కాంక్రీట్ ప్రహరీలను భారీ యంత్రాలతో కూల్చివేశారు. అనంతరం పార్కు హద్దులను రీసర్వే చేసి స్పష్టమైన సరిహద్దులను నిర్ణయించారు.



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సందర్భంగా శనివారం మఖ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ

## పైరసీ కంటెంట్ వ్యాప్తిని అరికట్టండి

(మొదటి పేజీ తరువాయి)

టెలిగ్రామ్‌కు కాపీరైట్ ఉల్లంఘన అనేది కేవలం సివిల్ ఉల్లంఘన మాత్రమే కాదని, అది 1957 కాపీరైట్ చట్టం, 1952 సినిమాటోగ్రా ఫ్ చట్టం ప్రకారం క్రిమినల్ నేరం అని కూడా మంత్రిత్వ శాఖ తెలియజేసినట్లు తెలిసింది. 'ప్రభుత్వం ఒక్కో పైరసీ ఛానెల్‌ను గుర్తించే వ రకూ టెలిగ్రామ్ ఇకపై వేచి ఉండజాలదని మంత్రిత్వ శాఖ స్పష్టం చే సింది. ఐటి యాక్ట్ 2000, ఐటి రూల్స్ 2021 అవసరమైన విధంగా ప్లాట్‌ఫారమ్ తగిన శ్రద్ధను ప్రదర్శించిందని నిరూపించడానికి కే వలం ప్రతిచర్యగా, ఛానల్ వారీగా తొలగించే విధానం సరికాకపోవచ్చు' అని అధికారులు చెప్పారు. 'మెటా' పై కేంద్రం ఇటీవల తీసుకున్న నియంత్రణ చర్యల నేపథ్యంలో టెలిగ్రామ్‌కు ఈ నోటీస్ జారీచేయబడింది. బుధవారం ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ వాట్సాప్‌లో ప్రతిపాదిత యూజర్ నేమ్ ఫీచర్‌ను ప్రతిపాదిస్తూ మెటాకు నోటీసు జారీచేసింది.అలాగే బాలల వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల విషయంలో ఆ కంపెనీని వారం తర్వాత పిలిపించాలని నిర్ణయించింది. టెలిగ్రామ్ మరో మెస్సేజింగ్ యాప్ అయిన సిగ్నల్‌కు కూడా వాటి ప్రస్తుత యూజర్‌నేమ్ ఫీచర్‌పై 'మెయిటీ' నోటీసులు జారీ చేసింది. ఇది ఇలాఉండగా, టెలిగ్రామ్ ఫిర్యాదుదారుడి వివరాలను ఐ అండ్ బి మంత్రిత్వ శాఖ కూడా కోరింది. 'పైరసీ కంటెంట్ నిరంతరం అందుబాటులో ఉండటం, నిబంధనలను పాటించకపోవడం లేదా అసంపూర్ణంగా స్పందించడం వంటివి వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం తదుపరి పరిశీలన, చర్యలకు దారితీయవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారతదేశ సృష్టికర్తల ఆర్థిక వ్యవస్థ, చలనచిత్ర పరిశ్రమ, ప్రసారకర్తలు, ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లు, నిర్మాతలు, పంపిణీదారులను రక్షించడానికి ఈ చర్య తీసుకోబడింది' అని ఒక అధికారి తెలిపారు.

## రాష్ట్రానికి భారీ వర్షాల సూచన

**నాలుగు జిల్లాల్లో అతి భారీ హెచ్చరిక**

**మరో తొమ్మిది జిల్లాలకు భారీ వర్ష సూచన**

**పలు జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు-మెరుపుల**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు వర్షాలు ఉధృతంగా కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్‌లో రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. ఆదివారం ఉదయం వరకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, సూర్యాపేట, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో గంటకు 5060 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. మరో 14 జిల్లాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. ఆది, సోమవారం అదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందన్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. బుధ, గురువారాల్లో రాష్ట్రవ్యాప్తంగా గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయన్నారు. గురువారం నుంచి శనివారం వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముండగా, ప్రత్యేక హెచ్చరికలు లేవన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

**అధికారులకు సిఎస్ ఆదేశం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేమాలని సిఎస్ సూచించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పని చేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సిఎస్ సూచించారు. దీంతో వివిధ విభాగాలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు.

## సంస్కరణలు అవసరం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన 'నేషనల్ లీగల్ కాంక్లేవ్'లో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, ఎఐసిసి మహిళా కాంగ్రెస్ జాతీయ అ ధ్యక్షురాలు అల్కా లాంబ, ఇండియన్ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మా ట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలో మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి దేశం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటుందని, రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూనే రాజ్యాంగాన్నే మార్చాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ వంటి మహానేతల చరిత్రను రూపుమాపేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. శ్రీరాముని పేరు చెప్పుకుంటూ ఓట్లు అడుక్కునే సంస్కృతి బిజెపిది అనీ, అభివృద్ధి చేసి చూపించి ఓట్లు అడిగే సంస్కృతి కా ంగ్రెస్‌ది అని పేర్కొన్నారు. నెహ్రూ 2002లో 18 ఏళ్ల వయస్సు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేందుకు సర్ నిర్వహిస్తే, 2026లో ఉన్న ఓట్లను తీసివేసేందుకు మోదీ ప్రభుత్వం సర్ ప్రక్రియ చేపట్టిందని విమర్శించారు. అల్కా లాంబ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఉదయ్ భాను చిబ్ మాట్లాడుతూ యువ న్యాయవాదులు నిరంతరం అధ్యయనం చేయాలని సూచించారు. కోర్టుల్లో కేసుల వాదనలు వినడం, న్యాయపరమై న అంశాలను లోతుగా అధ్యయనం చేయడం, ఎక్కువ కేస్ స్టడీ స్ చదవడం ద్వారా వృత్తిపరమైన పునాది బలపడుతుందని చె ప్పారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాజకీయా లు, మీడియా సహా అనేక రంగాల్లో కాలానుగుణంగా సంస్కరణలు వస్తున్నాయని, న్యాయ వ్యవస్థలోనూ అవసరమైన సంస్కరణలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయ వ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడు ప్రభుత్వాలు బలపడతాయని, అందువల్ల ప్రభుత్వం న్యాయవ్యవస్థ మధ్య సమతుల్యత అత్యంత కీలకమన్నారు. న్యాయ సంస్కరణలపై ఈ వేదిక లోతైన చర్చ జరిపి, న్యాయ వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా సూచనలు చేయాలని కోరారు. అద్దంకి దయాకర్ మా ట్లాడుతూ ప్రస్తుతం దేశంలో న్యాయం మాట్లాడటమే అన్యాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం ప్రశ్నపత్రం చోరీ, ఓటు చోరీ, సీటు చోరీతో పాటు భవిష్యత్తులో దేశమే చోరీ అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. జక్కిడి శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ కల్పించిన ఈ అవకాశాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకుని న్యాయ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

## విస్తరిస్తున్న సిఆర్ ఫౌండేషన్

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిపోతుంది. తమ సంతానం అందుబాటులో లేకపోవడం మెరుగైన ఉపాధి అవకాశాల కోసం దేశ,విదేశాలలో ఉండడంతో వృద్ధాశ్రమాలవైపు తమను నెట్టివేయబడుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు వీరి బలహీనతను సొమ్ము చేసుకునే ధోరణి పెరిగి పట్టణాల్లో వృద్ధాశ్రమాలు ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నాయి.

స్వాతంత్ర్యానంతరం మనదేశంలో కొన్ని రాజకీయ పక్షాలు కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్న రష్యాలో వృద్ధులు పట్ల తీవ్రవివక్షత చూపిస్తారని వారు పనిచేయకపోతే చంపడానికి కూడా సిద్ధపడతారని అపోహలు ప్రచారంలో వుండే ది. కమ్యూనిస్టులే వృద్ధుల పట్ల అమిత ప్రేమాభిమానాలు చూపుతారని వారిని సమాజంలో సగౌరవంగా చూస్తారని సోషలిస్ట్ దేశాలు ఆదర్శంగా రుజువు చేశాయి. మనదేశంలో సిపిఐ అగ్ర నాయకుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు( సి ఆర్) ఈవిషయం లో ఎందరికో మార్గదర్శకుడయ్యాడు. వృద్ధుల సంక్షేమ పట్ల ఎంతో నిబద్ధత కలిగిన అంతటి మహనీయుడి ప్రేరణతో 1994 లో హైదరాబాద్లో సి ఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ స్థాపించబడింది. ఉమ్మడి రాష్ట్ర రాజధానిగా హైదరాబాదులో ప్రారంభించబడ్డ సి.ఆర్ ఫౌండేషన్ నేడు రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో విస్తరణ కు శ్రీకారం చుడుతోంది. కడప జిల్లా మూడు ఎకరాల స్థలంలో నిర్మించిన 'జీవని వృద్ధాశ్రమం' ( ఓల్డ్ ఏజ్ హోమ్) నిర్వహణ బాధ్యతలు, గుంటూరు జిల్లాలో నాలుగు ఎకరాల్లో హోం స్థాపనకు, నెల్లూరు జిల్లా గూడూరులో ఒక ఎకరా స్థలంలో వృద్ధాశ్రమ స్థాపనకు కార్యాచరణ దిశగా ముందుకెళ్తోంది.

**జీవని ఓల్డ్ ఏజ్ హోమ్**

సిఆర్ ఫౌండేషన్ కార్యక్రమాలు పట్ల అమిత ఆసక్తి నిర్వహణలో కొనసాగుతున్న భక్తాశ్రద్ధలు సున్నితంగా మొదటి నుండి గమనిస్తున్నటువంటి ఆదర్శ జంట అభ్యుదయవాదులు డాక్టర్ సంజీవమ్మ మాచిరెడ్డిల ఆధ్వర్యంలో కడప జిల్లా సిద్ధవటం మండలం నేకనాపురం వద్ద 2019లో సొంత స్థలంలో, సొంత నిధులతో జీవని ఓల్డ్ ఏజ్ హోమ్‌ను ప్రారంభించారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో రు.3 కోట్ల వ్యయంతో 15 గదులతో ఒక అంతస్తు పూర్తి చేసి అందులో భోజనశాల, గ్రంథాలయం, సమావేశ మందిరం ఏర్పాటు చేశారు. మరో అంతస్తు నిర్మాణ దిశగా ముందుకు సాగుతోంది. రాయలసీమ ప్రాంతంలో పేదల కోసం అనాథ వృద్ధుల కోసం సిఆర్ ఆశయ స్ఫూర్తితో ఆశ్రమంలో 20 మంది వృద్ధులకు నామమాత్రపు రుసుముతో ప్రవేశం కల్పించారు. శేషాచల కొండల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించబడ్డ జీవని వృద్ధాశ్రమం నిర్వహణ బాధ్యతలకు ఏర్పడ్డ ట్రస్టుకు మాచిరెడ్డి అధ్యక్షులుగాను కార్యదర్శిగా డాక్టర్ సంజీవమ్మ, సభ్యులుగా సిపిఐ నేతలు కె. రామకృష్ణ, జి. ఒబులేసు, ఎల్. నాగ సుబ్బారెడ్డిలు వ్యవహరిస్తున్నారు. వయోభారం రీత్యా నిర్వహణ కష్టమని భావించిన సంజీవమ్మ, మాచిరెడ్డిలు సి ఆర్ స్ఫూర్తితో జీవని వృద్ధాశ్రమాన్ని గౌరవ అధ్యక్షులు డా. కె. నారాయణ,, చేర్మెన్ ము ప్పాల నాగేశ్వరావు సమక్షంలో ఫౌండేషన్ కు పూర్తిస్థాయి హక్కులు ఇటీవల బదలాయించారు. ఈనెల 5 న పునః ప్రారంభ కానున్న ఈ ఆశ్రమంలో పాలీ క్లినిక్ స్థాపన కోసం కడప జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వము సహకారం అందిస్తున్నాయి..

సి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు రాంప్రసాద్ రెడ్డి, రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అతిథులుగా పాల్గొంటున్నారు. సి ఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె. నారాయణ అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య, సి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ముప్పాళ్ళ నాగేశ్వరావు, విశాలాంధ్ర మేనేజర్ హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాయలసీమ ప్రాంతంలో ప్రముఖ సేవా, సాంస్కృతిక పరిశోధనా వికాస కేంద్రంగా ఈ ఆశ్రమం పురోభివృద్ధి చెందగలదని పలువురు ఆకాంక్షిస్తున్నారు..

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com